జులై
2015

111

సంపుటి : 10 సంచిక : 2

వెల రు. 10 /-

## ఈ సంచికలో........

బిజెపి సంవత్సర పాలన: కార్పొరేట్లకు మోదం ప్రజలకు ఖేదం

సంస్కరణలు - పారిశ్రామిక వివాదాలు

భారత దేశంలో మానవ హక్కులు

మహోన్నత యుద్ధ విజయాన్ని స్మరించుకుందాం

తెలంగాణలో బలపడుతున్న నిరంకుశ ధోరణులు

యువతరానికి 'విప్లవ సందేశం'

చైనా శతాబ్దం

యజ్ఞోపవీతం వీడి విప్లవపథం పట్టిన పోరాట యోధుడు పర్స సత్యనారాయణ

దురభిమానాన్ని రెచ్చగొట్టడం ద్వారా పాలకవర్గాలు ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తాయి

నివాళి

## యజ్ఞోపవీతం వీడి విప్లవపథం పట్టిన పోరాట యోధుడు

# పర్సా సత్యనారాయణ

యు. రామకృష్ణ

సంప్రదాయ సనాతన కుటుంబంలో జన్మించిన ఆయన పేదరికం వల్ల పరుల పంచన ఉండి చదువుకోవాల్సి వచ్చింది. బతుకుదెరువు కోసం అష్టకష్టాలు పడి ఓ కమ్యూనిస్టు తోడ్పాటుతో బొగ్గు గనుల్లో చిన్న గుమాస్తాగిరి సంపాదించారు. అక్కణ్ణుంచే ఆయన జీవితం మలుపు తిరిగింది. యజ్ఞోపవీతం వదిలి విప్లవపథానికి మరలింది. తాను పనిచేస్తున్న సంస్థలో కార్మికుల కష్టాన్ని దోచుకునే యాజమాన్యానికి వ్యతిరేకంగా రహస్యంగా యూనియన్ నిర్మితమవుతుంటే దానికి ఆకర్షితుడై ఆ కార్యకలాపాల్లో పాల్గొనడం ప్రారంభించారు. తరువాత తానే ఆ యూనియన్‌కు నాయకుడయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో కార్మికవర్గాన్ని సంఘటిత పరిచి అనేక కార్మికోద్యమాలకూ నేతృత్వం వహించారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టి పోరాడారు. పట్టుబడిన ఆయన, పోలీసు క్యాంపుల్లో తీవ్ర చిత్రహింసలకు గురయ్యారు. అనేకసార్లు అజ్ఞాత, జైలు జీవితాలు గడిపారు. ఎమ్మెల్యేగా తన జీతభత్యాలన్నీ పార్టీకే ఇచ్చివేశారు. పార్టీ ఇచ్చిన పరిమిత భత్యంతోనే జీవితాన్ని గడిపారు. చివరికి ఆసుపత్రిలో పడకపై ఉన్నప్పుడు పరామర్శకు వచ్చిన బంధువులు, మిత్రులు తన చేతిలో పెట్టిన నగదును కూడా కార్మికోద్యమానికే సమర్పించిన త్యాగధనుడాయన. ఏడు దశాబ్దాల తన విప్లవోద్యమంలో అత్యున్నత వ్యక్తిత్వం, విధానాల పట్ల నిబద్ధత, ఉక్కు క్రమశిక్షణ, ఉత్తమోత్తమ విలువలు, అలుపెరగని శ్రమ, మహోన్నత త్యాగం ఆయన మిగుల్చుకున్న ఆస్తిపాస్తులు. ఆయనే పర్సా సత్యనారాయణ. ఇటీవలనే వృద్ధాప్యం కారణంగా తన 91వ ఏట కన్నుమూశారు.

పర్సా సత్యనారాయణ గుంటూరు జిల్లా పాత సత్తెనపల్లి తాలూకా కంభంపాడులో పేద సంప్రదాయ సనాతన కుటుంబంలో వెంకమరాజు, వెంకటసుబ్బమ్మ దంపతులకు 1924లో జన్మించారు. ఆరుగురు సంతానంలో ఆయన



చివరివారు. వారి కుటుంబానికి కొద్దిపాటి పొలమున్నా కౌలుకిచ్చేవారు. అది వారి కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోయేది కాదు. 'పర్సా' ఊళ్లోని ఎయిడెడ్ స్కూల్లో నాలుగో తరగతి వరకూ, దుగ్గిరాలలో థర్డ్ ఫారం వరకూ, గుంటూరులో కాంగ్రెస్ సత్యాగ్రహి బొడ్డేపల్లి సోమయాజుల సాయంతో అక్కడ ఎస్ఎస్ఎల్‌సి వరకూ చదివారు. ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కరస్పాండెంట్, ఏజెంటు కూడా అయిన సోమయాజులు వద్ద ఉంటూ, ఆ పత్రికలను చందాదారులకు పంపిణీ చేస్తూ చదువు కొనసాగించారు. ఆంగ్లభాషలో పరిజ్ఞానం సంపాదించారు. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగుతున్న ఆ రోజుల్లోనే టంగుటూరి ప్రకాశం పంతులు ప్రసంగించిన ఓ సభకు వెళ్లారు. ఆ సభలోనే రచయిత, కవి, చిత్రకారుడైన అడవి బాపిరాజు పాడిన దేశభక్తి యుత పాటలు ఆయనను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పరీక్షలు రాశాక సెలవుల్లో తూములూరులో ఉన్న మరో మేనమామ ఇంటికి వెళ్లారు. వారింటి ముందే ఓ గ్రంథాలయం ఉండేది. సెలవుల కాలమంతా పుస్తకాలు చదవడం దినచర్యగా ఉండేది.

ఆ తరువాత అప్పటి వరంగల్ జిల్లా కొత్తగూడెం (ప్రస్తుతం ఖమ్మం జిల్లా) సమీపాన గల సింగరేణి ప్రాంతంలో పటేల్, పట్వారీల వద్ద గుమాస్తాగా పనిచేసే సోదరుని వద్దకు వెళ్లారు. తల్లిదండ్రులు కూడా ఆయన వద్దే ఉంటున్నారు. అక్కడ వారి కుటుంబం జరుగుబాటు కష్టమై దయనీయ స్థితిలో జీవిస్తోంది. అక్కడే జబ్బుపడి తండ్రి మరణించారు. యువకుడైన 'పర్సా'కు ఏదైనా పని కావాలి. అతడికి చిన్నపాటి ఉద్యోగం ఇప్పించాలని చిన్నాన్న అభ్యర్థనతో సింగరేణి బర్లీఫిట్ గనిలో గుమాస్తాగా పనిచేసే మిన్నికంటి పర్వతాలు ఆ బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నారు. పర్వతాలు ఓ రోజున సింగరేణి హెడ్డాఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్న దేవూరు శేషగిరిరావుకు 'పర్సా'ను పరిచయం చేశారు. శేషగిరిరావు సింగరేణి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పుచ్చలపల్లి సుందరయ్య పంపగా అక్కడకొచ్చిన వ్యక్తి. ఆయన పరిచయంతో 'పర్సా'కు సింగరేణి రామవరం నెం.2 ఇంక్లెయిన్ (ఎ 1-2)లో గుమాస్తా పని దొరికింది. అప్పటికాయన వయస్సు 19ఏళ్లు.

శేషగిరిరావు సింగరేణిలో ఉద్యోగం చేస్తూనే రహస్యంగా యూనియన్ నిర్మాణం చేస్తున్నారు. అది రెండో ప్రపంచ యుద్ధకాలం. కాబట్టి బొగ్గు, రైల్వేరంగాల్లో ఎలాంటి యూనియన్ కార్యకలాపాలూ నిర్వహించడానికి వీల్లేదు. బొగ్గురంగంలో మరింత నిషేధాజ్ఞలు ఉండేవి. అందువల్ల రహస్యంగా కార్మికసంఘాన్ని నిర్మించే కృషి చేస్తుండేవారు. తనకు అనుకూలంగా ఉన్నవారితో పరిచయాలేర్పరుచుకుని యూనియన్ పెడితే ఎలాంటి ఫలితాలు వచ్చేదీ చెబుతూ వారిని చైతన్యవంతుల్ని చేస్తుండేవారు. 'పర్సా' మంచి కుర్రాడని భావించిన శేషగిరిరావు, ఆయన పనిచేసే డిపోలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు సమ్మయ్య అనే సమ్ములు ద్వారా వివరాలు సేకరిస్తూ క్రమంగా యూనియన్ కార్యకలాపాల్లోకి తీసుకువచ్చారు. చివరికి సమ్ములే 1943లో 'పర్సా'కు కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వమిప్పించారు. నాటి ప్రజాశక్తి వార పత్రికలో సింగరేణిలో కార్మిక సమస్యలపై వార్తలు రావడంతో సంస్థలో ఎవరో యూనియన్ నిర్మిస్తున్నారని యాజమాన్యం పసిగట్టింది.

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. యజ్ఞోపవీతం వీడి విప్లవపథం పట్టిన పోరాట యోధుడు పర్స సత్యనారాయణ
– యు. రామకృష్ణ ........ 2

2. బిజెపి సంవత్సర పాలన: కార్పొరేట్లకు మోదం ప్రజలకు ఖేదం
– బి.వి. రాఘవులు .... 4

3. సంస్కరణలు - పారిశ్రామికవివాదాలు
– ఆర్. శ్యాంసుందర్ .. 7

4. భారత దేశంలో మానవ హక్కులు
– తీస్తా సెతల్వాద్ .... 16

5. మహోన్నత యుద్ధ విజయాన్ని స్మరించుకుందాం
– జాన్ చెరియన్...... 22

6. తెలంగాణలో బలపడుతున్న నిరంకుశ ధోరణులు
– ఎస్. వీరయ్య ........ 25

7. యువతరానికి 'విప్లవ సందేశం'
ఎం. నిర్మల్‌కుమార్ ..... 27

8. చైనా శతాబ్దం
– అతుల్ అనేజా ....... 31

9. దురభిమానాన్ని రెచ్చగొట్టడం ద్వారా పాలకవర్గాలు ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తాయి
– బివి రాఘవులు........... 36



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822
మేనేజర్: 040-27673787
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# సంక్షోభం

పెట్టుబడిదారీ ప్రపంచం మరో సంక్షోభం ముంగిట నిలుచుందని గత కొద్ది మాసాలుగా అనేక మంది ఆర్థిక వేత్తలు చెబుతున్న విషయాన్ని ఇటీవల మన రిజర్వు బ్యాంకు గవర్నర్ రఘురామ్ రాజన్ నిర్ధారించడంతో గగ్గోలు ప్రారంభమైంది. ఎందుకంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ రానున్న సంవత్సరాల్లో చైనాను మించిపోయి రెండంకెల సంఖ్యను దాటుతుందని చెబుతూ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వదులుతున్న బుడగల్లోని గాలిని రాజన్ ప్రకటన తీసేసింది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఇప్పటిలాగానే ఎవరి మట్టుకు వారు ఆర్థిక రక్షణ చర్యలు తీసుకుంటూ పోతే ప్రపంచం 1930ల నాటి ఆర్థిక సంక్షోభాన్ని చవి చూస్తుందని రాజన్ హెచ్చరించారు. 2008 సంక్షోభానికి ముందుకూడా ఈయన ఇటువంటి హెచ్చరికే చేయడం, అది నిజం కావడం జరిగింది. అందుకే ప్రపంచ నేతలంతా ఆయన ప్రకటనకు ప్రాధాన్యత నిస్తున్నారు. కానీ సంక్షోభ నివారణకు ఆయన ఇచ్చిన సలహా మాత్రం పాటించే స్థితిలో ఎవ్వరూ లేరు.

ప్రపంచ పెట్టుబడిదారీ నేతలంతా కూర్చుని సంక్షోభం రాకుండా నివారిచడానికి ఉమ్మడిగా చర్యలు తీసుకోవాలని రఘురామ్ రాజన్ సూచించారు. ఆయన చేసింది మంచి సూచనేకదా అనిపించవచ్చు. కాని ఆయన సూచన 'తోడేళ్లను మాంసం తినడం మానుకోవా'లన్నట్లుంది. ఒకరి కుత్తుక మరొకరు కోసుకునే పోటీ పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం. నయా-ఉదారవాదం ప్రబోధించే స్వేచ్ఛా మార్కెట్ సిద్ధాంతం దాన్నే చెబుతోంది. రాజన్ చెప్పే సలహా ఆ సిద్ధాంతానికి విరుద్ధంగా ఉంది. అందువల్ల పెట్టుబడిదారీ దేశాలు కూర్చుని ఉమ్మడి నిర్ణయం తీసుకునే అవకాశమూ లేదు, ఆ విధంగా కాకుండా సంక్షోభాన్ని నివారించే మరో మార్గమూ లేదు. నేటి పెట్టుబడిదారీ ప్రపంచం ఎదుర్కొంటున్న సందిగ్ధం అదే.

ప్రస్తుతం గ్రీసులో నెలకొన్న సంక్షోభం రానున్న ప్రపంచ వ్యాపిత సంక్షోభానికి సూచనగా పలువురు ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంలో ఐరోపా సెంట్రల్ బ్యాంకు, ఐఎంఎఫ్, ఐరోపా యూనియన్ల దుష్ట త్రయం పాత్ర చూస్తే పరిస్థితి మనకు అర్ధమవుతుంది. ఈ దుష్ట త్రయం గ్రీసును 'రక్షించేందుకు' ఇచ్చిన ప్రతి మందూ వికటించి చివరికి ఆ దేశాన్ని కోలుకోలేని సంక్షోభంలోకి నెట్టేసింది. గ్రీకు ప్రజలు దుష్టత్రయం కుట్రలను తిప్పికొట్టేందుకు తమకు అనుకూలంగా పనిచేస్తుందని వామపక్ష 'సిరిజా' పార్టీని ఎన్నుకున్నారు. ఇప్పుడు దుష్టత్రయం షరతులకు లోబడి నాశనం కావడమా, ఇక్కట్లు ఎదురైనా ఎదిరించి నిలబడ్డమా అనే మూల మలుపులో గ్రీసు నిలుచుంది.

నేడు గ్రీసు దేశంలో ప్రజలకూ, నయా-ఉదార వాద విధానాలకూ మధ్య జరుగుతున్న ఈ పోరాటం రేపు ప్రపంచమంతటా విస్తరించే అవకాశాలున్నాయి. ప్రపంచం మరో సంక్షోభాన్ని ఎదుర్కోవడం అంటే ఆ సంక్షోభ భారాలు సామాన్య ప్రజలమీదికి నెట్టే క్రూర చర్యలను ఎదుర్కోవడమే. సంక్షోభం బాధలతోబాటు గ్రీసులో మాదిరిగా శ్రామిక వర్గ పోరాటాలు విస్తరించే అవకాశాలను కూడా కల్పిస్తుంది. చైనీస్ భాషలో సంక్షోభాన్ని రెండు అక్షరాల్లో చెబుతారట. ఒక అక్షరం ప్రమాదాన్ని సూచిస్తే రెండోది అవకాశాన్ని సూచిస్తుంది.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ. 10**, సంవత్సర చందా:**రూ. 100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.



**చిరునామా**

మేనేజర్,
మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),
అజామాబాద్, హైదరాబాద్- 20

## బిజెపి సంవత్సర పాలన

# కార్పొరేట్లకు మోదం ప్రజలకు ఖేదం



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

బి.వి. రాఘవులు

కేంద్రంలో బిజెపి కూటమి అధికారానికి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఈ సంవత్సరంలో ఏవో మహత్కార్యాలు నిర్వహించినట్టుగా భారీగా ప్రచారం నిర్వహించింది. మీడియాలో వ్యాపార ప్రకట నలు గుప్పించింది. మంత్రులు, బిజెపి నాయకులు పుంఖాను పుంఖాలుగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. సభలు జరిపారు. మోడీ జపంతో అందరూ తరించిపోయారు. ఈ ప్రచార పటాటోపం ప్రక్కన పెడితే ఈ ఏడాది పాలనను చూసి ప్రజలు సంబరపడాల్సిందేమీ లేకపోగా, కొన్ని ప్రమాదకరమైన పోకడలు పెరగటం పట్ల ఆందోళన చెందాల్సిన పరిస్థితి దాపురించింది.

యుపిఎ అసమర్థ పాలన మూలంగా గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను సమర్థవంతుడైన మోడీగారి నాయకత్వాన పట్టాలెక్కించి, శరవేగంగా పరుగులెత్తిస్తామని బిజెపి చెప్పిన మాటలు ఊకదంపుడేనని ఇప్పుడు తేటతెల్లమవుతున్నది. ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత కొనసాగుతూనే ఉన్నది. విదేశాల్లో ఉన్న నల్లడబ్బును దేశానికి రప్పిస్తామని, యుపిఎ హయాంలో కంపుకొట్టిన అవినీతి కుంభకోణాలకు తావులేకుండా స్వచ్ఛమైన పాలనను అందిస్తామని పలికిన మాటలన్నీ ఓట్లకోసం ఆడిన బొంకులేనని తేలిపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బలపడడానికి మతోన్మాదాన్ని రెచ్చగొట్టినా, అధికారంలోకి వస్తే ప్రభుత్వ స్థిరత్వం కోసం మతోన్మాదం నుండి బిజెపి దూరంగా ఉంటుందని ఆశించిన చాలామంది మధ్యతరగతి ప్రజలకు నిరాశే మిగిలింది. వివిధ ప్రాంతాల్లో మతకలహాలు పెచ్చరిల్లాయి. బిజెపి మంత్రులు, ఎంపీలు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారు. కేంద్రంలో వచ్చిన అధికారాన్ని ప్రజల్లో శాశ్వతంగా మతవిభజన సృష్టించడానికి వినియోగించుకొంటున్నదనే విషయం విదితమవుతున్నది. బిజెపి ప్రభుత్వ సంవత్సర పాలన పూర్తిగావడం, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టి 40 సంవత్సరాలు పూర్తికావడం కాకతాళీయంగానైనా ఒకే కాలంలో జరిగాయి. రెండు సందర్భాలను పోల్చిచూసి, ఆనాడు ప్రజాస్వామ్యానికి ఎటువంటి విఘాతం కలిగిందో ఇప్పుడు మోడీ పాలనలో కూడా ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే ధోరణులు పెరుగుతున్నాయని అనేక మంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

యుపిఎ హయాంలో అభివృద్ధికి పక్షవాతం వచ్చిందని, తాము అధికారానికి వస్తే అభివృద్ధితో గుర్రపు స్వారీ చేయిస్తామని మోడీ చెప్పారు. ఈ మాటలను మధ్యతరగతిలో చాలా భాగం నమ్మింది. బిజెపి కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిపోయినా ఆర్థికాభివృద్ధి పుంజుకున్న దాఖలాలు లేవు. పారిశ్రామికోత్పత్తి గానీ, వ్యవసాయ రంగం గానీ, సేవారంగం గానీ పెరగడం లేదు. వ్యవసాయ రంగం గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఇంకా సంక్షోభంలో కూరుకుపోయే సూచనలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ కార్మికుల వేతనాల పెరుగుదల 3.6 శాతానికి పడిపోయింది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకొనేందుకు కూడా ఇది సరిపోదు. రైతులకు కనీస మద్దతు ధర పెరుగుదల ఐదు శాతం కూడా లేదు. ప్రభుత్వం గత సంవత్సరం కన్నా 30 శాతం తక్కువగా ఆహార ధాన్యాలను సేకరించింది. ఆహార ధాన్యాల కొనుగోలు నుండి ప్రభుత్వం వెనుకంజ వేయడం ద్వారా రైతాంగాన్ని మార్కెట్ ఒడిదుడుకులకు బలి చేసింది. ఈ రకంగా వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో పడిపోతుంటే ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు పెట్టింది. రైతాంగంలో గతం కన్నా ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే అది ఎన్‌డిఎ తెచ్చిపెట్టిన వ్యవసాయ సంక్షోభ ఫలితమే.

వాస్తవాలు ఇలా ఉంటే అంకెల గారడీలు చేసి, ఈ సంవత్సరంలో ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకున్నదని ప్రజలను, ప్రపంచాన్ని నమ్మించేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. కాంగ్రెస్ హయాంలో మందగించిన ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం 7.3 శాతం అభివృద్ధి సాధించిందని, మరి కొద్దికాలంలోనే 8-9శాతానికి చేరుకుంటుందని బిజెపి ప్రతినిధులు డంభాలు పలుకుతున్నారు. స్థూల జాతీయోత్పత్తి లెక్కలను తయారుచేయడానికి పునాది (బేస్) సంవత్సరాన్ని మార్చడం ద్వారా కృత్రిమంగా లెక్కలను తయారుచేశారని, బిజెపి చెబుతున్న జిడిపి లెక్కలు అంకెల గారడీ అని కమ్యూనిస్టులు మాత్రమే కాక, అనేకమంది మేధావులు కూడా విమర్శిస్తున్నారు. రిజర్వుబ్యాంక్ గవర్నర్ రఘురామ్ రాజన్ ప్రభుత్వం చెబుతున్నది వాస్తవ అభివృద్ధి కాదని, గణాంకాల మార్పు వలన వచ్చిన పెరుగుదల మాత్రమేనని చెప్పారు. ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రంగరాజన్ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. తాజా వివరాలను పరిశీలిస్తే అంకెల గారడీతో ప్రకటించిన అభివృద్ధి రేటు కూడా సాధ్యం కాకపోవచ్చని ప్రభుత్వ ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు.

సంపూర్ణమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చామన్న అహంకారం తమ హిందుత్వ ఎజెండాను నగ్నంగా అమలుజేయడంలో బిజెపి, సంఘ్‌పరివార్ శక్తుల్లో అడుగడుగునా కన్పిస్తున్నది. గత సంవత్సర కాలంలో అనేకచోట్ల ఈ శక్తులు మత కలహాలను రెచ్చగొట్టాయి. ఢిల్లీలో ఎన్నికలకు ముందు చర్చిలపై దాడులు

చేయడంగానీ, ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్ ప్రాంతంలో మత ఘర్షణలను సృష్టించడం గానీ, ఈ మధ్యనే హర్యానాలోని అటాలీ గ్రామంలో మైనారిటీలపై దాడిచేసి, ఆస్తులను ధ్వంసం చేయడం గానీ పెరుగుతున్న మతోన్మాదశక్తుల ఆఘాయిత్యాలకు తార్కాణాలు. ఈ సంవత్సర కాలంలో మతఘర్షణలకు సంబంధించిన ఘటనలు దేశవ్యాపితంగా పెరిగాయి. బిజెపి, సంఘ్‌పరివార్ నాయకులు విద్వేషాలను రెచ్చగొట్టే ప్రకటనలు చేయటం నిత్యకృత్యం అయింది. కేంద్ర సహాయమంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి యోగా ఇష్టం లేనివారు పాకిస్థాన్ వెళ్ళవచ్చని అనడం, బిజెపి కార్యదర్శి రామ్ మాధవ్ ఉపరాష్ట్రపతి అన్సారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, అయోధ్యలో వివాదాస్పద స్థలంలో రామాలయం కట్టితీరతామని విహెచ్‌పి అధినేత మాట్లాడటం ఇందుకు తాజా ఉదాహరణలు.

**❝ విద్యావ్యవస్థను మొత్తాన్ని కాషాయీకరణ చేయాలన్న ప్రయత్నాలు ఈ కాలంలో ముమ్మరమయ్యాయి. అనేక పరిశోధనా సంస్థల స్వయం ప్రతిపత్తికి తిలోదకాలిస్తూ, సంఘ్ పరివార్ అజెండాను అమలుజరిపే వ్యక్తులను అర్హతలతో నిమిత్తం లేకుండా ఆ సంస్థలకు అధినేతలుగా నియమిస్తున్నది. ❞**

విద్యావ్యవస్థ మొత్తాన్ని కాషాయీకరణ చేయాలన్న ప్రయత్నాలు ఈ కాలంలో ముమ్మరమయ్యాయి. అనేక పరిశోధనా సంస్థల స్వయం ప్రతిపత్తికి తిలోదకాలినస్తూ, సంఘ్‌పరివార్ అజెండాను అమలుజరిపే వ్యక్తులను అర్హతలతో నిమిత్తం లేకుండా ఆ సంస్థలకు అధినేతలుగా నియమిస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ అనుచరుడన్నదే తప్ప ఇంక ఏ అర్హత లేని ఒక తృతీయశ్రేణి నటుడిని తాజాగా అఖిల భారత ఫిలిం, టెలివిజన్ ఇనిస్టిట్యూట్ అధినేతగా నియమించింది. పాఠ్య పుస్తకాలను పూర్తిగా మార్చివేయడానికి పథకాలను రూపొందించింది. ఆఖరికి ప్రధానమంత్రి మోడీయే సైన్సు కాంగ్రెస్‌ను కూడా అశాస్త్రీయ భావాలను వ్యాప్తి చేయడానికి వినియోగించుకోవడం పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తున్నది. సంవత్సర కాలంలోనే లౌకిక విలువలకు, ప్రజల ఐక్యతకు బిజెపి చేసిన హానిని చూస్తే, రాబోయే నాలుగు సంవత్సరాలు బిజెపి పాలన ఇలాగే కొనసాగితే ఎంత ప్రమాదం ముంచుకొస్తుందో ఊహించుకోవచ్చు.

అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంలో నీతివంతమైన పాలన అంటే ఏమిటో ప్రజలకు చూపించామని బిజెపి నాయకులు గొప్పలు చెప్పుకుంటూ తిరిగారు. వారిమాటలు గాలిలో కలవకముందే ఒకటి తర్వాత ఒకటిగా అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడిన ఘటనలు బయట పడ్డాయి. క్రికెట్ అసోసియేషన్‌లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించి, అనేక అక్రమాలకు పాల్పడిన లలిత్‌మోడీ ఇంగ్లాండ్‌లో గడపడానికి విదేశాంగ శాఖామంత్రి సుష్మాస్వరాజ్, రాజస్తాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజేలు అక్రమంగా ఎలా తోడ్పడ్డారో సాక్ష్యాధారాలతో



రఘురామ్ రాజన్

సహా బయటపడ్డాయి. సాక్షాత్తు ప్రధానమంత్రి మోడీ, ఆర్థికశాఖా మంత్రి అరుణ్‌జైట్లీలకు కూడా లలిత్‌మోడీ సన్నిహితుడేనన్న విషయం మీడియా వెల్లడించింది. మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వంలోని మంత్రి పంకజ్ ముండె ఎటువంటి నిబంధనలను పాటించకుండా మహిళా శిశు సంక్షేమ నిధులతో వస్తువులు కొనుగోలు చేయడంలో పెద్ద కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. యుపిఏలో జరిగిన భారీ కుంభకోణాలు ఐదు సంవత్సరాల తర్వాత బయటపడ్డాయి. బిజెపి అవినీతి వ్యవహారాలు సంవత్సరం తిరక్కుండానే బయట పడుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే నల్లడబ్బును దేశానికి రప్పిస్తామని ఎన్నికల్లో ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు కుంటిసాకులు చెబుతూ నిబంధనలు అడ్డుకుంటున్నాయని మాట్లాడుతున్నారు. ఎన్నికలకు ముందు ఈ నిబంధనలు తెలియని తెలివితక్కువ వాళ్లేమీ కాదు బిజెపి నాయకులు. నల్లడబ్బు కూడబెట్టుకున్న బడా బాబులందరూ కాంగ్రెస్‌కు ఎంత కావాల్సినవాళ్ళో బిజెపికీ అంతే కావాల్సినవాళ్ళు. కార్పోరేట్లకు ఊడిగం చేసే పార్టీలే కాబట్టి నల్లడబ్బు సమస్యను ఓట్లకోసం వినియోగించుకొని, ఇప్పుడు దొంగలను రక్షిస్తూ, ప్రజలను మోసగిస్తున్నారు. నీతి గురించి, సత్పరిపాలన గురించి బిజెపి చెబుతున్న కబుర్లన్నీ నేతి బీరకాయలేనని తేలిపోతున్నది.

21వ మహాసభ రాజకీయ తీర్మానంలో బిజెపి పాలనలో నిరంకుశత్వ ప్రమాదం పెరుగుతున్నదని మార్క్సిస్టుపార్టీ ప్రజలను హెచ్చరించింది. ఈ సంవత్సర కాలంలో ప్రజాస్వామ్య విలువలకు, ప్రజాస్వామ్య సంస్థలకు హాని కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరించింది. అధికారమంతా ప్రధానమంత్రి, ప్రధానమంత్రి కార్యాలయం గుప్పిట్లో కేంద్రీకృతమై పోయింది. కేంద్రమంత్రులు డమ్మీలయి పోయారని బహిరంగంగానే ఆక్షేపించే పరిస్థితి వచ్చింది. పార్లమెంటును ఖాతరు చేయకుండా ఆర్డినెన్సుల ద్వారా బిజెపి రాజ్యం చేస్తున్నది. భూసేకరణ చట్టాన్ని బలహీనం చేసేందుకు మూడుసార్లు ఆర్డినెన్సును ప్రయోగించింది. సవరణ చట్టాన్ని పరిశీలించేందుకు పార్లమెంటరీ కమిటీని నియమించి, కనీసం ఆ కమిటీ నివేదిక కోసం ఎదురుచూడకుండానే ఆర్డినెన్సు విడుదల చేయడమంటే బిజెపి పార్లమెంటరీ వ్యవస్థకు కించిత్ విలువ కూడా ఇవ్వడం లేదనేది స్పష్టం అయ్యింది.

పౌర స్వేచ్ఛను, సమాజంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని కూడా బిజెపి సహించలేక పోతున్నది. మద్రాసు ఐఐటిలో విద్యార్థులు నడుపుతున్న అంబేద్కర్, పెరియార్ స్టడీసర్కిల్ కార్యకలాపాలను యూనివర్శిటీపై ఒత్తిడితెచ్చి నిషేధించేట్టు చేసింది. దేశవ్యాపితంగా తీవ్ర నిరసన వ్యక్తమయినందున వెనక్కి తగ్గినా, విద్యాసంస్థల్లో కూడా భావ ప్రకటనా స్వేచ్ఛను, ఉన్నత విద్యాసంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని కూడా సహించలేకపోతున్నదనే దానికి ఇవి తార్కాణాలు. సంఘ్‌పరివార్ శక్తుల మతోన్మాద చర్యలను, ముఖ్యంగా గుజరాత్‌లో మైనారిటీల ఊచకోతకు పాల్పడినవారిని ఎండగట్టి శిక్షించాలని పోరాటంచేస్తున్న తీస్తా సెతల్వాద్‌ను తీవ్రంగా వేధిస్తున్నది. తప్పుడు కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురిచేసి లొంగదీయాలని నానా పాట్లు పడుతున్నది. పర్యావరణ కార్యకర్త ఒకరిని చట్టవిరుద్ధంగా విమానం నుండి బలవంతంగా దింపివేసి, విదేశీ ప్రయాణాన్ని నిరోధించింది. ఇటువంటి

> “ఎన్‌డిఏ అధికారంలో ఉన్న ఈ సంవత్సర కాలంలో దేశప్రజలకు గడ్డురోజులొచ్చాయి. రాబోయే కాలంలో మరింత చెడ్డరోజులు రాబోతున్నాయి. ఆయితే అందరికీ చెడ్డరోజులొస్తున్నాయని అనుకోవాల్సిన అవసరం లేదు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు మోడీ పాలన మహదానందంగానే సాగుతున్నది.”



హర్యానాలోని అటాలీ గ్రామంలో హిందూత్వవాదుల దాడులతో భయాందోళనలతో గడుపుతున్న ముస్లిం మైనార్టీలు

ఘటనలు ఇంకెన్నింటినో పేర్కొనవచ్చు. అందుకే బిజెపి పాలనలో వ్యక్తమవుతున్న ఫాసిస్టు ధోరణులపట్ల, నిరంకుశ పోకడల పట్ల అప్రమత్తంగా ఉండాలని మార్క్సిస్టుపార్టీ ఇప్పటికే హెచ్చరిక చేసింది. బిజెపి వృద్ధ నాయకులు ఎల్‌కే అద్వానీ మళ్లీ ఎమర్జెన్సీ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిక చేయడం, దాన్ని పలువురు ఆమోదించడం యాదృచ్ఛికం కాదు. అద్వానీ ఉద్యేశాలేమయినా, తన అసంతృప్తిని వ్యక్తం చేయాడానికి ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలన్న తాపత్రయం ఉందని అనుకున్నా, ఆయన ఆందోళన ప్రజాస్వామిక వాదులు హర్షించాల్సిన విషయమే.

బిజెపి అధికారంలోకి వస్తే దేశప్రజలకు మంచిరోజులొస్తాయని 2014 ఎన్నికలలో భారీగా ప్రచారం జరిగింది. దీనికి భిన్నంగా ఎన్‌డిఏ అధికారంలో ఉన్న ఈ సంవత్సర కాలంలో దేశప్రజలకు గడ్డురోజులొచ్చాయి. రాబోయే కాలంలో మరింత చెడ్డరోజులు రాబోతున్నాయి. ఆయితే అందరికీ చెడ్డరోజులొస్తున్నాయని అనుకోవాల్సిన అవసరం లేదు. విదేశీ, స్వదేశీ కార్పోరేట్ శక్తులకు మోడీ పాలన మహదానందంగానే సాగుతున్నది. వారు కోరుకున్న చర్యలన్నింటినీ వేగంగానే అమలు చేస్తున్నది. సామాన్య ప్రజలకు నష్టం కలిగించే చర్యలైనా, కార్పొరేట్ ప్రయోజనాల కోసం అమలుచేయడానికి ఏమాత్రం వెనుకంజ వేయడంలేదు. ఎన్ని విమర్శలొచ్చినా ఖాతరు చేయడంలేదు.

విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలు బిజెపి సంఘ్‌పరివార్ శక్తులను అధికారంలోకి తేవడానికి చేసిన సహాయానికి ప్రతిఫలంగా నిర్ణయాలు తీసుకోవడం, ఏకంగా 18 దేశాలు తిరిగి, ప్రపంచ పెట్టుబడిదార్ల చుట్టూ ప్రదక్షణలు చేయడంలోనే ప్రధానమంత్రి మోడీకి ఈ సంవత్సరం గడిచిపోయింది. విదేశీ పెట్టుబడులకు సంపూర్ణంగా ద్వారాలు తెరిచే అనేక నిర్ణయాలను తీసుకున్నది. గత ప్రభుత్వం సాహసించని రక్షణ, రైల్వే వంటి రంగాల్లో కూడా ప్రయివేటీకరణను ప్రారంభించింది. కార్పొరేట్ శక్తుల చిరకాల వాంఛగా ఉన్న జిఎస్‌టిని అమలుజేయడానికి పూనుకున్నది. పట్టువిడుపుల విధానం పేరుతో కార్మిక చట్టాలలో యజమానులకు అనుకూలంగా సవరణలు ప్రతిపాదిస్తున్నది. కేంద్రం ప్రోత్సాహంతో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే సవరణలు చేశాయి. కార్మికుల హక్కులను హరించే ఈ పనిలో ఆంధ్రప్రదేశ్ అందరికన్నా ముందున్నది. రైతుల భూములను అభివృద్ధి పేరుతో కారుచౌకగా కొట్టేయకుండా, ఉన్నంతలో మెరుగైన నష్టపరిహారం పొందగలిగే 2013 భూసేకరణ చట్టాన్ని సవరించటానికి బిజెపి పూనుకున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ చట్టానికి మద్దతిచ్చిన బిజెపి, అధికారానికి రాగానే ప్లేటు ఫిరాయించి, రైతులకు ద్రోహం చేయడానికి పూనుకున్నది. నరేంద్రమోడీ అట్టహాసంగా ప్రచారం చేస్తున్న “మేక్ ఇన్ ఇండియా” అనే కొత్త నినాదం విదేశీ పెట్టుబడిదారులు దోచుకోవడానికి దేశ ఆర్థిక వ్యవస్థను అప్పగించడం తప్ప మరొకటి కాదు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లోనే పెట్టుబడిదారులకు, ధనికులకు ఐదు లక్షల కోట్ల రూపాయలకుపైగా రాయితీలిచ్చి, ఆ భారాన్ని ప్రజలపై మోపింది. బిజెపి ఎవరి కోసం ఉన్నదో, ఎవరి రుణం తీర్చుకుంటున్నదో బడ్జెట్ అద్దం పట్టింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ ప్రజలమీద ధరల భారం మాత్రం తగ్గించలేదు. ఉపాధి హామీ చట్టం, మధ్యాహ్న భోజనం, ఇంకా అనేక ఇతర పథకాలకు భారీగా కోత పెట్టింది. కేంద్రం అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపాల్సిన బాధ్యత నుండి చేతులు దులుపుకొని, ఆ భారాన్ని రాష్ట్రాలపై నెడుతున్నది. ఆర్థిక శాఖామంత్రి జూన్ మాసంలో అమెరికా వెళ్లి పెట్టుబడిదారులందరినీ కలిసి, ప్రజలకిస్తున్న సబ్సిడీలన్నింటినీ హేతుబద్ధం చేస్తామని, పన్నుల వ్యవస్థను సరళీకరించి, పన్నురేటుని భారీగా తగ్గిస్తామని, భూసేకరణ చట్టాన్ని సవరించేదానికి కట్టుబడి ఉన్నామని, కార్మిక చట్టాలను సరళం చేస్తామని, పెట్టుబడిదారులను ఖుషీ చేసే మరెన్నో వాగ్దానాలు చేశారు. అంటే రాబోయే కాలంలో ప్రజల హక్కులు మరింతగా హరింపబడబోతున్నాయని, ప్రజలపై మరిన్ని భారాలు పడబోతున్నాయని జైట్లీ మాటలు స్పష్టం చేస్తున్నాయి.

మొత్తం మీద సంవత్సర పాలనను తూకం వేస్తే బిజెపి నగ్నంగా కార్పొరేట్ల పక్షాన నిలబడుతున్నదనేది స్పష్టమౌతుంది. సరళీకరణ విధానాలను వేగంగా, లోతుగా, తీవ్రంగా అమలు చేయడానికే కృత నిశ్చయంతో ఉన్నదనేది విదితమౌతున్నది. ఈ విధానాలకు ప్రతిఘటన లేకుండా ప్రజల ఐక్యతను బలహీనం చేసేందుకు మతోన్మాదాన్ని, ప్రజల పోరాట పటిమను దెబ్బగొట్టేందుకు నిరంకుశత్వాన్ని పెంచుతున్నది. ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే వామపక్ష, లౌకిక ప్రజాస్వామిక శక్తులను బలపర్చుకోవడం, ఐక్యంజేయడం, పోరాటాలను ఉధృతం చేయడం ఒక్కటే మార్గం.

# సంస్కరణలు-పారిశ్రామిక వివాదాలు




**కె.ఆర్. శ్యాంసుందర్**

స్వాతంత్ర్యానంతర భారత దేశంలో పారిశ్రామిక సంబంధాలకు సంబం ధించిన సంస్థాగతమైన చట్రం ప్రధానంగా నాలుగు కార్మికచట్టాల మీద ఆధారపడి ఉంది. అవి (1) కార్మికసంఘాల చట్టం 1926 (2) పారిశ్రామిక ఉపాధి (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం 1946 (3) పారిశ్రామిక వివాదాల చట్టం 1947 (4) కాంట్రాక్టు కార్మికుల (నియంత్రణ మరియు రద్దు) చట్టం 1970. వీటికి తోడు కార్మికోద్యమంపై రాజకీయ పట్టు, త్రైపాక్షిక చర్చలు, నైతిక నియమావళి (క్రమశిక్షణా చర్యలు) వంటివి కూడా పారిశ్రామిక సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వం ఉత్పత్తి కార్యకలాపాలను నియంత్రించే విశాల వ్యూహంలో భాగంగా పరిశ్రమలకు ఇచ్చే అనుమతులు, పరిశ్రమలు ఎక్కడ పెట్టాలో చేసే నిర్ణయాలు వంటి అంశాల ద్వారా పారిశ్రామిక సంబంధాలను నియంత్రిస్తూ ఉంటుంది. ఉత్పత్తిని, శ్రామిక మార్కెట్లను రాజ్యం నియంత్రించడం మూలంగా ఆశించిన లక్ష్యాలు సాధించలేం. కాబట్టి సంస్కరణలు అవసరం అని విమర్శకులు వాదిస్తుంటారు. ప్రత్యేకించి పారిశ్రామిక సంబంధాలలో చేపట్టిన సంస్కరణలు-నేషనల్ కమిషన్ ఆఫ్ లేబర్ ఏర్పాటు తదితరమైనవి-సంస్థాగత చట్రంలో చెప్పుకోదగ్గ మార్పులు తీసుకురాలేకపోయాయనేది కూడా పై వాదనకు కొనసాగింపుగా చెబుతుంటారు.

వాస్తవానికి 1980వ దశకం తొలినాళ్ళ నుండే సంస్కరణలను ఆచితూచి అమలు చేస్తూ వచ్చారు. 1990-91లో విదేశీ మారకం చెల్లింపుల సంక్షోభం తలెత్తడంతో ఆర్థిక విధానాల్లో నిర్ణయాత్మక మార్పులు తీసుకురావడానికి నిర్ణయించుకొని, సంస్కరణల క్రమానికి గేట్లు బార్లా తెరిచేశారు. ఎగుమతి ఆధారిత పారిశ్రామీకరణకు చెల్లు చీటీ ఇచ్చేసి, దిగుమతి ఆధారిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేశారు. ఈ సంస్కరణలు ప్రధానంగా వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు-ఈ మూడు రంగాల్లో పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. సమాచార, సాంకేతిక, రవాణా రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రపంచీకరణ క్రమాన్ని మరింత వేగవంతం చేశాయి. ఉత్పత్తి విధానం ప్రపంచ వ్యాపిత సంబంధబాంధవ్యాల (గ్లోబల్ నెట్‌వర్క్) తో ముడిపడింది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక సంబంధాల్లో, శ్రామిక మార్కెట్లలో తగిన సంస్కరణలు తీసుకురాలేకపోతే ఉత్పత్తి మార్కెట్లలో చేపట్టిన సంస్కరణల ఫలాలు అందకుండా పోతాయని యాజమాన్య వర్గాలు, కార్మిక వ్యతిరేకులు మరోవాదన ముందుకు తెచ్చారు. ఆ రకంగా రాజ్యం మీద ఒత్తిడి పెంచి కార్మిక సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్కరణల అనంతర కాలాన్ని ప్రపంచీకరణ శకంగా చిత్రీకరిస్తున్నారు.

సమాచార, రవాణా , ఉత్పత్తి రంగాల్లో ఉపయోగపడుతున్న సాంకేతిక పరిజ్ఞానంలోనూ చోటు చేసుకున్న భారీ మార్పులు ఉత్పిత యొక్క భౌగోళిక స్వరూపాన్ని పునర్ నిర్వచిస్తున్నాయి. సరుకుల ప్రపంచవ్యాప్త ఉత్పత్తి, సరఫరాల సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తిని వ్యూహాత్మకంగా పునర్నిర్మించుకోవడం ద్వారా, బేరసారాల శక్తిని యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలచుకోవచ్చు. కార్మికులు లొంగి రాకపోతే ఉత్పత్తి కేంద్రాన్ని ఉన్న చోటు నుండి మరోచోటుకి తరలించే అవకాశం అంది వచ్చిన మూలాన యజమానులకు బేరసారాల శక్తి పెరిగింది. దానికి తోడు కార్మికసంఘాలకు బలమైన పునాదులుగా వున్న తొలితరం పరిశ్రమలు మూతపడుతూ రావడం, ఉన్న పరిశ్రమలలో కార్మికులను రిట్రెంచ్ చెయ్యడం, ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం, అమ్మివేయడం, తదాది కారణాలతో కార్మికసంఘాల సంఘటిత శక్తి బలహీనపడింది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన పరిశ్రమలలో యాజమాన్యాలు కార్మికులకు, ఉద్యోగులకు సంఘటిత పడే అవకాశాలు లేకుండా చేశాయి (ఉదా:- ఐటి రంగ పరిశ్రమలు).

పెట్టుబడులను ఆకర్షించడానికిగాను ప్రపంచ దేశాల మధ్య ఉన్న పోటీరీత్యా ఏ దేశంలో కార్మిక ప్రమాణాలు నాసిరకంగా ఉంటాయో ఆ దేశాలు పెట్టుబడికి అనువుగా, ఆకర్షణీయంగా కనబడతాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రపంచీకరించబడిన నేపథ్యంలో పెట్టుబడులను ఆకర్షించడానికి సాగే పోటీ వివిధ దేశాల మధ్యకే పరిమితం కాలేదు. ఒకే దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్యకూ పాకింది. ప్రపంచీకరించబడిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఆర్థిక వ్యవస్థలోకి అంత బలంగా చొచ్చుకు

> **“ ప్రపంచీకరణ విధానాలు అసంఘటిత రంగాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తాయి. తద్వారా అసంఘటిత రంగంలో కార్మిక సంఘాలు పెట్టుకునే అవకాశాలను హరించి వేయడంతో పాటు సంఘటితరంగ కార్మిక ఉద్యమ బేరసారాల శక్తినీ బలహీన పరుస్తారు. ”**

వచ్చింది. రాజ్యం ప్రేక్షక పాత్రకి పరిమితం అయిపోయింది. స్వేచ్ఛా వాణిజ్య సూత్రాల ప్రకారం వ్యాపారంలో, ఉత్పత్తిలో రాజ్యం తన జోక్యాన్ని ఉపసంహరించుకోవాలి అన్న పెట్టుబడి వాదనదే పైచెయ్యి అయ్యింది. రాజ్యం పెట్టుబడి చెప్పుచేతల్లో నడుస్తూ తన అసలు ఉద్దేశ్యాన్ని బయటపెట్టుకోసాగింది. పెట్టుబడి ఆడించినట్టల్లా ఆడే దానికి సిద్ధపడింది. ఈ క్రమంలో రాజ్యం అటు పెట్టుబడి చెప్పినట్టల్లా ఆడాల్సిన అవసరం, ఇటు కార్మికవర్గ ఓటు బ్యాంకును చేజారిపోకుండా చేసుకోవాల్సిన ఆగత్యం అనే వైరుధ్యాల మధ్య చిక్కుకుంది.

ప్రపంచీకరణ విధానాలు అసంఘటితరంగాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తాయి. తద్వారా అసంఘటిత రంగంలో కార్మిక సంఘాలు పెట్టుకునే అవకాశాలను హరించి వేయడంతో పాటు సంఘటితరంగ కార్మిక ఉద్యమ బేరసారాల శక్తినీ బలహీనపరుస్తారు. పెట్టుబడి ప్రయోజనాలు కాపాడబడాలన్నా, అడ్డగోలు లాభాలు సంపాదించాలన్నా, కార్మిక సంఘాలు ప్రధాన ఆటంకం. కాబట్టి వాటి బెడద లేకుండా చూసుకోవడమే ప్రపంచీకరణ విధానాల ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. పారిశ్రామిక వైరుధ్యాలు, వివాదాలు తలెత్తినప్పుడు చట్టాలను గురించి మాట్లాడే కార్మిక సంఘాలకు అవకాశం లేకుండా చేయడానికి, ఏకపక్ష వాతావరణం నెలకొల్పే దానికి, పెట్టుబడిదే ఇష్టారాజ్యంగా చలామణి అయ్యేదానికి రాజ్యమూ, యాజమాన్యాలూ కలిసికట్టుగా ఎంత ఉదారంగా వ్యతిరేకిస్తున్నాయో చూడండి. ఇక మానవ వనరుల (హెచ్ఆర్/ఐ.ఆర్) శాఖల పరమ కర్తవ్యం ఏంటంటే యూనియన్ల జోక్యం లేకుండా చూడడం. లేదంటే ఉన్న యూనియన్లను దెబ్బతీసి వాటి మొదలారిపోయేలా చెయ్యడం. ఇందుకోసం రకరకాల ఎత్తులూ జిత్తులూ వేస్తుంటాయి. కార్మికసంఘం, సంఘ నాయకులు అంటేనే బయటివాళ్ళని, ఏదన్నా సమస్యలు ఉంటే మాలో మేం పరిష్కరించుకుంటాం, ఇది మా కుటుంబం లాంటిదని సన్నాయి నొక్కులు నొక్కుతుంటారు. అప్పటికీ కార్మికులు తిరగబడితే వారికి నాయకత్వం వహించిన వారిని 'దారితప్పిన కార్మికులని, ప్రొఫెషనల్ ఉద్యమకారులని ముద్రవేసి, నాయకత్వాన్ని కార్మికుల నుండి వేరుచేసే దానికి చూస్తాయి. విచిత్రం ఏంటంటే ఈ వ్యవహారాలన్నీ కార్మికులు పట్టువిడుపులతో వ్యవహరించాలనే (లేబర్ ఫ్లెక్సిబిలిటీ) వ్యూహం పేరిట చలామణి కావడం.

ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏంటంటే ఏ సాధనాలను ఉపయోగ పెట్టుకుని యాజమాన్యాలు కార్మిక సంఘాల బేరసారాల శక్తిని బలహీనపరచాలని చూస్తుంటాయో, అవే సాధనాలు కార్మిక సంఘాలని బలోపేతం చేసుకొనేదానికి ఉపయోపడడం. ఉదాహరణకు సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్నే తీసుకుంటే దీనిని ఉపయోగపెట్టుకొని కార్మిక సంఘాలు సరిహద్దులు దాటిన సంఘీభావాన్ని నెలకొల్పుకుంటాయి. బలోపేతం చేసుకుంటాయి. కార్మిక సంఘాల కార్యకలాపాల సమాచారాన్ని ఒక చోట నుండి మరొకచోటుకి, ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి, ఒక దేశం నుండి మరోదేశానికి చిటికెలో ఇచ్చిపుచ్చుకుంటూ, ఏకకాలంలో ఉద్యమ వ్యాప్తికి పూనుకోగలవు. సంఘటిత కార్మికశక్తిని బలహీనపరిచేందుకు అనుసరిస్తున్న సంస్కరణల తీవ్రత మూలంగా సైద్ధాంతికంగా చీలికలు పేలికలుగా ఉన్న కార్మికోద్యమం ఐక్య పోరాటాలు పెంపొందించుకునే దిశకు మళ్ళుతుంది. ఇందుకు ప్రతిగా యాజమాన్యాలు కార్మికుల పీచమణచడానికి ఫ్యాక్టరీల మూసివేతలు, పాక్షిక మూసివేతలు, లాకౌట్లు, సమాంతర ఉత్పత్తి వంటి రకరకాల పద్ధతులను దూకుడుగా అవలంభిస్తాయి. కార్మికశక్తిని చీలికలు పేలికలు చేయడానికి ఉద్దేశించిన అసంఘటితరంగ వ్యాప్తిని ఇటు సంఘటిత రంగం, అటు అసంఘటితరంగం ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తాయి. సంస్కరణలు మొదలు పెట్టిన తొలినాళ్ళలో ఉపాధి అవకాశాలను అసంఘటితరంగం వైపుకి బదలాయించడానికి చేసిన ప్రయత్నాలకు ప్రతిఘటన తప్పలేదు. ప్రపంచీకరణ విధానాల్లో ఇమిడి ఉన్న వైచిత్రి ఇది.

ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాల ద్వారా పారిశ్రామిక అశాంతిని లేకుండా చెయ్యవచ్చు (యూనియన్లను బలహీనపరచడం ద్వారా) అన్న అంచనా బుద్ధిమాలినతనం తప్ప మరొకటి కాదు. పాలక వర్గాలు శ్రామిక సంస్కరణల పేరిట కార్మిక సంఘాలను బలహీనపరిచే దానికి, అలానే ఉత్పత్తి క్రమంలో, వ్యవస్థలో ఆధిపత్య సంబంధాలను కొనసాగించడానికి, లాభాలను మరింత పెంచుకునేదానికి తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయి. ఈ వ్యూహాలు ఆందోళనలుగా రూపుదిద్దుకుంటాయి. వివిధ తరగతుల ప్రజానీకం మధ్యన సంఘీభావానికి దారితీస్తాయి. ప్రపంచీకరణ విధానాలు రెండంచులా పదును గల కత్తి వంటివి. అటు పెట్టుబడికి ఊడిగం చెయ్యడంతోపాటు, ఇటు శ్రామిక వర్గాన్నీ సంఘటితపరుస్థాయి.

అయితే భారతదేశంలో కార్మిక సంబంధాల మీద ఉన్న అధికారిక దృక్పథం భిన్నంగా ఉంది. కార్మిక అశాంతి ప్రధానంగా పని నిలుపుదలకే పరిమితం కాబట్టి రాజ్యం జోక్యం చేసుకోవడం ద్వారా, సామాజిక చర్చల ద్వారా పారిశ్రామిక సంబంధాలను సజావుగా కొనసాగించవచ్చు అని 2000-01 నుండి 2012-13 పార్లమెంటుకు సమర్పించిన ఆర్థిక సర్వేలలో అప్పటి ప్రభుత్వాలు ప్రకటించుకున్నాయి. కాని విచిత్రం ఏంటంటే ఈ మధ్య కాలంలో ప్రెస్/మీడియాలో వచ్చిన వార్తలను గమనిస్తే పారిశ్రామిక అశాంతి, ఆందోళనలు పెరిగిపోవడం, కొన్నిచోట్ల హింసాత్మక ధోరణులు చోటు చేసుకోవడం మనకు కనిపిస్తాయి.

**పని నిలుపుదల ధోరణలు**

ప్రభుత్వం పారిశ్రామిక వివాదం అన్న మాట ఎత్తకుండా 'పని నిలుపుదల' పేరిట గణాంకాలు ఇచ్చింది. ఇందులో సమ్మెలు, లాకౌట్లు కూడా కలిసి ఉంటాయి. పదిమంది అంతకంటే ఎక్కువమంది కార్మికులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పని నిలుపుదలలో పాల్గొన్న సంఘటనలను మాత్రమే అధికారిక సంస్థలకు ఐచ్ఛికంగా సమాచారం ఉన్న మేరకు మాత్రమే వివరాలు అందుబాటులో ఉన్నాయి. రాజకీయ సమ్మెలు, సంఘీభావ సమ్మెలను ఇందులో లెక్కలోకి తీసుకోలేదు. ఏజెన్సీలు చెప్పే కారణం

ఏంటంటే ఇందులో కార్మికులకు సంబంధించి నిర్దిష్టమైన పారిశ్రామిక వివాదంగానీ, సమస్య గానీ యాజమాన్యాల పరిధిలో పరిష్కరించేది కాదు. కాబట్టి వీటిని లెక్కలోకి తీసుకోలేదంట.

సంస్కరణల అనంతరకాలంలో సమ్మెల వివరాలను(1992-2010) పరిశీలిస్తే ప్రతీ 100 మంది ఉద్యోగులకు పని నిలుపుదలకు పాల్పడిన ఘటనలు సాపేక్షంగా తీవ్రంగా తగ్గినట్లు కనబడితే అదే 1000 మంది అంతకన్నా ఎక్కువ ఉద్యోగులు పని నిలుపుదలకు పాల్పడిన ఘనటలు 2007 తరువాత తగ్గినట్లు కనబడుతున్నాయి. ఇది వాస్తవమా లేక గణాంకాల సేకరణలో లోపమా ఇతమిద్దంగా చెప్పలేం. ఆ వివరాలు కూడా తర్వాత చర్చిద్దాం. అయితే తక్కువమంది ఉద్యోగులు ఉన్నచోట్ల పని నిలుపుదలకు పాల్పడిన ఘటనలు సాధారణంగా ఈ మధ్యకాలంలో పెరిగిన ధోరణిని మనం చూస్తాం. మొదటి దశలో పని నిలుపుదల ఎక్కువగా ఉంది. అయితే 2000వ సంవత్సరం తరువాత తగ్గుముఖం పట్టింది. కానీ సగటున లెక్కతీస్తే పని నిలుపుదలకు పాల్పడిన సంఘటనలు ఏటికేడాదికి పెరగడం మనం గమనించవచ్చు. లాకౌట్ల సందర్భంగా పని నిలుపుదలలో కార్మికుల ప్రమేయం ఉండదు.

కాబట్టి పని నిలుపుదలలో, అంటే సమ్మెలలో కార్మికుల భాగస్వామ్యం పెరగడం మనం గమనించవచ్చు. భారీ సమ్మెలు పెరగడానికి అనేక కారణాలు ఉంటాయి. ఒకే ప్రాంతంలోని ఒక రంగంలోని అనేక పరిశ్రమలలో సమ్మె కావచ్చు, ఏదేని పెద్ద పరిశ్రమలో సమ్మె కావచ్చు, లేదా దేశవ్యాప్త సమ్మె కావొచ్చు. సంస్కరణల అనంతర కాలంలో 14 దేశవ్యాప్త జాతీయ సమ్మెలు జరిగాయి. అందులో భాగంగానే 2013 ఫిబ్రవరిలో రెండు రోజుల పాటు అఖిలభారత సమ్మె జరిగింది. ఇందులో దాదాపు 10 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు.

పాలకవర్గాలు కొన్ని సమ్మెలు, ఆందోళనలను 'రాజకీయ ప్రేరేపితమైనవని' పేర్కొంటూ ఉంటాయి. సర్కారీ ఏజెన్సీలు వాటిని అధికారికంగా పని నిలుపుదల లెక్కల్లోకి తీసుకోవు. అలానే ధర్నాలు, మోర్చాలు, పికెటింగ్‌లు, గేట్ మీటింగ్‌ల వంటి ఆందోళనలను పని నిలుపుదలలో భాగంగా చూడవు. వీటన్నింటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే కార్మిక సమీకరణ శక్తి చిన్న చిన్న సంస్థలలో కన్నా పెద్ద పెద్ద సంస్థలలో భారీగా నమోదయినట్లు అర్థం చేసుకోవచ్చు. కార్మికుల సమ్మెల మూలంగా దేశ ప్రగతి దెబ్బతింటుంది. ఎర్రజెండా అంటేనే అభివృద్ధికి వ్యతిరేకం అంటూ పెద ప్రచారం చేసేవాళ్ళకి కనువిప్పుగా సమ్మెల మూలంగా ఈ దేశం కోల్పోయిన పనిదినాల కన్నా లాకౌట్ల మూలంగా రెట్టింపు పనిదినాల నష్టం జరిగిన దాఖలాలు మనకు స్పష్టంగా తెలుస్తున్నాయి.

> **"సంస్కరణల అనంతరకాలంలో సమ్మెల వివరాలను (1992-2010) పరిశీలిస్తే ప్రతీ 100 మంది ఉద్యోగులకు పని నిలుపుదలకు పాల్పడిన ఘటనలు సాపేక్షంగా తీవ్రంగా తగ్గినట్లు కనబడితే అదే 1000 మంది అంతకన్నా ఎక్కువ ఉద్యోగులు పని నిలుపుదలకు పాల్పడిన ఘనటలు 2007 తరువాత తగ్గినట్లు కనబడుతున్నాయి."**




మానేసర్‌లోని మారుతి సుజుకి ప్లాంట్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

సంస్కరణల అనంతర కాలపు పారిశ్రామిక వివాదాల తీవ్రతను సరిగా అంచనా వెయ్యాలంటే కేవలం సంస్కరణలకు ముందు, తరువాత కాలాలు అని సాధారణ విభజనకు పరిమితం కాకుండా, చారిత్రక నేపథ్యం నుండి అంచనా వెయ్యాలి. 1971లో షార్టర్, టిల్లీలు ఇరువురూ పని నిలుపుదల ప్రాభవాన్ని వాటి పరిమాణం, కాలం, సంభవతలను బట్టి పొందుపరిచే పద్ధతిని తీసుకువచ్చారు. వాటి ఆధారంగా 1950ల నుండి 70ల వరకు, 1980ల నుండి 2000ల వరకు ఉన్న ప్రతి దశాబ్దకాలానికి సంబంధించిన పని నిలుపుదల వివరాలు ఇప్పుడు చూద్దాం.

1950-60ల మధ్య కాలంలో పని నిలుపుదల సంఘటనలు 1960, 1970ల నాటికి వచ్చేసరికి వాటి విస్తృతిలోను, పరిమాణంలోనూ పెరిగాయి. 1975-77 ఎమర్జన్సీ కాలం మినహాయిస్తే 1970వ దశకంలో శ్రామికవర్గ పోరాటాలు మిలిటెంట్‌గా సాగాయి. ఇహ 1980వ దశకానికి వచ్చేసరికి శ్రామికవర్గ పోరాటాలు మహోధృతిన సాగాయి. ఈ కాలంలోనే బెంగళూరులో ప్రభుత్వ రంగ పరిశ్రమల సమ్మె (1980-81), బొంబాయి జౌళిమిల్లుల సమ్మె (1982-83), జూట్ పరిశ్రమల సమ్మె (1986)లు చోటు చేసుకున్నాయి.

సంస్కరణల అనంతరకాలంలో, ముఖ్యంగా 2000 సంవత్సరంలో కార్మికవర్గ సమ్మెలు, పారిశ్రామిక వివాదాలు పెద్దఎత్తున చెలరేగాయి. ఈ కాలంలో పారిశ్రామిక వివాదాలు 1980లలో కన్నా కాస్త మెరుగ్గా ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నా, 1950, 60లతో పోలిస్తే మరింత పెరిగాయని అర్థం చేసుకో వచ్చు.

కాబట్టి అధికార వర్గాలు, పాలక వర్గాలు చెబుతున్న 'పారిశ్రామిక అచేతన' (ఇనాక్టివ్) అనేది ఒట్టి బూటకం మాత్రమే. 1990లతో పోలిస్తే 1000 మంది కన్నా ఎక్కువమంది కార్మికులు ఉన్న పరిశ్రమలలో సమ్మె ఉదంతాలు తగ్గినట్లు కనబడినా, అధికార వర్గాలు చెప్పే పారిశ్రామిక శాంతి మాత్రం ఎండమావి లాంటిదే.

పని నిలుపుదల, ఉపాధి, సామర్థ్యం, సమా

> "కార్మికులు సమ్మెలోకి దిగుతారన్న అంచనా రాగానే యజమానులు ఫ్యాక్టరీ లాకౌట్లు ప్రకటించడం ఆనవాయితీగా మారిపోయింది. లాకౌట్ల మూలంగా కోల్పోయిన పనిదినాల సంఖ్య పెరుగుతూ రావడం మనం గమనించ వచ్చు. 2000వ సంవత్సరం ద్వితీయార్థంలో లాకౌట్ల మూలంగా రోడ్డున పడ్డ కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది."

చార వనరులు, గణాంక పద్ధతుల విషయానికి వచ్చేసరికి ఒక్కో దేశానికి ఒక్కో మాదిరిగా ఉంటాయి. అలానే ఒక్కో దేశంలో కాలంతో పాటు వీటిలో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. కాబట్టి ఈ అంశాలను గమనంలో ఉంచుకొనే ఇతరేతర దేశాలతోగాని, దేశంలో కాలమాన పరిస్థితులను బట్టి పోల్చి చూసుకోవాలి.

లభిస్తున్న వివరాలను బట్టి శ్రామికుల సమ్మె పోరాటాల విషయంలో భారతదేశం ఐదవ అగ్రస్థానంలో ఉంది. అతి తక్కువ సమ్మెలు జరిగింది శ్రీలంక, జపాన్ దేశాలలో. జపాన్ అనే దేశంలో సమ్మెలే ఉండవు. అందుకే ఆ దేశం అంత ప్రగతి సాధించింది అని వాదించే వాళ్ళవి అబద్ధాలని బట్టబయలు అయినందుకు ధన్యవాదాలు. పశ్చిమ దేశాల సంగతి పక్కన పెడితే, సంస్కరణల అనంతరకాలంలో భారత దేశంలో లాకౌట్ల మూలంగా కోల్పోయిన పనిదినాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలి.

కార్మికులు సమ్మెలోకి దిగుతారన్న అంచనా రాగానే యజమానులు ఫ్యాక్టరీ లాకౌట్లు ప్రకటించడం ఆనవాయితీగా మారిపోయింది. లాకౌట్ల మూలంగా కోల్పోయిన పనిదినాల సంఖ్య పెరుగుతూ రావడం మనం గమనించ వచ్చు. 2000వ సంవత్సరం ద్వితీయార్థంలో లాకౌట్ల మూలంగా రోడ్డున పడ్డ కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అంటే అంతకు ముందు దాకా కార్మికుల సమ్మె పోరాటాల తీవ్రత పెచ్చుగా ఉండేదనే అంశం మరోమారు స్పష్టమౌతుంది. అలాగే 2004-07, 2008-10 మధ్య కాలంలో లాకౌట్ల మూలంగా కోల్పోయిన పనిదినాలు తగ్గుముఖం పట్టినా, మొత్తం పనిదినాల నష్టం పెరుగుతూ ఉన్న సంఖ్యను బట్టి ఈ కాలంలో కార్మికుల సమ్మె పోరాటాలు పెరిగాయని అర్థం చేసుకోవచ్చు.

పనిదినాల నష్టం మూలంగా ఉత్పత్తి పడిపోయిందని, అందువలన యజమానులకు నష్టం జరిగిందనే వాదన ఒకటి తరచూ వింటా ఉంటారు. (నిజానికి సమ్మె కాలంలో ఉత్పత్తి ఆగిపోయినా ఆ తరువాత ఆ నష్టాన్ని భర్తీ చేసుకొనేలా ప్రతి యజమానీ చూసుకుంటాడు) కానీ కార్మికుల సమ్మె మూలంగా కోల్పోయిన పనిదినాలు, ఆ వార తగ్గిన ఉత్పత్తి కన్నా, ఫ్యాక్టరీ లాకౌట్ల మూలంగా నష్టపోయిన పనిదినాలు, ఉత్పత్తి తగ్గడం ఎక్కువ అని గణాంకాలు మనకు వివరిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని కప్పిపెట్టి యజమానులు, ప్రభుత్వ అధికారులు, పాలకులు కార్మికవర్గం మీద నెపం వేస్తున్నారు.

అయితే పాలకులు చెబుతున్న 'పారిశ్రామిక ప్రశాంతత' అనేది మాత్రం ఎండమావే. పారిశ్రామిక శాంతి వర్ధిల్లడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివాద పరిష్కార యంత్రాంగం, సామాజిక చర్చలు ఎంతగానో దోహదం చేశాయని గొప్పలు చెప్పుకుంటుంది.

ప్రభుత్వం వైపు నుండి జోక్యం అంటే లేబర్ కమిషనర్ ఆఫీసర్ల జోక్యమే. 1/3వ వంతు సమ్మెలు లేబర్ ఆఫీసరు ముందు ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా పరిష్కారం అయినట్లు వివరాలు తెలియ చెబుతున్నాయి. అయితే యాజమాన్యం, కార్మికసంఘాలు చర్చలు చేసుకొని ఒక అంగీకారానికి వచ్చాక అటువంటి ఒప్పందానికి చట్టబద్ధత ఉండడం కోసం కార్మిక సంఘాలు లేబర్ కమిషనర్ సమక్షంలో పారిశ్రామిక వివాదాల చట్టం సెక్షన్ 12(3) కింద అగ్రిమెంట్‌లు కుదుర్చుకోవడం అనేది ఆనవాయితీగా వస్తుందే తప్ప లేబర్ కమిషనర్ జోక్యం తోనే అన్ని సందర్భాల్లోనూ యాజమాన్యం దిగివచ్చి, కార్మికసంఘాలతో ఒప్పందాలు చేసుకొన్నాయని ఖచ్చితంగా చెప్పలేం. చట్టంలోని ఈ సెక్షన్ కింద అగ్రిమెంటు కుదుర్చుకోవడం మూలంగా ఆ ఒప్పందానికి అటు యాజమాన్యం, ఇటు కార్మిక సంఘం-రెండు పక్షాలూ బద్ధులై ఉండాల్సి రావడమే కాకుండా, ఆ పరిశ్రమలోని ఇతర కార్మిక సంఘ సభ్యులు, భవిష్యత్‌లో ఆ పరిశ్రమలో చేరగోరే ఉద్యోగులు, ఆ పరిశ్రమకు కాబోయే యజమానులు కూడా బద్ధులై ఉండాల్సి వస్తుంది. అటువంటి సాధికారిత కల్పించడానికిగాను కార్మిక సంఘాలు ఎక్కువలో ఎక్కువగా లేబర్ కమిషనర్ సమక్షంలో చట్టరీత్యా అగ్రిమెంట్ చేసుకుంటాయే తప్ప లేబర్ కమిషనర్ జోక్యంతో మాత్రమే అన్ని వివాదాలూ పరిష్కారం అయ్యాయని అనుకోలేం. కాబట్టి ఈ కేటగిరీలో సంఖ్య కృత్రిమంగా పెంచి చూపించడానికి అవకాశం ఉంది. సమ్మెలోకి వెళ్ళిన కార్మికులు వివాదం పరిష్కారం కాకుండానే విధులలోకి హాజరైన ఘటనలు శాతం ఎక్కువగా ఉంది. యాజమాన్యాలు వివాద పరిష్కారానికి ఎటువంటి చొరవా చూపని సందర్భాలూ ఎక్కువశాతం నమోదయ్యాయి. యాజమాన్యాలే కార్మికులు సమ్మెబాట పట్టేలా చేసి, కార్మికులు గతంలో కన్నా నష్టదాయక ఒప్పందాలకు అంగీకరించేలా చేసిన సందర్భాలే ఎక్కువగా ఉన్నాయని నా అనుమానం. 1990-2000 మధ్య దశాబ్ద కాలంలో ఇలాంటి ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రభుత్వ జోక్యంతో కుదిరిన ఒప్పందాలూ హెచ్చుగా కనిపిస్తున్నాయి.

వివరాలను పరిశీలిస్తే ప్రభుత్వ జోక్యం ద్వారా లేబర్ కమిషనర్ ముందు జరిగిన ఒప్పందాలలో కన్నా, కార్మికులు సంఘం నాయకత్వాన నేరుగా యాజమాన్యంతో చర్చలు జరిపి చేసుకున్న ఒప్పందాలలోనే ఎక్కువ డిమాండ్లు సాధించుకున్న తీరు స్పష్టమౌతుంది. ప్రభుత్వం జోక్యం చేసుకుందంటే సమ్మె చేస్తున్న కార్మికులకు యాభై శాతానికి మించి లబ్ధి చేకూరాల్సింది పోయి, సర్కారు ప్రమేయం లేకుండా యాజమాన్యంతో నేరుగా చర్చల ద్వారా చేసుకున్న పరిష్కారాలే ఎక్కువ ప్రయోజనకరంగా ఉన్నాయి.

### సంస్కరణల అనంతరకాలంలో నిరసన రూపాలు-నిర్మాణాలు

సెంట్రల్ లేబర్ బ్యూరో, స్టేట్ లేబర్ బోర్డులు, ఆర్థిక సర్వేలు ఇవన్నీ పారిశ్రామిక వివాదాలు. ఆందోళనలు, సమ్మెలను చట్టబద్ధమైన పద్ధతులలో నివేదికలు అందిన మేరకే లెక్కలు చూపిస్తున్నాయి. అయితే కార్మికులు సమ్మెల ద్వారానే కాకుండా ఇంకా అనేక ఇతరత్రా రూపాల్లో కూడా తమ ఆందోళనను వెలిబుచ్చుతా ఉన్నారు. ఇవన్నీ కార్మికసంఘాలు ఒక క్రమపద్ధతిలో నియమిత రూపంలో కార్మికులు తమ నిరసన వ్యక్తీకరించేందుకు రూపొందించినవే. క్షేత్ర స్థాయిలో జరిగే

ఆందోళనలు ఒక్కో తడవ 'పబ్లిక్ ప్లేస్'లలో కొట్టొచ్చినట్లు మిలిటెంటుగా జరుగుతూ ఉంటాయి. ఒక్కో సందర్భంలో యాజమాన్యంతో జరిగే జాయింట్ మీటింగ్‌లలో వాదోపవాదాలు, చర్చలు తదితర పద్ధతులలో జరుగుతుంటాయి. ఇలాంటి ఆందోళనలు అటు జాతీయస్థాయిలోను, ఇటు ప్రాంతీయస్థాయిలోనూ, రంగాలవారీగానూ ఈ మధ్యకాలంలో పెద్దఎత్తున పెరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే సమ్మెలకు సమాంతర ఆందోళనా రూపాలే ఇవి. బహుశా సమ్మెను చివరాఖరి ఆయుధంగానే ఉపయోగించాలనే విజ్ఞతతో ఈ ఆందోళనలకు పూనుకున్నట్లు కనబడుతుంది.

> **"క్షేత్రస్థాయిలో జరిగిన ఈ నిరసన రూపాలన్నీ సంస్కరణల అనంతరకాలంలో గతం కన్నా కాస్త భిన్నంగా ఫ్యాక్టరీ నుండి సరుకు లోపలికి, బయటకీ పోకుండా నివారించడం, ప్లాంట్‌ను ఆక్రమించుకోవడం, నల్లబ్యాడ్జీలు ధరించడం, క్యాంటీన్ ఆహారాన్ని బాయ్‌కాట్ చేయడం, గేట్‌మీటింగ్‌లు పెట్టడం వంటి రూపాల్లో కొనసాగాయి."**

క్షేత్రస్థాయిలో జరిగిన ఈ నిరసన రూపాలన్నీ సంస్కరణల అనంతరకాలంలో గతం కన్నా కాస్త భిన్నంగా ఫ్యాక్టరీ నుండి సరుకు లోపలికి, బయటకీ పోకుండా నివారించడం, ప్లాంట్‌ను ఆక్రమించుకోవడం, నల్లబ్యాడ్జీలు ధరించడం, క్యాంటీన్ ఆహారాన్ని బాయ్‌కాట్ చేయడం, గేట్‌మీటింగ్‌లు పెట్టడం వంటి రూపాల్లో కొనసాగాయి. అడపాదడపా దాడులు, హింసాత్మక ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. నిస్సాన్ ఆటో అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోఫిట్ ఇండియా, ఆసియా ఎలక్ట్రానిక్స్, బాక్సర్ ఇండియా వంటి కంపెనీలలో కార్మికులు మెరుపు సమ్మెలకు దిగడంతోపాటు కొన్ని సందర్భాలలో పని ప్రదేశంలోనే దీర్ఘకాలం పాటు తిష్టవేశారు.

### విస్తృతమౌతున్న పోరుజెండా

కార్మిక సంఘాలు ఇటు వీధుల్లోనూ అటు లేబర్ కాన్ఫరెన్స్ (కార్మిక సదస్సు) వంటి అధికారిక వేదికల మీదనూ ద్విముఖ పోరాటం చేస్తున్నాయి. సంస్కరణల అనంతర కాలంలోని ఈ వీధి పోరాటాలు, జాయింట్ మీటింగ్‌ల తీరుతెన్నులు పరిశీలిస్తే వ్యవస్థాగతమైన సమస్యలతో పాటుగా మొత్తంగానే నిరసనల అజెండా విస్తృతమౌతున్నట్లు స్పష్టమౌతుంది. సంఘటిత రంగం కార్మికులకు సంబంధించిన సామాజిక భద్రతా చట్టాల్లోని సీలింగ్‌లను తొలగించడం, రిక్రూట్‌మెంట్‌పై నిషేధం ఎత్తివేయడం వంటి అంశాలతోపాటు కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చెయ్యాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం 10,000 రూపాయలు చెయ్యాలని (ప్రస్తుతం రూ.15,000 లు డిమాండు), సార్వజనీన సామాజిక భద్రతా పథకాలను వర్తింపచెయ్యాలని, 'స్కీమ్' కార్మికులను (అంగన్‌వాడీ, ఆశా తదితరులు) కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్ల మీద అన్ని తరగతుల కార్మికులను కదిలిస్తా ఉన్నాయి. అలాగే ఉపాధి కల్పనా అవకాశాల మీద కూడా ఆందోళన చేస్తా ఉన్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తా ఉన్నాయి. అలాగే ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐ.ఎల్.ఒ.) ఆమోదించిన విధివిధానాలను భారతదేశంలోనూ ఆమోదించాలని, కార్మికవర్గానికి రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేస్తున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చెయ్యాలని, ద్రవ్యోల్బణాన్ని, ధరల పెరుగుదలను అరికట్టాలనే జనరల్ డిమాండ్ల మీద కూడా ప్రతిపక్ష రాజకీయ పార్టీలు వొదిలి పెట్టినా, కార్మికసంఘాలు విడవకుండా ఆందోళన చేస్తున్నాయి.

### పారిశ్రామిక వివాదాలు - భౌగోళిక నూతనత్వం

లేబర్ బ్యూరో ఇచ్చిన లెక్కలు, స్టేట్ లేబర్ డిపార్ట్‌మెంట్‌లు ఇచ్చిన లెక్కలలో చాలా తేడాలు ఉన్నాయి కాబట్టి సమ్మెలకు సంబంధించి నేను రాష్ట్రాలవారీ వివరాల మీద ఆధారపడదల్చుకోలేదు.

నూతనంగా వెలిసిన పారిశ్రామిక వాడలు హర్యానాలోని గురుగావ్, మానేసర్, ధరుఎరాహ్, పంజాబ్‌లోని లూధియానా, ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా, మహారాష్ట్రలోని 'పూనె-చకన్ ప్రాంతం, తమిళనాడులోని సిరిపెరంబదూర్ వంటి ప్రాంతాలలో ఈ మధ్యకాలంలో చాలా తీవ్రమైన, హింసాత్మక పోరాటాలు చోటు చేసుకున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని బద్దీలాంటి ప్రాంతాలు కొంత మినహాయింపు.

ఈ పారిశ్రామిక వాడలలో కొత్తగా ఏ పరిశ్రమ పెట్టినా ముఖ్యంగా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అయితే వలస కార్మికులను, గ్రామీణ ప్రాంత కార్మికులను మాత్రమే పనిలోకి తీసుకోవడం ద్వారా వాళ్ళు కార్మికసంఘాల జోలికి పోకుండా, జీతభత్యాల గురించి, చట్టబద్ధమైన హక్కుల గురించి నోరెత్తనీకుండా చెయ్యడం కొత్త ఒరవడిగా అలవాటు చేసుకున్నాయి యాజమాన్యాలు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ఈ పెట్టుబడుల కేంద్రాలు, పారిశ్రామిక వాడలలో ఉపాధి కల్పన అనేది నామమాత్రంగానే ఉంటుంది.

ఇవాళ దేశంలో నెలకొంటున్న పారిశ్రామిక వాడలు ప్రపంచీకరణ దుష్ఫలితాలకు అద్దం పడుతున్నాయి. ప్రపంచీకరణ సిద్ధాంత తర్కం పుణ్యమా అని ఇవాళ పరిశ్రమలు ఎక్కడ కార్మిక శ్రమ చౌకగా ఉంటుందో, ఎక్కడ కార్మిక చట్టాలు బలహీనంగా ఉంటాయో అక్కడికి ఇట్టే తరలించబడుతున్నాయి. అయినప్పటికీ యాజమాన్యాలు ఆశించినట్లు అక్కడ కూడా యూనియన్‌ల భూతాన్ని వదిలించుకోలేకపోతున్నాయి.

ఈ నూతన పారిశ్రామీకరణ కాలంగాని కాలంలో వచ్చింది అనుకోనవసరం లేదు. సంఘటితరంగంలో కార్మికసంఘాల సభ్యత్వం ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయి, కొన్ని రంగాలలో సభ్యత్వం తగ్గుముఖం పట్టిన సంధికాలంలోనే ఈ నూతన పారిశ్రామికీకరణ వచ్చి పడింది. యాజమాన్యాలు తమ పెట్టుబడులు పదికాలాలపాటు పచ్చగా ఉండాలని కోరుకున్నట్లే కార్మికసంఘాలూ కార్మికుల జీవితాలు పచ్చగా ఉండాలని కోరుకుంటాయి. కార్మిక సంఘాలు బలోపేతంగా ఉండడానికి ప్రయత్నిస్తాయి. అయితే సంప్రదాయంగా కార్మికసంఘాలకి బలమైన ప్రాంతాలుగా ఉంటూ వచ్చిన చెన్నై, కొయంబత్తూరు, బెంగళూరు, ముంబై, ఢిల్లీ తదితర ప్రధాన నగరాలు, పట్టణాలలో సంఘాల సభ్యత్వంలో ఎదుగూ బొదుగూ లేకుండా పోయింది.

అసంఘటిత రంగంలో కార్మికులను యూనియన్ జెండా కిందకి తీసుకురావడానికి, కొత్తగా పెట్టిన, పెడుతున్న పరిశ్రమలు ఆధునికసాంకేతిక పరిజ్ఞానంతో కూడినవిగా ఉండి, అతి తక్కువ

> **"కొత్తగా నెలకొల్పిన పారిశ్రామిక వాడలలో నెలకొన్న పారిశ్రామిక వివాదాల వివరాలను పరిశీలిస్తే ఇక్కడ ఎంతటి అశాంతి నెలకొని ఉన్నదో మనం అర్థం చేసుకోవచ్చు. కాబట్టి ప్రపంచీకరణ విధానాల పెనుప్రభావం కార్మికుల మీద ప్రమాదకర స్థాయిలో కొనసాగుతుంది."**



హక్కులకోసం ఆందోళన చేస్తున్న అసంఘటితరంగాల మహిళా కార్మికులు

మంది కార్మికులతో పరిశ్రమ నడిచిపోయేదిగా ఉంటున్నాయి. పెట్టుకున్న ఈ కొద్దిమంది కార్మికులు కూడా వలస కార్మికులు కావడంతో వీరినిసంఘాలలోకి సమీకరించటం కష్టతరమౌతున్నది. సిరిపెరంబదూర్, బెంగళూరు శివారు ప్రాంతాలు, గురుగావ్-మానేసర్, ఘజియాబాద్ లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అండతో కార్మికుల శ్రమని దోచుకొనే నూతన పారిశ్రామిక అడ్డాలుగా మారాయి. ఉపాధి కల్పనలోనే రెగ్యులర్/టెంపరరీ పేరిట కార్మికుల శ్రమని దోచుకొనే నూతన విధానాలను అనుసరించ సాగాయి యాజమాన్యాలు. బలమైన కార్మిక సంఘాలుగా ఉన్న సిఐటియు, ఎఐటియుసి, లేబర్ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్ (డిఎంకె అనుబంధ సంస్థ)లు ఈ పారిశ్రామిక వాడలలో సభ్యత్వం చేర్పించేదానికి, సంఘాలు పెట్టేదానికి దూకుడు మీద పనిచేశాయి. ఆ ప్రయత్నాల్లో కొన్నిచోట్ల యాజమాన్యాలతో ఘర్షణలూ తలెత్తాయి. ఏది ఏమైనా, మారిన కార్మిక-యాజమాన్య సంబంధాల దృష్ట్యా ఈ నూతన పారిశ్రామిక వాడలు కార్మిక సంఘాలకి నూతన సామాజిక ప్రయోగశాలలుగా మారాయి.

నూతన పారిశ్రామిక వాడలలో ఉన్న కార్మిక సంబంధాలు ఏ తీరుగా ఉన్నాయో అర్థం చేసుకోవడానికి 2013 ఏప్రిల్‌లో జరిగిన ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికలో ఈ భాగాన్ని చూడండి- "ఎఐటియుసి విస్తరణకు నూతన అవకాశాలు అంది వచ్చాయి. వివిధ స్థాయిల్లో మన సంఘం దగ్గరకొచ్చి వాళ్ళ సమస్యల పరిష్కారం చెయ్యాలని, మన సంఘంతో అనుబంధం కావాలని కొత్త కొత్త శక్తులు వచ్చి అడుగుతున్నాయి. అలాగే వివిధ నగరాల చుట్టూ కొత్తగా పారిశ్రామిక జోన్‌లు ఆవిర్భవిస్తున్నాయి. అట్లాంటి చోటల్లా సంఘ నిర్మాణం చేసేదానికి కృషి జరుగుతా ఉంది.

"ఇక్కడి కార్మికులు యువకప్రాయంలో ఉంటున్నారు. ఆయా ఫ్యాక్టరీలు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం మూలంగా ఇందులో పనిచేసే కార్మికులకూ ఆ సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన ఉండడంతో వారికి స్వతహాగా సంఘాన్ని నెలకొల్పడం, నిర్మాణం, పోరాటం తదితర ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహించుకునే సత్తా కూడా ఉంటుంది. ఈ కార్మికులు అంతా నవతరం కార్మికులు" (ట్రేడ్ యూనియన్ రికార్డ్, 2013 మార్చి 21 ఏప్రిల్ 20 సంచిక పేజీ - 5, 6)

కొత్తగా నెలకొల్పిన పారిశ్రామిక వాడలలో నెలకొన్న పారిశ్రామిక వివాదాల వివరాలను పరిశీలిస్తే ఇక్కడ ఎంతటి అశాంతి నెలకొని ఉన్నదో మనం అర్థం చేసుకోవచ్చు. కాబట్టి ప్రపంచీకరణ విధానాల పెనుప్రభావం కార్మికుల మీద ప్రమాదకర స్థాయిలో కొనసాగుతుంది. ఇది యాజమాన్యాలకు కూడా అంత మంచిది కాదు. గురుగావ్-మానేసర్ పారిశ్రామిక వాడ యావత్తూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలమీద, కార్మిక సంఘం గుర్తింపు అంశంమీద ఆందోళనలు, సమ్మెలతో అట్టుడికిపోతోంది. లూథియానాలో పవర్‌లూమ్ కార్మికులు చీటికి మాటికీ సమ్మెలకు దిగాల్సివస్తుంది. మానేసర్ ప్రాంతంలో రికో ఆటో ఫ్యాక్టరీలో సమ్మె సందర్భంగా యాజమాన్యం గూండాలతో భౌతిక దాడులకు దిగిన ఫలితంగా ఒక కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ఆ వార్త తెలిసిన వెంటనే మానేసర్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షమంది కార్మికులు మెరుపుసమ్మె చేశారు. సిరిపెరంబదూర్‌లోని నోకియా ఫాక్స్‌కాన్ తదితర అనేక ఫ్యాక్టరీలలో యూనియన్ గుర్తింపు కోసం, ద్వైపాక్షిక చర్చలకోసం వరసవారీ సమ్మెలు జరిగాయి. పూనే-చక్నా ప్రాంతంలో సంఘాలు పెట్టుకోవడం, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, షేర్ల కేటాయింపు తదితర అంశాల మీద అనేక సమ్మెలు జరిగాయి. బజాజ్ ఆటో కార్మికులు షేరు ఒక్కింటికి రూపాయి చొప్పున 500 షేర్లు ప్రతి కార్మికుడికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేశారు. నూతన కార్మికవర్గంలో నూతన ఆకాంక్షలకు ఈ డిమాండు అద్దం పడుతుంది. ఈ డిమాండు నెరవేరలేదనుకోండి. అది వేరే అంశం. అలానే కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరిట ఖర్చు చేస్తున్న నిధుల వివరాలు వెల్లడించాలని కూడా కార్మికులు ఆందోళన చేశారు. యాజమాన్యాలు ఈ డిమాండ్లను అశాస్త్రీయమైనవిగా పేర్కొంటూ నియంతృత్వ ధోరణితో త్రోసిపుచ్చాయి. కాని రాబోయే కాలంలో కార్మికుల ఆలోచనలు డిమాండ్లు మారనున్నాయి అనే దానికి ఇవి కొన్ని తార్కాణాలు. సంపద సృష్టికర్తలైన కార్మికులు ఆ సంపద పంపిణీలో తమకూ న్యాయమైన వాటా కావాలనే ఆలోచన చేస్తా ఉన్నారు.

**పారిశ్రామిక అశాంతి-హింసాత్మక**

### ఘటనలు

మీడియాలో ఈ మధ్యకాలంలో కార్మికుల నిరసన హింసాత్మక ఘటనలకు దారితీసిన సందర్భాల గురించి మాత్రమే ఎక్కువ చేసి చూపించడం పరిపాటిగా మారింది. కాని పని ప్రదేశాల్లో సెక్యూరిటీ పేరిట కార్మికుల మీద పెట్టే ఆంక్షలు, వారి కదలికల మీద నిఘా, పనిలో ఒత్తిడి, దుర్భాషలాడడం, కొన్ని సందర్భాల్లో చెయ్యి చేసుకోవడం వగైరా అంశాలను మీడియా ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇక ఫ్యాక్టరీలలో జరిగే ప్రమాదాలు, వాటి నేపథ్యాలు అనంతరం పరిస్థితులు వీటి గురించి మీడియా పెద్దగా ప్రచారం చేసిందే ఉండదు.

తమ డిమాండ్ల సాధనకోసం ప్రశాంతంగా ఆందోళన చేసే కార్మికుల మీద హఠాత్తుగా గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి నానా భీభత్సం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పోలీసు రికార్డులు 'గుర్తు తెలియని వ్యక్తులు' అని చెబుతున్నా వాళ్ళు యాజమాన్యం కిరాయికి తెచ్చి కార్మికుల మీదకి ఉసిగొల్పిన గూండా ముఠాలనేది జగమెరిగిన సత్యం. అలాగే న్యాయమైన డిమాండ్ల సాధనకోసం చట్ట పరిధిలో నిరసన తెలియచేస్తున్న కార్మికుల మీద యాజమాన్యాలు అనేకరకాల కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. కార్మికులను డిస్మిస్ చెయ్యడం, కార్మికసంఘాలతో చర్చలకు నిరాకరిచడం, చిన్నా, చితకా వాటికే క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం, ఇన్సెంటివ్‌లు ఎగవెయ్యడం, పనిభారం విపరీతంగా పెంచడం ఇవన్నీ కార్మికులను కవ్వించే చర్యలే. బహుళజాతి కంపెనీలలో ఇవి అతి సాధారణంగా జరిగే చర్యలు. సహజంగానే ఇలాంటి సందర్భాలలో కోపోద్రిక్తులై కార్మికులు అక్కడక్కడా దాడులకు దిగిన సంఘటనలూ ఉన్నాయి. ఈ దాడులలో పర్సనల్ మేనేజర్ల వంటివారు హతమైపోయిన సందర్భాలూ ఉన్నాయి. 2008లో గురుగావ్‌లోని గ్రాజియానో ట్రాన్స్‌మిషన్‌లో, 2009లో కొయంబత్తూర్‌లోని ప్రైకాల్‌లో, 2010లో బోష్ ఫ్యాక్టరీలో, ఘజియాబాద్‌లోని అల్లైడ్ నిప్పాన్‌లో 2012లో గురుగావ్‌లోని మారుతీ సుజుకిలో 2009లో మహారాష్ట్ర (కొత్రుద్)లోని కిర్లోస్కర్ కమ్మిన్స్‌లో 2011లో భువనేశ్వర్‌లోని గ్రాఫైట్ ఇండియా పౌమెక్స్ స్టీల్స్‌లో ఇలాంటి ఘటనలు జరిగాయి.

"తమ డిమాండ్ల సాధనకోసం ప్రశాంతంగా ఆందోళన చేసే కార్మికుల మీద హఠాత్తుగా గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి నానా భీభత్సం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పోలీసు రికార్డులు 'గుర్తు తెలియని వ్యక్తులు' అని చెబుతున్నా వాళ్ళు యాజమాన్యం కిరాయికి తెచ్చి కార్మికుల మీదకి ఉసిగొల్పిన గూండా ముఠాలనేది జగమెరిగిన సత్యం."

ఇందాక చెప్పుకున్నట్లు ఇవి చెదురుమదురు ఘనటలే కానీ యాజమాన్యాలు మాత్రం కిరాయి గూండాలతో కార్మికులమీద అటు పని ప్రదేశం లోను ఇటు నివాస ప్రాంతాల్లోనూ దాడులు చేయించిన ఘటనలు అనేకం. ఇళ్ళమీద పడి బెదిరించడం, దాడిచెయ్యడం, కిడ్నాప్‌లకు పూనుకోవడం ఇలాంటి వాటికి అంతేలేదు. వివా గ్లోబల్ గార్మెంట్స్ ఫ్యాక్టరీ కార్మికసంఘ నాయకుడిని (2010లో) ఇలానే కిడ్నాప్ చేశారు. ఘజియాబాద్‌లోని అలైడ్ నిప్పాన్ ఫ్యాక్టరీ యాజమాన్యం గన్‌మెన్‌లను నియమించి వాళ్ళతో కార్మికులని బెదిరించి పనిలోకి దింపే దానికి ప్రయత్నించింది. మరాఠీ దినపత్రిక (దేశోన్నతి) యజమాని సెక్యూరిటీ గార్డ్‌ని కాల్చి చంపాడు. గురుగావ్‌లోని ఓరియంట్ క్రాఫ్ట్‌లో కాంట్రాక్టర్ కార్మికుల మీద దాడిచేశాడు. గ్రజియానో ట్రాన్స్‌మిషన్ కంపెనీ కాంట్రాక్టర్లు కిరాయి గూండాలని కార్మికుల మీదకి ఉసిగొల్పి దాడి చేయించారు. ఇహ అసంఘటిత రంగంలో అయితే ఆధునిక రూపంలోని కట్టుబానిసత్వం కొనసాగడంతోపాటు మహిళలపై లైంగిక వేధింపులు, బలాత్కారాలు, నిలువు దోపిడీలకు కూడా పాల్పడుతున్నాయి యాజమాన్యాలు. గుజరాత్‌లోని ఇటుక బట్టీల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు తమ కనీస సమస్యల పరిష్కారం కోసం నిరసనలకు దిగితే ఆ బట్టీ యజమాని కార్మికుల ఇళ్ళలో ఆడవాళ్ళని 'రేప్' చేయిస్తా అని భయపెట్టి కార్మికులను లొంగ దీసుకున్నాడు. ఢిల్లీలో నిరసన తెలియజేస్తున్న 20,000 మంది బాదం ఒలుపు మహిళా కార్మికుల మీద గూండాలు దాడులకు తెగబడ్డారు. ఇంతా చేసి చాలాచోట్ల యాజమాన్యాలు కార్మికుల మీద తప్పుడు కేసులు బనాయించి వారిని పోలీస్‌స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిప్పించి కార్మికసంఘాన్ని అణిచివేసేందుకు పూనుకున్నాయి.

సంస్కరణ అనంతరకాలంలో పని ప్రదేశంలో పోలీసులు 'పికెట్' పెట్టడం, ఆందోళన చేస్తున్న కార్మికుల మీద అకారణంగా విరుచుకుపడి లాఠీఛార్జి చెయ్యడం నిత్యకృత్యంగా మారిపోయింది. ఉదాహరణగా కొన్ని సంఘటనలు చెప్పుకోవాలంటే రాజస్తాన్‌లో, ఛత్తీస్‌ఘర్‌లో వండర్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులమీద పోలీసులు బాష్పవాయు ప్రయోగం చేశారు (2012) మానేసర్‌లోని రికో ఆటో ఫ్యాక్టరీ కార్మికులమీద పోలీసు లాఠీఛార్జి జరిగింది (2008), యానాంలోని రీజన్సీ సిరామిక్స్‌లో పోలీసు దాష్టీకం మూలంగా కార్మికసంఘ నాయకుడు మరణించాడు (2012). ఇలా ఎన్నయినా ఉదహరించవచ్చు. ఇలా పోలీసులను మోహరించడమే ఆందోళన చేస్తున్న కార్మికులను రెచ్చగొట్టే దానికి అనేది స్పష్టమయిపోతా ఉంది. పోలీసులు ఈ రకంగా ఏకపక్షంగా వ్యవహరించడం యాజమాన్యాల కండబలాన్ని ప్రదర్శించడమే. ఒక్కమాటలో చెప్పాలంటే పోలీసు వ్యవస్థ కూడా యాజమాన్యాల కొమ్ముకాయడంతోటే తరించిపోతా ఉంది. ఇహ యాజమాన్యాలకు వత్తాసుగా 'ప్రజా సంక్షేమం' పేరిట 'ఆర్థిక పురోగతి కుంటుబడకుండా చూసే' సాకుతో ప్రభుత్వాలు సమ్మె చేస్తున్న కార్మికుల మీద 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగిస్తానే ఉంటాయి, ప్రయోగిస్తామని బెదిరిస్తానే ఉంటాయి.

సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల రాజ్యం వైఖరి ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. పెట్టుబడిదారులను బుజ్జగించడానికి, భవిష్య పెట్టుబడిదారులను ఆకర్షించడానికి కార్మికుల ఆందోళనలను, నిరసనలను, సమ్మెలను అతి కర్కశంగా అణిచి వెయ్యడానికే చూస్తుంది. ఇది కేవలం సంఘటిత కార్మికుల మీద అనే కాదు అసంఘటిత రంగ కార్మికుల పట్ల కూడా ఇదే వైఖరి అవలంభిస్తా ఉంది. పంజాబ్‌లోని బాదల్ పట్టణంలో బహుళార్ధ సాధక ఆరోగ్య కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలోని 'ఆషా' వర్కర్లమీద కూడా పోలీసులు ఇలానే దాడులకు తెగబడ్డారు. పారిశ్రామిక సంబంధాలు మరింత దిగజారిపోయాయని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణలు ఏం కావాలి?

> **"ఈ దశాబ్దకాలంలో నిర్మాణరంగం, ఇంటి పనివారల రంగం, చేపల వేట, వీధి అమ్మకందార్లు తదితర అనేక అసంఘటిత రంగాల్లో లెక్కలేనన్ని పోరాటాలు జరిగాయి. నిజానికి అసంఘ టితరంగ కార్మికుల పోరాటాలను ప్రత్యేకంగా విడిగా విశ్లేషించాలే తప్ప ఈ వ్యాసం పరిధిలో కుదించి చెప్పడం అసాధ్యం."**

ఒక పక్క ఉద్యోగ భద్రత లేకపోవడం, మరో ప్రక్క పని ఒత్తిడి, అడుగూబొడుగూ జీతాలతో కుటుంబ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా ఉండడం, నెలలపాటు జీతాలు అందకపోవడం, పైపెచ్చు అధికారుల, యాజమాన్యాల వేధింపులు - ఇవన్నీ ఒక్కోసారి కార్మికులను తీవ్ర నిరాశకు లోను చేసి ఆత్మహత్యలకు పురికొల్పుతున్నాయి. బి.వై.డి. ఎలక్ట్రానిక్స్‌లో కార్మికసంఘం పెట్టాడన్న సాకుతో ఒక కార్మికుడిని వేధింపులకు గురిచేస్తే అది తట్టుకోలేక అతను ఆత్మహత్యాయత్నం చేశాడు. ఐ.టి.ఐ. చదువుకున్న బాలాజీ అనే కార్మికుడు సిరిపెరంబదూర్‌లోని ఐఎస్‌ఐ ఆటోమోటివ్‌లో మూడేళ్ళు కాంట్రాక్ట్ కార్మికుడిగా, ఆ తరువాత మరో మూడేళ్ళు అప్రెంటిస్‌గా పనిచేశాడు. ఉన్నట్టుండి అతన్ని ఉద్యోగంనుండి తీసివెయ్యడంతో అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2009-2010 మధ్య ఏడాదికాలంలో తిరుప్పూర్‌లోని బట్టల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులలో వెయ్యిమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

కార్మికులు ఎక్కడన్నా హింసకు పాల్పడితే కార్మిక సంఘాల నాయకులు అలాంటి చర్యలను ఖండిస్తున్నారు. అయితే ఉద్యోగ భద్రత లేకపోవడం, నికరమైన ఆదాయం కొరవడడం, చాలీచాలని జీతభత్యాలు, అమానవీయ పనిభారం, కార్మిక చట్టాలను అమలు చెయ్యకపోవడం, ఇలాంటివన్నీ పారిశ్రామిక సంబంధాలను దిగజార్చి కార్మికులను హింసకు ప్రేరేపిస్తున్నాయి. కనీస వేతనాలు, స్టాండింగ్ ఆర్డర్స్, ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. వారంతపు సెలవుల వంటి అంశాల అమలును పర్యవేక్షించాల్సిన లేబర్ డిపార్ట్‌మెంట్ కూడా అలంకారప్రాయంగా మారిపోవడంతో గత్యంతరం లేకనే కార్మికులు అడపాదడపా హింసాత్మక చర్యలకు దిగుతున్నారని యూనియన్ నాయకులు చెప్పేవాదనలో నిజం ఉందని స్పష్టమౌతున్నది.

'వేతన స్తంభన, చాలీచాలని జీతాలు ఈ రెండూ కూడా కార్మికుల మీద యాజమాన్యాలు చేస్తున్న ఆర్థిక హింసే అని కార్మిక నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. కార్మికులు ఎక్కడన్నా అదుపు తప్పి హింసకు పాల్పడితే భూతద్దంతో చూపెట్టే మీడియా యాజమాన్యాలు కార్మికవర్గం మీద నిత్యం కొనసాగిస్తున్న ఈ ఆర్థిక హింస గురించి, కార్మిక చట్టాల ఉల్లంఘన గురించి, శ్రమదోపిడీ గురించి పల్లెత్తుమాట మాట్లాడటం లేదు. కార్మిక సంస్కరణలు అంటే యాజమాన్యాలు కోరుకుంటున్నట్లు చట్టాలను, పర్యవేక్షణా సంస్థలను నీరుకార్చడం కాదు. వాటిని పటిష్టంగా అమలు చెయ్యడమే కార్మిక శ్రేయస్సుకు హామీనిస్తాయి.

### ప్రపంచీకరణ-పోరాటాలు

గత పదేళ్ళకాలంలో భారతదేశం పారిశ్రామిక సంబంధాలు క్రియాశీలంగా మారడానికి అనేక అంతర్జాతీయ కార్మిక సంఘ సమాఖ్యలు-ఆహారం, వ్యవసాయం, హోటల్ రెస్టారెంట్, క్యాటరింగ్, టుబాకో తదితర అనుబంధ కార్మిక అసోసియేషన్ (హెచ్.యు.ఎఫ్), ఇండస్ట్రీయల్ గ్లోబల్ యూనియన్ వంటివి - తమవంతు సహకారాన్ని అందించాయి. ప్రధానంగా అవి నాలుగు ప్రాథమిక కర్తవ్యాలకు చేయూతనిచ్చాయి. (1) బహుళజాతి కంపెనీలు, నౌకా నిర్మాణ రంగాల్లో కార్మిక సంఘాలు నెలకొల్పడానికి, ఉమ్మడి బేరసారాల హక్కులకోసం పోరాడే దానికి తగిన సహాయ సహకారాలు అందించడం (2) బహుళజాతి కంపెనీల యాజమాన్యాలతో చర్చలకు తగిన సాంకేతిక నైపుణ్యం అందించడం (3) అంతర్జాతీయ కార్మికసంస్థ ఐ.ఎల్.ఒ. ఆమోదించిన ప్రమాణాలను ఇక్కడి బహుళజాతి కంపెనీలు గౌరవించే రీతిలో అంతర్జాతీయ ఒప్పందాల చట్రం ద్వారా ఒత్తిడి తీసుకురావడం (4) బహుళజాతి కంపెనీలతో తలెత్తిన వివాదాల పరిష్కారంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం ద్వారాగానీ, ఐ.ఎల్.ఒ. నేతృత్వంలోని చట్రాలను ఉపయోగపెట్టడం ద్వారా పరోక్షంగా జోక్యం చేసుకున్నాయి. నెస్లే ఇండియాలో యూనియన్ గుర్తింపు, ద్వైపాక్షిక చర్చలకు సంబంధించిన వివాదాల్లో (2009) ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఇండస్ట్రీయల్ ఫెడరేషన్ వంటి అంతర్జాతీయ కార్మిక సంఘాలు జోక్యం చేసుకొని వివాద పరిష్కారానికి తోడ్పడ్డాయి. హిందూస్తాన్ లీవర్ నియంత్రణలో ఉన్న అస్సాం టీ ఎస్టేట్ కార్మికుల పోరాటాలు గ్లాక్సో స్మిత్ క్లెయిన్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ తదితర అనేక పోరాటాల్లో అంతర్జాతీయ కార్మిక సంఘాలు ఇక్కడి కార్మిక వర్గానికి అండదండగా నిలిచాయి.

### అసంఘటితరంగ కార్మికుల నిర్మాణం - పోరాటాలు

ఈ దశాబ్దకాలంలో నిర్మాణరంగం, ఇంటి పనివారల రంగం, చేపల వేట, వీధి అమ్మకందార్లు తదితర అనేక అసంఘటితరంగాల్లో లెక్కలేనన్ని పోరాటాలు జరిగాయి. నిజానికి అసంఘటితరంగ కార్మికుల పోరాటాలను ప్రత్యేకంగా విడిగా విశ్లేషించాలే తప్ప ఈ వ్యాసం పరిధిలో కుదించి చెప్పడం అసాధ్యం.

అసంఘటితరంగ కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవి:-

1. తక్షణమే అసంఘటితరంగ కార్మికులకు సంబంధించి నిర్దిష్ట చట్టాలు చెయ్యాలి (2) సంక్షేమ బోర్డుల ఏర్పాటు చెయ్యడం. అలాగే ఉన్న బోర్డులు కార్మిక సంక్షేమం కోసం పనిచెయ్యాలి (3) ప్రభుత్వ కమిటీలలో అసంఘటితరంగ కార్మిక ప్రతినిధులకు తగు ప్రాతినిధ్యం ఉండాలి (4) కనీస వేతనాలను సవరించాలి. సవరించిన వేతనాల అమలుకు సమర్థవంతమైన పర్యవేక్షణా సంస్థ ఉండాలి. ఇంటి పనివారలను కూడా కనీస వేతన చట్టం పరిధిలోకి తీసుకురావాలి. (5) పెన్షన్, గ్రాట్యుటీ తదితర సామాజిక సంక్షేమ పథకాలను వర్తింపచెయ్యాలి. (6) ఇటుక బట్టీలు, పవర్‌లూమ్ రంగాలలో వెట్టిచాకిరీ నుండి కార్మికులను విముక్తం చెయ్యాలి. మెరుగైన పని పరిస్థితులు, మెరుగైన జీత భత్యాలు కల్పించాలి.

ఈ డిమాండ్లమీద అసంఘటితరంగ కార్మికులు అనేక పోరాటాలు నిర్వహించారు. ఇప్పటిదాకా 'గౌరవ వేతనం' మీద పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్‌వాడీ తదితర స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలనే ప్రధానమైన డిమాండు సాధనలో కొన్ని విజయాలు సాధించారు.

అసంఘటితరంగ కార్మికుల ప్రధాన

సమస్యలు–జీవనం గడపడానికి తగిన పని, పని ప్రదేశంలో భద్రత సమకూర్చుకోవడం, ఈ క్రమంలో వారు తమ హక్కుల సాధన కోసం పోరాటం చేసే క్రమంలో ఎదురైన చట్టపరమైన అవరోధాలను, అవాంతరాలను అధిగమించి కోర్టులద్వారా తమ హక్కులు నిలబెట్టుకున్న అనుభవాలు గడించారు. వీధుల్లో అమ్మకాల ద్వారా జీవనం సాగించేవారు ట్రాఫిక్ పేరిట, అవాంతరాల పేరిట కల్పించిన చట్టపరమైన అడ్డంకులు ఎలా అధిగమించిందీ తెలుసుకోవాలంటే వాళ్ళ సంఘం నడుపుతున్న నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండార్స్ వెబ్‌సైట్ చూసి తీరాల్సిందే. పర్యావరణం పేరిట కల్పించిన అడ్డంకులను అటవీ కార్మికులు, మత్స్య కార్మికులు ఎలా అధిగమించారో తెలుసుకొని తీరాల్సిందే.

అసంఘటితరంగ కార్మికుల నిర్మాణ వ్యూహాలు చాలా ఆసక్తిదాయకంగా ఉన్నాయి. ఏ రంగానికి ఆ రంగంలో కార్మిక సంఘం పెట్టుకున్నారు. కేంద్ర కార్మిక సంఘాలు కూడా అసంఘటితరంగంలో ఏ రంగాన్ని వదిలిపెట్టకుండా అన్ని రంగాలలో కార్మికులను సంఘటితం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయి. స్వతంత్రంగా కొన్ని సంఘాలు ఉన్నా 'రాజకీయ పలుకుబడి కోసం ఆ సంఘాలు వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలతో అనుబంధమో, దగ్గరి సంబంధాలో కొనసాగిస్తున్నాయి.

అసంఘటితరంగ కార్మికుల పోరాటాలలో మూడు ప్రధాన పార్శ్వాలు మనకు కనిపిస్తాయి.

(1) రంగాల వారీ సంఘాలు పరస్పర సహకారంతో ముందుకు సాగడం ఒక పద్ధతి. ఉదాహరణకు అటవీ కార్మికులు సహజ వనరులమీద ఆధారపడి ఉన్న వ్యవసాయ కార్మికులు, రైతులు, గిరిజనుల సంస్థలతో కలిసి తమ పోరాటాన్ని విస్తృత వేదిక ద్వారా నిర్వహిస్తూ ఉన్నారు.

(2) కార్మిక సంఘాలు వివిధ సామాజిక సంస్థలతో సమన్వయం చేసుకొని ప్రజాక్షేత్రంలో తగిన మద్దతు కూడగట్టుకోవడం. ఉదాహరణకు అంగన్‌వాడీ కార్మికసంఘం, ఆల్ ఇండియా కిసాన్ సభ, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా తదితర ప్రజా సంఘాలతో కలిసి ఐ.సి.డి.ఎస్. వ్యవస్థను పరిరక్షించుకునేందుకు పోరాటం చేశారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తతలు చోటు చేసుకున్నా ఈ వైఖరే సరైన ఫలితాలు ఇస్తుంది. (3) భారతదేశంలో సంఘటిత కార్మిక రంగానికి అసంఘటితరంగ కార్మిక రంగానికి మధ్యన పరస్పర సహకారం, సమన్వయం పెంచుకోవడానికి ఉన్న విస్తృత అవకాశాలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చుకుంటున్న కృషి ఈ మధ్యకాలంలో ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంది. అయితే అక్కడక్కడా చిన్న చిన్న పొరపొచ్చాలూ బయటపడుతున్నాయి. సెల్ఫ్ ఎంప్లాయి ఉమెన్స్ అసోసియేషన్ (సేవా) అనే సంస్థ ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ (ఐ.టి.యు.సి.) అనుబంధం కోరడాన్ని కొన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. అయినప్పటికీ ప్రపంచీకరణ విధానాల ఉధృతి ఇలాంటి చిన్న చిన్న అభిప్రాయ భేదాలన్నీ పక్కనబెట్టి అసంఘటితరంగ కార్మికులను మొత్తంగా ఏకీకృతం చేసి, ఏకోన్ముఖంగా అఖిలభారత సమ్మెలు చేసే దిశగా కేంద్ర కార్మికసంఘాలు నడిపించాయి.

అసంఘటితరంగ కార్మికసంఘాలు అనేక కారణాల రీత్యా తమ పోరాటాన్ని రాజ్యం మీదకు ఎక్కుపెట్టాయి. ఎందుకంటే చట్టాలు చెయ్యాల్సింది, కార్మికులకు తగిన రక్షణ కల్పించాల్సింది ప్రభుత్వమే కాబట్టి. పేదరిక నిర్మూలనా పథకాలు, ఉపాధి అవకాశాలు, ఆదాయ పంపిణీ విధానాలు, సామాజిక భద్రతా కల్పన ఇవన్నీ ప్రభుత్వమే నిర్ణయిస్తుంది కాబట్టి. కొంతమంది పండితులు సంఘటితరంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి కాబట్టే అసంఘటితరంగంలో ఆ అవకాశాలు పెరుగుతున్నాయి అని సాధారణ సూత్రీకరణ చేస్తుంటారు. కానీ నిజానికి ప్రభుత్వ విధానాలు ఆఖరికి న్యాయవ్యవస్థ సహా పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాలకు ఊతమిచ్చే విధి విధానాలు రూపొందించడం మూలంగానే సంఘటితరంగంలో ఉపాధి అవకాశాలు తగ్గి అసంఘటితరంగం పెరుగుతా వస్తుందనే వాస్తవాన్ని దాచిపెడుతున్నారు. ఉపాధి కల్పనకోసం నిర్దిష్టమైన విధి విధానాలు రూపొందించడంలో ప్రభుత్వం విఫలం కావడం మూలంగానే దాన్ని దోషిగా నిలబెట్టాల్సి వస్తుంది.

> “ రాజ్యమే పెట్టుబడిపక్షాన నిలబడిన నేపథ్యంలో కార్మికవర్గం ఈ రోజున కొంతమేరకయినా మేళ్ళు సాధించుకోగలిగిం దంటే అది కార్మికవర్గ నిరంతర పోరాటాలు, మేధావులు- సామాజిక కార్యకర్తల తోడ్పాటు, నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్ ప్రైజెస్ ఇన్ అన్ ఆర్గనైజ్డ్ సెక్టార్, నేషనల్ ఎడ్వైజరీ కౌన్సిల్‌ల చొరవలతో పాటు వామపక్ష పార్టీలు పోషించిన ముఖ్య భూమిక విస్మరించలేనిది. ”

రాజ్యమే పెట్టుబడిపక్షాన నిలబడిన నేపథ్యంలో కార్మికవర్గం ఈ రోజున కొంతమేరకయినా మేళ్ళు సాధించుకోగలిగిం దంటే అది కార్మికవర్గ నిరంతర పోరాటాలు, మేధావులు–సామాజిక కార్యకర్తల తోడ్పాటు, నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్ ఇన్ అన్ ఆర్గనైజ్డ్ సెక్టార్, నేషనల్ ఎడ్వైజరీ కౌన్సిల్‌ల చొరవలతో పాటు వామపక్ష పార్టీలు పోషించిన ముఖ్య భూమిక విస్మరించలేనిది. అసంఘటితరంగ కార్మికులు సాధించుకున్న విజయాలు వారు ఇంకా సాధించుకోవాల్సిన డిమాండ్లతో పోలిస్తే పూర్తిగా సంతృప్తినివ్వలేకపోయినా ఆ అజెండాను సాధించుకోవడానికి దీర్ఘకాలిక పోరాటాల అవసరాన్ని తెలియచేస్తున్నాయి.

**ఉపసంహారం**

అధికారిక గణాంకాలకు ఉండే పరిమితులు ఏవైనప్పటికీ అవి చాలా వివాదాస్పద ఫలితాలను వెల్లడిస్తున్నాయి. సంస్కరణల అనంతర కాలంలో సమ్మెలు, లాకౌట్లు తగ్గినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నా కార్మికుల సమరశీలత, పోరాటాల్లో కార్మికుల భాగస్వామ్యం పెరుగుతూ వస్తుందని స్పష్టమౌతుంది. అంటే పోరాటాల విస్తృతి పెరుగుతూ వస్తున్నది. సమ్మెల విషయానికొస్తే భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అగ్రస్థానంలో నిలబడింది. ప్రభుత్వం ఈ పారిశ్రామిక అశాంతిని సద్దుమణిగేలా చెయ్యడానికి సామ దాన భేద దండోపాయాలు ఉపయోగించినా కార్మికుల పోరాటాలు, సమ్మెలను నిలవరించలేకపోతుంది. ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేస్తుంది అనేది ప్రకటనల వరకే పరిమితమయ్యాయి. కార్మికవర్గం మాత్రం తమ కోర్కెల సాధనకు పోరాటం మినహా మరో మార్గం లేదన్న కృత నిశ్చయం, నిర్ణయాలతో ముందుకు సాగుతుంది.

**(తెలుగు : సత్యరంజన్ .కె)**

# భారత దేశంలో మానవ హక్కులు



రచయిత ప్రముఖ సామాజిక కార్యకర్త

**తీస్తా సెతల్వాద్**

***సుందరయ్య వర్ధంతి సందర్భంగా మే నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సుందరయ్య స్మారకసభలో సామాజిక ఉద్యమకారిణి, మైనారిటీల రక్షణ కోసం 2002లో గుజరాత్‌లో ముస్లీంలపై జరిగిన మారణకాండలో నిందితులకు శిక్షలు పడాలని, బాధితులకు న్యాయం జరగాలని పోరాటం చేస్తున్న "కమ్యూనలిజం కంబాట్" సంస్థ నాయకురాలు తీస్తా సెతల్వాద్ చేసిన ప్రసంగంలోని ప్రాధానాంశాల్ని మార్చిప్తు పాఠకులకు అందిస్తున్నాం.***

చరిత్రలోని కీలకమైన సమయంలో ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులను అంచనా వేయటానికి, ప్రత్యేకంగా మానవహక్కుల పరిరక్షణను గురించి చర్చించటానికి మనం ఇక్కడ సమావేశమవుతున్నాం. దేశప్రజలందరికీ సమాన హక్కులను అంగీకరించని, సర్వమానవ సమానత్వాన్ని ఆమోదించని, సహజసిద్ధంగా రాజ్యాంగ వ్యతిరేక దృక్పధం కలిగిన పార్టీ భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా పార్లమెంటులోని 543 స్థానాలకుగానూ 282 స్థానాలు సాధించి, అధికారంలోకి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వానికి సైద్ధాంతిక మార్గదర్శి అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏనాడూ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామి కాలేదు. అందుకు విరుద్ధంగా అనేక సందర్భాలలో వలస పాలకులతో కుమ్మక్కైంది. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా సామాజిక, మతపరమైన విషయాలలో మితవాద దృక్పధం కలిగిన, మెజారిటి మద్దత్తు కలిగిన ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆర్థికాంశాలలోనూ మితవాద దృక్పధం కలిగి, ప్రభుత్వ నిధులను ప్రైవేటు రంగానికి అప్పగించటం, చాలాకాలం నుండి జరుగుతున్న గ్రామీణాభివృద్ధి (ఉపాధి హామీ పథకం లాంటివి) కార్యక్రమాలకు నిధులను కోతపెట్టటం చేస్తున్నది. ప్రాథమిక హక్కులకు ప్రమాదం కలిగించే, గౌరవప్రదమైన జీవితానికి హామీ ఇస్తున్న కార్మిక చట్టాలకు సవరణలను ప్రతిపాదించింది. దేశంలో ఉన్న కార్మికుల్లో ఏడు శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉండి, చట్టపరమైన రక్షణలను పొందగలుగుతున్నారు. పేదల పిల్లల పట్ల వివక్ష చూపే బాల కార్మిక నిషేధ చట్టానికి సవరణ లను తీసుకురావటం ద్వారా ఆ చట్టాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటు పెట్టు బడుల గుప్పిట్లో ఉన్న ఈ ప్రభుత్వం ఫాసిజానికి నమూనాగా మరే ప్రమాదం ఉన్నది.

ఈ ప్రమాదానికి వ్యతిరేకంగా ఏ రంగాలలో పోరాటాలు నిర్వహించాలి, ఆర్థిక, సామాజిక రంగాలలో ఎటువంటి సంఘటనలను, ఏ రూపంలో నిర్మించటం ద్వారా దీనికి ప్రతిఘటనను నిర్మించగలం? ఇదే నాకు ప్రస్తుతం అతి పెద్ద సవాలుగా కనిపిస్తున్నది. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు రాజ్యసభలో అధికార సమతుల్యాన్ని ప్రతిపక్షానికి అనుకూలం గా ఉంచగలవనే చిన్న ఆశ మాత్రమే కనిపిస్తు న్నది. ప్రాంతీయ పార్టీలు రాజకీయ ప్రయోజ నాల కోసం, స్వలాభాల కోసం చూసుకుంటూ, తమను తాము కాపాడుకోవటానికి పూనుకుంటే ఈ ఆశ కూడా అంతరించిపోతుంది.

### పేదల పిల్లల హక్కులపై దాడి

అందరూ ఖండిస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, బాలల శ్రమను చట్టబద్ధం చేయటానికి ప్రయత్నిస్తున్నది. దశాబ్దాల నుండి జరుగుతున్న బాలల హక్కుల పరిరక్షణ సంఘాల కార్యకలాపాల ఫలితంగా గత యుపిఏ ప్రభుత్వం చైల్డ్ లేబర్ ప్రొహిబిషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ 1986కు ఆలస్యంగా సవరణలు తీసుకొచ్చింది. 14 సంవత్సరాల వయసు వరకు బాలల చేత చేయించే అన్ని రకాలైన పనులను ఆ సవరణలు నిషేధించాయి. ప్రమాదకరమైన పనులలో 14నుండి 18 సంవత్సరాల మధ్య వయసులోని బాలల చేత పని చేయించటాన్ని నిషేధించాయి. యుపిఏ ప్రభుత్వ చివరి కాలంలో పార్లమెంటును స్థంభింపచేయటం, బాలల హక్కులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో ఈ సవరణలు ఓటింగ్‌కు రాలేదు. వీటిలో ఒక అభ్యుదయకరమైన అంశం 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు ప్రమాదకరమైన పనులు చేయటాన్ని నిషేధించే సవరణకు ఈ మధ్యనే కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అన్ని రకాలైన బాలల శ్రమను పూర్తిగా నిషేధించాలి. ఈ నూతన సవరణ 14 సంవత్సరాలలోపు పిల్లలు స్కూళ్ళలో చదవాలని చెబుతూనే, స్కూలు వదిలిన తర్వాత, సెలవులు, ఇతరంగా ఖాళీ సమయాలలో పొలాలలో, అడవులు, గృహ ప్రాతిపదికగా జరిగే పనులలో ప్రమాదకరం కాని రంగాలలో పని చేయవచ్చునని చెబుతూ బాలల శ్రమను చట్టబద్ధం చేయటానికి ప్రయత్నించింది.'' భారతీయ సామాజిక వ్యవస్థలో పిల్లలు కుటుంబ పెద్దలతో కలిసి పనిచేస్తూ, పనినేర్చుకోనే సాంప్రదాయక సమాజాన్ని పునరుద్ధరించాలని మనం కోరుకోవటం లేదు'' అని ఒక అధికారి చెప్పినట్లుగా ఉదహరించారు. మరో అధికారిని నేను కలిసి మాట్లాడిన సందర్భంలో ఈ దిగువ విధంగా వాదించాడు. " దీనిలో తప్పేముంది? కమ్మరి పనిచేసే, కమ్మరి వృత్తిదారుని కొడుకు ఆ పని నేర్చుకుంటే తప్పేముంది, ఒక చేనేత కార్మికుని కుమారుడు నేతపని నేర్చుకొంటే తప్పేముందని'' వాదించాడు. వడ్రంగం పనిచేసేవాని కొడుకు వడ్రంగిగానే ఎందుకుండాలి, పాతబట్టలు అమ్ముకొనేవాని కుమారుడు పాతబట్టలు అమ్ముకొనేవాడుగానే

ఎందుకుండాలి? వారు సాహిత్యవేత్తల్లో, అణు శాస్త్రజ్ఞుల్లో ఎందుకు కాకూడదు అనేదే దీనికి సమాధానం. ధనికులు, మధ్యతరగతి వారి పిల్లలు స్కూలు నుండి వచ్చిన తర్వాత ఆడుకోవటం, విశ్రాంతి తీసుకోవటం చేస్తారు. వారు స్కూలు నుండి వచ్చిన తర్వాత పొలాల్లో పని చేస్తూనో, వ్యర్థాలను తొలగిస్తూనో, బట్టలు నేస్తూనో, వీధులను ఊడుస్తూనో కాలం గడపరు. పేదల పిల్లలు శ్రమ చేస్తూ వారి బాల్యాన్ని ఎందుకు నాశనం చేసుకోవాలి, ధనికులు, మధ్య తరగతుల వారి పిల్లలు అలా ఎందుకు చేయరు? ఈ విధమైన చట్టాలను చేయటం ద్వారా మనం కులతత్వాన్ని ప్రోత్సహించటం లేదా? ఇది పైకులాలలోని మధ్య తరగతి వారి యొక్క ప్రాపంచిక దృక్పథంలో బలంగా నాటుకొని ఉన్న కులతత్వం మినహా వేరుకాదు. దిగువ కులాల వారి పిల్లలకు మేధస్సుతో చేసే పనులు కాకుండా చేతులతో చేసే పనులలో శిక్షణ ఇవ్వాలని, పైకులాలు, వర్గాల వారి పిల్లలు మేధోపరమైన పనులు చేయాలనేది వీరి సామాజిక భావజాలంలో పాతుకుపోయి ఉంది. మేధోపరమైన పనులు చేసే అవకాశాలను అన్ని సామాజిక, ఆర్థిక, మతపరమైన గ్రూపుల మధ్య సమానంగా పంపకం చేయాలనే ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక భావజాలం ఇంకా విస్తృతంగా వ్యాపించలేదు.

> **"1947-2000 సంవత్సరాల మధ్య ప్రాజెక్టుల వలన ఆరు కోట్లమంది నిర్వాసితులు కావటమో లేక ప్రభావితం కావటమో జరిగిందని చెప్పింది. నిర్వాసితులైన వారిలో 47 శాతం మంది గిరిజనులేనని, గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించటం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల గ్రూపు చెప్పింది."**

గత యుపిఎ ప్రభుత్వం తనను అనుసరించే విస్తృత ప్రజానీకాన్ని సంతృప్తి పర్చటానికి, వామపక్షాల మద్దత్తు వలన కొన్ని ప్రజానుకూల చట్టాలను చేసింది. సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఆహారభద్రతా చట్టం, భూసేకరణ చట్టం తదితర చట్టాలు చేసింది. గిరిజనుల భూములకు రక్షణ కల్పిస్తున్న చట్టాలను నీరుగార్చి, ఆ భూములను శతాబ్దాలుగా రక్షిస్తున్న గిరిజనులతో సంప్రదించకుండా, వారి అంగీకారం లేకుండా ప్రజాస్వామ్య వ్యతిరేకంగా భూములను కాజేయటం కోసం ప్రయత్నం చేస్తున్న ప్రధానమంత్రి కార్యాలయం, పర్యావరణ మంత్రిత్వ శాఖలతో ఈ రోజు ఈ ప్రభుత్వం యొక్క గిరిజన మంత్రిత్వ శాఖ వివాద పడుతున్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ తొమ్మిదిలో ఆదివాసులకు కల్పించిన ప్రాథమిక హక్కులను గౌరవిస్తున్న ఈ చట్టం అటవీ భూముల విషయంలో ఆదివాసులకు నిజమైన ప్రజాస్వామిక భాగస్వామ్యం ఉన్న గ్రామసభకు, స్థానిక స్వపరిపాలనా సంస్థల అభిప్రాయాలకు విలువనిచ్చింది. కాని ఈ రోజు జరుగుతున్నదేమిటి? అటవీ ప్రాంతంగా ప్రకటించిన ప్రాంతంలో కూడా గిరిజనులు లేరనే పేరుతో అటవీ భూములను ఇష్టం వచ్చినట్లుగా కేటాయించటానికి పర్యావరణ మంత్రిత్వ శాఖ జిల్లా కలెక్టర్లకు అధికారం ఇచ్చింది. దీనికి గిరిజన మంత్రిత్వ శాఖ అభ్యంతరం చెబుతున్నది. అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ భూములను ఇతర ప్రయోజనాలకు వినియోగించే విషయంలో ఆదివాసులకు, అడవులలో నివసిస్తున్నవారికి కొన్ని సాంప్రదాయకమైన హక్కులున్నాయి. ప్రధానమంత్రి కార్యాలయం నుండి వస్తున్న ప్రత్యక్ష ఆదేశాలతో పర్యావరణ మంత్రిత్వశాఖ భూములపై గిరిజనుల హక్కులను నీరుగార్చటంతో పాటు, గ్రామసభల ద్వారా వారికి సంక్రమించిన ప్రజాస్వామిక హక్కులను కూడా కాలరాస్తున్నది.

మనకు అత్యంత విలువైన వారసత్వ సంపదగా వస్తున్న అడవులను సంరక్షిస్తున్న గిరిజనుల హక్కులను వారికి తిరిగి ఇవ్వటానికి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న చట్టం ఇపుడు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? 1927లో వలస పాలకులు చేసిన చట్టం బ్రిటీషు వారి ప్రయోజనాలు, ఫారెస్టు అధికారుల సహకారంతో కలప మాఫియా ప్రయోజనాలు నెరవేర్చటానికి ఉపయోగపడింది. ఇటువంటి చట్టం స్థానంలో 2006 వరకు కొత్త చట్టాన్ని తీసుకురాలేదు. 2006లో చేసిన చట్టానికి 2009లో రూల్స్‌ను రూపొందించిన తర్వాత మాత్రమే అమలు సాధ్యమైంది. 2006 వరకు అత్యంత విలువైన అటవీ సంపదను పరిరక్షిస్తున్న గిరిజనుల హక్కులను కాలరాస్తూ వ్యవహరించారు.

గతంలో నియమించిన ఉన్నతస్థాయి కమిటి యన్‌డిఎ ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. 1947-2000 సంవత్సరాల మధ్య ప్రాజెక్టుల వలన ఆరు కోట్లమంది నిర్వాసితులు కావటమో లేక ప్రభావితం కావటమో జరిగిందని చెప్పింది. నిర్వాసితులైన వారిలో 47 శాతం మంది గిరిజనులేనని, గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించటం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల గ్రూపు చెప్పింది. గిరిజనుల నివాస ప్రాంతాలు సహజ వనరులతో సమృద్ధిగా ఉండటంతో ప్రాజెక్టుల వలన ప్రతి నలుగురు గిరిజనుల్లో ఒకరు నిర్వాసితులు కావటమో, లేక ఇబ్బందుల నెదుర్కోవటమో జరిగిందని వారి అధ్యయనంలో స్పష్టమైంది. 2009లో రూల్సు రూపొందించిన తర్వాత మాత్రమే 2006లో తీసుకొచ్చిన చట్టం గిరిజనులకు కొంతమేరకు ఊరట నిచ్చింది. సమాచారహక్కు చట్టం ప్రకారం గిరిజన మంత్రిత్వశాఖకు పెట్టుకున్న దరఖాస్తులకు ఆ మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాచారాన్ననుసరించి, ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత కూడా 82 శాతం గిరిజనుల హక్కుల కేసులు కొట్టివేయబడ్డాయని స్పష్టమౌతున్నది.

ప్రస్తుత యన్‌డిఎ-2 ప్రభుత్వం గతంలో యన్‌డిఎ-1 ప్రభుత్వ హయాంలో గిరిజనుల హక్కుల పేరుతో ప్రమాణం చేయటమే కాకుండా, రెండు గిరిజన రాష్ట్రాలను, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లను ఏర్పాటు చేయటానికి దారితీసిన ఉద్యమంలోనూ భాగస్వామి అయింది. ఇప్పుడు గిరిజనుల భూమి హక్కులు, వారి ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించటం లేదు. వారిని భూముల నుండి తొలగించటం తీవ్రం కావటం, వారి హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరించటం చేస్తున్నారు. జార్ఖండ్‌లో 85 కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు 2000ల మంది కార్యకర్తలను జైలులో పెట్టారు. గ్రామసభల అధికారాలను రద్దుచేయరాదని కోరుతూ గిరిజన వ్యవహారాల మంత్రి జువాన్ ఓరమ్ తన స్వంత మంత్రివర్గానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాడు. ఈ ప్రభుత్వం ఓరమ్‌ను కేవలం గిరిజనులకు చిహ్నంగా మాత్రమే చూపేస్థాయికి దిగజార్చింది.

31 శాతం ఓట్లతో ఎన్నికైన ఈ ప్రభుత్వం

**"ఈ రోజు మన పార్లమెంటు కోటీశ్వరుల చేతుల్లో ఉంది. 2009లో 543 మంది పార్లమెంటు సభ్యుల్లో కోటి రూపాయలకు మించిన ఆస్థులు కలవారు 145 మంది ఉండగా, 2014 పార్లమెంటులో 353 మంది ఉన్నారు. మీడియాను తమ షేర్ల ద్వారా అదుపు చేస్తూ, తమ కార్పొరేట్ వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు."**

శాంతియుతంగా సమావేశం కావటం, సంఘటితం కావటంపై దాడి చేస్తున్నది. కార్మిక చట్టాలకు తెస్తున్న సవరణలు సమావేశమయ్యే హక్కును, సంఘటితమయ్యే హక్కును, యూనియన్లు ఏర్పాటు చేసుకొనే హక్కులపై ఆంక్షలు పెడుతూ, కార్మికోద్యమం గత 150 సంవత్సరాల నుండి సాధించుకున్న హక్కులను దారుణంగా కుదించటానికి ప్రయత్నం చేస్తున్నది. రైతుల, వాస్తవ భూయజమానుల, భూవినియోగదారుల హక్కులను కుదించే విధంగా భూసేకరణ చట్టానికి సవరణలు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నది. స్థానిక ప్రజల హక్కులను కుదించే విధంగా అటవీ హక్కుల చట్టానికి కూడా ఇదే విధమైన సవరణలు తీసుకురావటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పర్యావరణ పరిమితులను పక్కన పెట్టి, మొదటి నాలుగు నెలల పాలనలో కార్పొరేట్ సంస్థలకు 240 ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను మంజూరు చేయటం ఈ ప్రభుత్వం యొక్క వ్యవహారసరళిని తెలుపుతున్నది.

**కార్పొరేట్ పెట్టుబడి సేవలో మీడియా**

పరిపాలనను ప్రజాతంత్రీకరించటానికి దోహదం చేసిన, 2005లో తీసుకువచ్చిన సమాచారహక్కు చట్టాన్ని నిరుపయోగం చేయటానికి ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. గత ప్రభుత్వం చేసిన కుంభకోణాల్ని బట్టబయలు చేయటం ద్వారా, ఈ ప్రభుత్వం పశుబలంతో అధికారంలోకి రావటానికి ఆ చట్టం దోహదం చేసింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకొనే ఈ దేశంలో గత చట్టాల ద్వారా సంక్రమించిన న్యాయబద్ధమైన, ప్రాథమిక హక్కులను నీరుగార్చటానికి ప్రయత్నం చేస్తుంటే మీడియా, ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ మీడియా నిర్వహిస్తున్న పాత్ర ఏమిటి? హానికరమైన ఈ మార్పులను గురించి చర్చ చేస్తున్నదా? ప్రధానమంత్రి కార్యాలయం నుండి కార్యనిర్వాహక అధికారాలను అమలు చేస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాన్ని విమర్శిస్తున్నదా? ఆదివాసులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను లాగివేసు కోవటాన్ని ప్రశ్నిస్తున్నదా? బీడుభూములలో పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి అవకాశం ఉన్నపుడు పంటభూముల్ని బలవంతంగా లాక్కోవలసిన అవసరం ఏమొచ్చింది? భారీ ప్రాజెక్టుల ద్వారా ప్రజలను పెద్దసంఖ్యలో నిర్వాసితులను చేయటం వలన జరిగిన నష్టాలు మన ముందుండగా, వాటినే ఎందుకు కొనసాగిస్తున్నారు?

గత తొమ్మిది మాసాలుగా నాపైనా, నేను నిర్వహిస్తున్న సంస్థపైనా తీవ్రమైన దాడులు చేస్తున్నప్పటికీ కమ్యూనలిజం కంబాట్ పత్రికను, సబ్‌రంగ్ వెబ్‌సైట్ నిర్వహణను కొనసాగిస్తూనే ఉన్నాం. ఇటువంటి అంశాలన్నింటినీ ప్రచారం చేయటం కోసం నిరంతరం వీడియో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాను. ప్రముఖ విలేకరి పి. సాయినాథ్‌తో అటువంటి ఇంటర్వ్యూ ఒకటి నిర్వహించాను. వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతూ, ఎన్నికల రాజకీయాలను ప్రభావితం చేయగల వారి ప్రతినిధిగా మీడియా వ్యవహరిస్తూ, వ్యతిరేకాభిప్రాయాలున్నవారికి, ప్రత్యామ్నాయ విధానాలు కోరుతున్న వారికి కేటాయిస్తున్న స్థలాన్ని తగ్గిస్తున్నదనే అంశాన్ని ఈ ఇంటర్వ్యూలో బట్టబయలు చేశాను. ఈ రోజు మన పార్లమెంటు కోటీశ్వరుల చేతుల్లో ఉంది. 543 మంది పార్లమెంటు సభ్యుల్లో కోటి రూపాయలకు మించిన ఆస్థులు కలవారు 2009లో 145 మంది ఉండగా, 2014 పార్లమెంటులో 353 మంది ఉన్నారు. మీడియాను తమ షేర్ల ద్వారా అదుపు చేస్తూ, తమ కార్పొరేట్ వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. ఈ విధమైన కలయికను ఇప్పటివరకు మనం చూడలేదు. దీని ఫలితంగానే 2014 ఎన్నికలలో మోడీని అధికారంలోకి తీసుకురావాలనే ప్రచారానికి కార్పొరేట్ రంగం నాయకత్వం వహించింది.

బడ్జెట్ కేటాయింపులు, గ్రామీణ ఆర్థిక రంగాన్ని పునరుజ్జీవింప చేయటానికి పనుల కోసం నిధుల కేటాయింపులపై చర్చలు జరుగుతున్నపుడు బడా వ్యాపారుల, ధనికుల ప్రభావంలో ఉన్న ఇదే మీడియా ధనికుల ప్రయోజనాలను ముందుకు తెస్తున్నది. ఆర్థికవ్యవస్థను జలగల్లా పీలుస్తున్న కార్పొరేట్ సంస్థలకు 2013-14 బడ్జెట్‌లో ఇచ్చిన 5,71,000 కోట్ల రూపాయల సబ్సిడీలను గురించి ప్రస్థావించదు. ఈ సబ్సిడీలను గురించి ప్రతి సంవత్సరం బడ్జెట్‌లోని అనుబంధంలో ప్రస్తావిస్తారు. ప్రభుత్వం ఇస్తున్న "అనవసర సబ్సిడీ"లను గురించి నిరంతరం రాసే మితవాద భావజాలంతో ఉన్న పత్రికా రచయితలు ఈ సబ్సిడీలను గురించి అరుదుగా మాత్రమే ప్రస్తావిస్తారు. ప్రత్యక్షంగా ఇచ్చే ఈ సబ్సిడీలలో కార్పొరేట్ ఆదాయపన్ను రాయితీ 71,000 కోట్ల రూపాయలుంది. ఈ మొత్తం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం చేస్తున్న సంవత్సర కేటాయింపుకన్నా రెట్టింపు ఉంది. బంగారం, వజ్రాలు దిగుమతి చేసుకొనేవారికి 46,000 కోట్ల రూపాయల కస్టమ్స్ సుంకాలను రద్దుచేశారు. 2005-06 నుండి ఇప్పటి వరకు కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు 36.5 లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చారు. పి. సాయినాథ్ విశ్లేషణ ప్రకారం ఈ 36.5 లక్షల కోట్ల రూపాయలతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకాన్ని 105 సంవత్సరాలు నడపవచ్చు. ప్రజాపంపిణీ వ్యవస్థకు ప్రస్తుతం సంవత్సరానికి కేటాయిస్తున్న 1,15,000 కోట్ల రూపాయల చొప్పున, 31 సంవత్సరాల పాటు కేటాయింపులు చేయవచ్చు.

భారత ప్రజానీకం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలను ప్రజాస్వామికంగా తెలియచేయలేకపోవటానికి, విలేకరులకు ఉద్యోగ భద్రత లేకపోవటాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని పరిశీలించాలి. వర్కింగ్ జర్నలిస్టులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాంట్రాక్టు విధానం హరించివేస్తున్నది. జర్నలిజానికి ఏమాత్రం మేలుచేయని, హానికరమైన పోటీలోకి విలేకరులు నెట్టబడ్డారు. పేరున్న కొద్దిమందికి పెద్దమొత్తాలు చెల్లిస్తు న్నారు. విస్తారంగా ఉన్న విలేకరులు యజమా నుల అనుగ్రహం కోసం ఎదురు చూడటం జర్నలిజం విలువలను దిగజార్చి, వాణిజ్యీకరణ కావటానికి దారితీసింది.

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి నిధుల కేటాయింపును తగ్గించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే, ఈ సంవత్సరం

సెప్టెంబరు నాటికి రాష్ట్రాలకు విడుదల చేసిన నిధులలో 45 శాతం కోతపెట్టారు. ఈ చట్టం అమలు ప్రారంభమైన తర్వాత అతి తీవ్రమైన కోతయిది. 2013–14 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు వరకు కేంద్రం రాష్ట్రాలకు 24,676 కోట్ల రూపాయలు విడుదల చేయగా, 2014–15 ఆర్థిక సంవత్సరంలో అదేకాలంలో 13,618 కోట్ల రూపాయలను మాత్రమే విడుదల చేశారు. ఈ చట్టం గ్రామీణ పేదలకు ముందుగా నిర్ణయించబడిన వేతనాలతో, 100 రోజుల పనిని గ్యారంటి చేసింది. 2012 ఏప్రిల్‌లో ఈ చట్టం ద్వారా చేస్తున్న పనులకు 122 నుండి 189 రూపాయల వరకు రోజుకూలిగా చెల్లించారు. గౌరవనీయమైన స్థాయిలో గ్రామీణ పేదలకు మౌలిక వేతనాలు లభించేలా చేయటం ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలలో లేదు. ఉపాధి హామి పనుల్లో అధిక వేతనాలు చెల్లించటం వ్యవసాయం, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలలో వేతనాలను ప్రభావితం చేసింది. ప్రస్తుతం పశ్చిమబెంగాల్లో ఉపాధి హామీ చట్టం ప్రభావం వలన రియల్ ఎస్టేట్ రంగంలో నైపుణ్యం లేని కార్మికుడు రోజుకు 200 రూపాయల వేతనాన్ని పొందుతుండగా, నిపుణులైనవారు 500 నుండి 600 రూపాయల వరకు వేతనం పొందుతున్నారు. నిధుల కేటాయింపును తగ్గించటం ద్వారా ఈ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి ప్రయత్నించటంతో పాటు, దీని అమలును 200ల జిల్లాలకే పరిమితం చేసింది.

**❝ 2005-06 నుండి ఇప్పటి వరకు కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు 36.5 లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చారు. పి. సాయినాథ్ విశ్లేషణ ప్రకారం ఈ 36.5 లక్షల కోట్ల రూపాయలతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకాన్ని 105 సంవత్సరాలు నడపవచ్చు.❞**



ఇటుక బట్టీలలో కరిగిపోతున్న బాల్యం

### సమాచారహక్కు చట్టం 2005

సమాచారహక్కు చట్టం అమలుపై తీవ్రమైన పరిమితులను విధించటానికి ఈ ప్రభుత్వం పూనుకున్నది. ప్రభుత్వాన్ని పరిధుల్లో ఉంచటానికి ఉపయోగపడే ఈ చట్టాన్ని మోడి ఆధ్వర్యంలో పనికిరాకుండా చేశారని, ప్రభుత్వం నుండి సమాచారాన్ని పొందటం అతికష్టంగా మారిందని దేశవ్యాపితంగా సమాచారహక్కుల కోసం పనిచేసే కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2014 ఆగస్టు నుండి కేంద్ర సమాచార కమీషన్ చీఫ్ కమీషనర్ లేకుండానే పని చేస్తున్నది. 10 మంది కమీషనర్లు ఉండాల్సి ఉండగా, ఏడుగురు మాత్రమే ఉన్నారు. తన పనికి సంబంధించి కోరిన సమాచారాన్ని ఇవ్వటానికి ప్రధాని కార్యాలయం తిరస్కరించటంతో పాటు, హక్కుల కోసం పోరాటాల్లో ముందుండే కార్యకర్తలను బెదిరించి, లొంగదీసుకోవటానికి చట్టానికి సవరణలు చేయాలని ఫాసిజానికి నమూనాగా ఉన్న ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఈ చట్టానికి సవరణలు చేయటం ద్వారా, అధికార రహస్యాల పరిరక్షణ చట్టం 1923 ప్రకారం సమాచారహక్కుల కోసం కృషి చేస్తున్న కార్యకర్తలను శిక్షించటానికి ప్రయత్నిస్తున్నది. ఈ సవరణ జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు భయపడి, ప్రభుత్వ అక్రమాలను బయటపెట్టటానికి (గుజరాత్ డిజిపి, ఐజి లాంటివారు మినహా)ఏ అధికారీ ముందుకురాడు.

సమాచార హక్కు చట్టానికి సవరణలు తీసుకొస్తున్న తరహాలోనే భూసేకరణ చట్టం 2013కు కూడా సవరణలు తీసుకురావటానికి చేస్తున్న ప్రయత్నాలు, వాస్తవాలను వెల్లడించటానికి ఈ ప్రభుత్వం ఎంత వ్యతిరేకంగా ఉందో తేటతెల్లం చేస్తున్నాయి. సమాచార హక్కుల కోసం పనిచేస్తున్న కార్యకర్త నాయక్ భూసేకరణ చట్టం వలన ఎన్ని ప్రాజెక్టులు ఆగిపోయాయో తెలుసుకోవటానికి సమాచారాన్ని సేకరించి, అనేక వాస్తవాలను వెల్లడించాడు. 24రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2015 ఫిబ్రవరి నాటికి 804 ప్రాజెక్టులు వివిధ కారణాల వలన ఆగిపోయివున్నాయి. ఆగిపోయిన ప్రాజెక్టులలో 78 శాతం ప్రైవేటు ప్రాజెక్టులు కాగా, 22 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలకు చెందినవి ఉన్నాయి. ఈ అంశాలను ఎకనామిక్స్ టైమ్స్ మినహా ఏ ఒక్క పత్రికా పట్టించుకోలేదు. ఎకనామిక్స్ టైమ్స్ వివిధ రాష్ట్రాలలో భూసేకరణ వలన కలుగుతున్న ఫలితాలను వివరిస్తూ, చర్చకు దోహదం చేసే విధంగా అనేక వ్యాసాలను ప్రచురించింది. నిలిచిపోయిన 804 ప్రాజెక్టుల లో 8 శాతం –66–మాత్రమే భూసేకరణకు సంబంధించిన సమస్యల వలన నిలిచిపోయాయని ఈ అధ్యయనంలో వెల్లడయింది. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే భూసేకరణలో ఎదురౌతున్న సమస్యల వలన ఆర్థికాభివృద్ధి మందగిస్తుందన్న ప్రచారం అవాస్తవమని స్పష్టమౌతున్నది.

### పేదలను భ్రమల్లో ముంచేందుకు వివిధ పథకాల ప్రచారం

పేదలందరికీ సామాజిక భద్రతా పథకాలు అమలు చేస్తామని, పెన్షన్లిస్తామని, బ్యాంకు ఎకౌంట్లను ప్రారంభించటం ద్వారా భద్రత కల్పిస్తున్నామని ప్రచారం చేస్తూ, ప్రజల్ని నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువమంది

**❝ నిలిచిపోయిన 804 ప్రాజెక్టులలో 8 శాతం -66 ప్రాజెక్టులు మాత్రమే భూసేకరణకు సంబంధించిన సమస్యల వలన నిలిచిపోయాయని ఈ అధ్యయనంలో వెల్లడయింది. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే భూసేకరణ లో ఎదురౌతున్న సమస్యల వలన ఆర్థికాభివృద్ధి మందగిస్తుం దన్న ప్రచారం అవాస్తవమని స్పష్టమౌతున్నది. ❞**

ప్రజల చేత బ్యాంకు ఎకౌంట్లను ప్రారంభింపజేయటం లక్ష్యంగా ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనను ప్రకటించి, 12.5 కోట్ల మందిచేత బ్యాంకు ఎకౌంట్లను ప్రారంభింప జేశారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ఈ మూడు పథకాలను అసంఘటితరంగ కార్మికులకు ఇప్పటికే అమలు జరుపుతున్నారు. వీటిని మరింతమందికి అందే విధంగా విస్తరిస్తున్నారు. 2015, ఫిబ్రవరి 28న బడ్జెట్‌లో మొదటిసారిగా ఈ పథకాలను ప్రకటించిన అరుణ్‌జైట్లీ, వీటి అమలుకు కావలసిన ఆర్థిక కేటాయింపులను గురించి మాట్లాడలేదు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ప్రచారం చేసినంతగా విజయం సాధించలేదు. ఈ పథకం ద్వారా ప్రారంభించిన ఎకౌంట్లలో 70 శాతం వినియోగించకుండా వదిలివేయ బడ్డాయని జన్‌ధన్ యోజన వెబ్‌సైట్‌లోని సమాచారం స్పష్టం చేస్తున్నది.

ఇతర పెన్షన్ పథకాల ద్వారా లబ్ధిపొందని అసంఘటితరంగ కార్మికులకు పెన్షన్లు అందజేయటానికి అటల్ పెన్షన్ యోజన ఉద్దేశించబడింది. ఈ పథకానికి 20 సంవత్సరాలలో చెల్లించే మొత్తంపై ఆధారపడి, 60 సంవత్సరాల వయసు పూర్తయేనాటికి కార్మికులు నెలకు 1000 రూపాయల నుండి 5000 రూపాయల వరకు పెన్షన్ పొందుతారు. నెలకు 1000 రూపాయల పెన్షన్ పొందటానికి 18 సంవత్సరాల వయసున్న కార్మికుడు 42 సంవత్సరాల పాటు నెలకు 42 రూపాయల చొప్పున చెల్లించాలి. 42 సంవత్సరాల వయసులో చేరినవారు నెలకు 1000 రూపాయల పెన్షన్ పొందటానికి 18 సంవత్సరాల పాటు నెలకు 291 రూపాయల చొప్పున చెల్లించాలి. ఈ పథకం 2010లో ప్రారంభించిన, భవిష్యత్ కోసం కార్మికులను కూడబెట్టమని ప్రోత్సహించిన స్వావలంబన పథకాన్ని ప్రతిబింబిస్తున్నది. ఇప్పటి వరకు స్వావలంబన పథకం శక్తివంతంగా పని చేయలేదని స్పష్టమౌతున్నది. 2014 వరకు దేశంలో ఉన్న 43.7 కోట్లమంది అసంఘటిత రంగ కార్మికుల్లో ఒక చిన్నభాగం, 30 లక్షల మంది మాత్రమే ఈ పథకంలో భాగస్వాములయారు.

ప్రభుత్వం రెండు బీమా పథకాలు ప్రకటించింది. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకంలో సంవత్సరానికి 12 రూపాయల ప్రీమియం చెల్లిస్తే, రెండు లక్షల రూపాయల ప్రమాదబీమా ప్రయోజనం పొందుతారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనలో 50 సంవత్సరాలకు లోపు వయసు వారు సంవత్సరానికి 330 రూపాయలు చెల్లిస్తే, రెండు లక్షల రూపాయల బీమా ప్రయోజనం పొందుతారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు, అసంఘటితరంగంలోని 46 వృత్తుల వారికి బీమా ప్రయోజనం కలిగించటం కోసం 2007వ సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఆమ్‌ఆద్మీ బీమా యోజన ఆధారంగా ఈ పథకాలను రూపొందించారు. లబ్ధిదారులకు ఆ పథకం ద్వారా చెల్లించే మొత్తం కన్నా, ఈ పథకాల ద్వారా చెల్లించే బీమా మొత్తాన్ని పెంచారు.

ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల పరిరక్షణ కోసం దూకుడుగా ముందుకు పోతున్న పరిస్థితుల్లో, ప్రతిపక్షాలు, వారు పనిచేస్తున్న ప్రజాసంఘాలు, ముఖ్యంగా వామపక్షాల నాయకత్వంలోని సంఘాలు పేదలకు ప్రయోజనం కలిగించే ప్రభుత్వ పథకాలన్నింటిపైనా బహిరంగ విచారణ(సోషల్ ఆడిట్) నిర్వహించటం ద్వారా వాస్తవాలను దృఢంగా, సృజనాత్మకంగా ప్రజల ముందుకు తీసుకురావాలి. క్షేత్రస్థాయిలో ప్రజల జీవితాలను పరిశీలించటం ద్వారా, జీవిత వాస్తవాలను అధ్యయనం చెయ్యటం ద్వారా ఈ ప్రభుత్వ విధానాలకు ప్రతిఘటనను నిర్మించాలి.

**ప్రజలకు, యస్‌సి, యస్‌టి, మైనారిటీలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు**

ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రణాళికా సంఘాన్ని రద్దుచేయటం, దాని స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేయటం, నిధులు అవసరమైన తరగతులకు కేటాయింపుల్లో కోత పెట్టటానికి దారితీస్తుంది. గత ప్రభుత్వం యొక్క లౌకిక అర్హతల గురించి మనం ఎంతైనా చర్చించవచ్చు. కాని సచార్ కమిటి నివేదిక ననుసరించి భారతదేశంలోని అతి పెద్ద మైనారిటీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచటానికి ప్రధానమంత్రి ప్రకటించిన 21 అంశాల కార్యక్రమంలో అనేక తరగతుల వారికి ప్రత్యేక మెరిట్ స్కాలర్ షిప్పులను ఇవ్వటం, భాగస్వాములను చేయటం ద్వారా వారిని కలుపుకెళ్ళటానికి ప్రయత్నం చేశారు. తన స్వంత పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు సాటి భారతీయుల పట్ల విషం చిమ్ముతూ, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రమాదకరమైన ప్రసంగాలు చేస్తుంటే, వారి పట్ల దయతో కూడిన మౌనం వహిస్తున్న ప్రధానిని ఈ రోజు మనం చూస్తున్నాం. ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా పెట్టుకొని కుటుంబ నియంత్రణను అమలు జరపాలని సాక్షి మహరాజ్, కేంద్ర కేబినెట్ మంత్రి నిరంజన్ జ్యోతి రాజ్యాంగ వ్యతిరేకమైన వ్యాఖ్యలు చేస్తుంటే అధికార పక్షానికి నాయకత్వం వహిస్తున్న, ప్రభుత్వాన్ని సమిష్టిగా నడపాల్సిన వ్యక్తి మౌనంగా ఉంటున్నాడు. తనమౌనం ద్వారా ఆయన వారికి మద్దత్తిస్తున్నాడని మనం భావించవచ్చా?

యస్‌సి, యస్‌టి స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌కు 2014-15బడ్జెట్‌లో వరుసగా 43,208 కోట్లు, 26,715 కోట్లు కేటాయించగా 2015-16 బడ్జెట్లో 30,851 కోట్లు, 19,980 కోట్లకు కేటాయింపులను తగ్గించారు. జనాభా శాతానికనుగుణంగా కేటాయింపులు చేయాలని అధికారికంగా అంగీకరించిన దాని కన్నా ఇది చాలా తక్కువ. యస్‌సి, యస్‌టి ఉప ప్రణాళిక మార్గదర్శకాల ననుసరించి, యస్‌సిల జనాభా 16.6 శాతానికి అనుగుణంగా 77,236 కోట్ల రూపాయలు, యస్‌టిల జనాభా 8.6 శాతానికి అనుగుణంగా 40,014 కోట్ల రూపాయలు ఉప ప్రణాళికలకు కేటాయించాలి. 2014-15 సంవత్సరానికి పునర్వ్యవస్థీకరించిన బడ్జెట్లో ముస్లింలకు చేసిన కేటాయింపులలో 569 కోట్ల రూపాయలు కోతపెట్టారు. ఇది యమ్‌యస్‌డిపి, స్కాలర్ షిప్పుల కార్యక్రమాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 2015-16 బడ్జెట్ అంచనాలలో 3,738 కోట్ల రూపాయలు

కేటాయించారు. 2014–15 సంవత్సరానికి కేటాయింపు 3,734 కోట్ల రూపాయలు కాగా, పునర్వ్యవస్థీకరించిన అంచనాల ప్రకారం 3,165 కోట్ల రూపాయలుగా ఉంది.

పనితీరులో లోపాలున్నప్పటికీ, సమ్మిశ్రిత అభివృద్ధి కోసం ప్రజాస్వామ్యయుతంగా కేటాయింపులు చేస్తున్న ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారు. దళితులు, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలనే భావన అభివృద్ధి అవుతుండటం ఇందుకు ప్రధాన కారణాలలో ఒకటిగా ఉంది.

**సంస్కృతి, విద్యారంగాలలోకి చొరబాటు**

ఈ ప్రభుత్వానికి వెనుక నుండి మద్దత్తునిస్తున్న, ఫాసిస్టు భావజాలంతో ఉన్న ఆర్‌యస్ యస్, దాని అనుబంధ సంస్థలు శాంతిభద్రతల యంత్రాంగంలోకి చొరబడటంతో పాటు, చరిత్రను వక్రీకరించటానికి, బ్రాహ్మణవాద సంస్కృతిని, సంస్కృతాన్ని, ఉన్నత కులాలను అగ్రస్థానంలో ఉంచేలా సామాజిక శాస్త్రాలను బోధించాలనే తమ భావాలను ముందుకు తెస్తున్నారు. చరిత్రను పక్కనపెట్టి, రామాయణ, మహాభారతాలను చరిత్రగా ప్రచారం చేయాలనిచెప్పే వ్యక్తిని ఐసిహెచ్‌ఆర్ డైరెక్టర్‌గా నియమించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రొమిల్లా థాపర్, సతీష చంద్ర, ఇర్ఫాన్ హబీబ్, ముజఫర్ ఆలం లాంటి చరిత్రకారులున్న ఐసిహెచ్‌ఆర్ కౌన్సిల్‌ను రద్దు చేశారు. ఇండియన్ హిస్టారికల్ రివ్యూ ప్రధాన సంపాదకుడు సవ్యసాచి భట్టాచార్య రాజీనామా చేయగానే ఐసిహెచ్‌ఆర్ ఛైర్మన్ ఆ పత్రిక సలహా మండలిని రద్దు చేశాడు. ఐఐటి లాంటి స్వతంత్ర సంస్థల గొంతునొక్కటానికి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రయత్నం చేస్తున్నది. హర్యానా, రాజస్థాన్‌లలోని పాఠశాలల్లో గీతను బోధిస్తున్నారు. మధ్యప్రదేశ్ పాఠశాలల్లో సూర్య నమస్కారాలను తప్పనిసరి చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే గత చరిత్రను వక్రీకరిస్తూ దీనానాథ్ బాత్రా రాసిన పుస్తకాలను గుజరాత్ పాఠశాలల్లోని 4,00,000ల మంది విద్యార్థులు అదనపు సబ్జెక్టుగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఈ పుస్తకాలలో మన గత చరిత్ర గురించి, ఎంపిక చేయబడిన అంశాలను పాక్షిక దృక్పథంతో వివరిస్తారు. ఈ పుస్తకాలలో నిర్ధారణ కానటువంటి అంశాలను వాస్తవాలుగా చెబుతూ, పైకులాల ఆధిపత్యాన్ని బలపరచేలా, ప్రపంచంలో మనమే గొప్పవారమనే తప్పుడు భావాల్ని విద్యార్థులలో పాదుకొల్పేలా గత చరిత్రను గురించి బోధిస్తారు. పురాణాలను చరిత్రగా, చరిత్రనే పురాణాలుగా కలగాపులగం చేస్తున్నారు. ఈ ప్రభుత్వానికి

"ఈ ప్రభుత్వానికి వెనుక నుండి మద్దత్తునిస్తున్న, ఫాసిస్టు భావజాలంతో ఉన్న ఆర్‌యస్ యస్, దాని అనుబంధ సంస్థలు శాంతిభద్రతల యంత్రాంగంలోకి చొరబడటంతో పాటు, చరిత్రను వక్రీకరించటానికి, బ్రాహ్మణవాద సంస్కృతిని, సంస్కృతాన్ని, ఉన్నత కులాలను అగ్రస్థానంలో ఉంచేలా సామాజిక శాస్త్రాలను బోధించాలనే తమ భావాలను ముందుకు తెస్తున్నారు."

నాయకత్వం వహిస్తున్న వ్యక్తి చారిత్రక వాస్తవాలను ఏమాత్రం పట్టించుకోకుండా నలందకు బదులుగా తక్షశిలను ఉదహరించాడు. దేశంలో పురాతన కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ ఉందని, అందుకు సాక్ష్యం వినాయకుడని ప్రచారం చేస్తున్నాడు.

జాతీయోద్యమ విలువలకు కట్టుబడి, రాజ్యాంగం ఉపోద్ఘాతంలో పేర్కొన్న మౌలిక సూత్రాలకు అనుగుణంగా భారతీయులుగా మనం ఈపరిస్థితిని ఎదుర్కోవటానికి ఐక్యంగా కదిలి, సమైక్య ప్రతిఘటనను నిర్మించగలమా అనేదే అసలు సమస్య. ప్రజాస్వామిక సంస్థలుగా ఉన్న పార్లమెంటు, న్యాయవ్యవస్థ ఈ దాడిని ఎదుర్కోగలవా? ప్రతి సందర్భాన్ని ఉపయోగించు కొని, ఎటువంటి చర్చ లేకుండానే ఈ సంస్థలను బలహీనపరచటానికి ప్రయత్నిస్తున్నారు.

రాజ్యాంగబద్ధ సంస్థలలో మాజీ సైనిక, ఇంటలిజెన్స్ అధికారులను నియమించే తప్పుడు సాంప్రదాయాన్ని గత ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం "లవ్ జిహాద్," "ఇస్లాం నుండి ప్రమాదం," "తీస్తా బేగం," అంటూ ప్రచారం చేస్తున్న, ఫాసిజానికి నమూనాగా ఉన్న ఆర్‌యస్‌యస్ వారిని ఆ స్థానాలలో నియమిస్తున్నారు. ఇందుకు తగినంత వ్యతిరేకత కూడా వ్యక్తం కావటం లేదు.

ఈ ప్రభుత్వ కార్యకలాపాలను విశ్లేషించే సందర్భంలో విమర్శనారహితంగా, ఉన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా మీడియా వ్యవహరిస్తున్నది. నేపాల్‌లో జరిగిన భూకంపాన్ని గురించి తెలియజేసే సందర్భంలో కూడా మీడియా, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా ప్రజలకు జరిగిన నష్టాలను, వాస్తవాలను తెలియజేయటం కన్నా, ఖాట్మండులోని " ధర్దారా మీనార్" " సింగ్ దర్బార్" "స్వయంభూ" తదితర హిందూ, బౌద్ధ నిర్మాణాలకు జరిగిన నష్టాలను వెల్లడి చేయటంపైనే కేంద్రీకరించారు. అంతర్జాతీయ, విదేశీ సహాయాన్ని గురించి అతి తక్కువ మాత్రమే తెలిపారు.

అధికారం ఫలితంగా తలకెక్కిన ఉన్మాదం, మెజారిటీయిజంపై ఆధారపడిన, ప్రతీకారం తీర్చుకోవాలనే ధోరణి ఈ ప్రభుత్వంలోనూ, నాయకునిలోనూ ఉన్నాయి. 2014 జులైలో నేపాల్ పర్యటనకు వెళ్ళినపుడు ఖాట్మండులోని పశుపతినాథ్ దేవాలయంలో అభిషేకం చేయించాడు. కాశీలోని శివవిశ్వనాథ్ దేవాలయంలో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశాడు. ఇవి హిందూ పరిపాలకుడు వ్యవహరించే తీరు మినహా ప్రజాస్వామిక, లౌకిక భారత ప్రభుత్వ నాయకుడు చేయవలసినవి కావు. విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, మెజారిటి మతభావాలను తీవ్రం చేయటం ఈ ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

1992–93 నుండి కమ్యూనలిజం కంబాట్ ద్వారా స్కూళ్ళలోని పాఠ్యాంశాలలో లౌకిక, ప్రజాస్వామిక విలువలను పెంచటానికి, రాజ్యాంగ విలువలను కాపాడటానికి, 2002 గుజరాత్ మారణకాండ బాధితులను ఓదార్చటానికి, వారికి న్యాయం చేయటానికి చేస్తున్న కృషి ఫలితంగా మేము ప్రత్యేకంగా ఇబ్బందులనెదుర్కొన్నాం. మమ్మల్ని ఆర్థికంగా బలహీనపరచటానికి, ప్రజలలో మాపట్ల వ్యతిరేకతను పెంచటానికి, మాపని ముందుకు సాగకుండా చేయటానికి అన్ని విధాలైన ప్రయత్నాలు చేస్తున్నారు. మాయా కొద్నాని, భజరంగీ, వ్యవసాయ కార్మిక ముస్లీం మైనారిటీలపై దాడులు చేసిన సర్దార్‌పురా, ఓధ్ ప్రాంతంలోని శక్తివంతులైన పటేల్‌ల లాంటి 120 మంది మా కృషి ద్వారా జీవితకాల జైలు శిక్షలు అనుభవిస్తున్నారు.

ప్రజల కోసం అంకితమైన పోరాట యోధుడు, విప్లవకారుడు అనే పదానికి సరైన నిర్వచనం సుందరయ్య. అలాంటి వ్యక్తికి అంకితమైన, అరుదైన పరిశోధనా కేంద్రంగా ఉన్న సుందరయ్య విజ్ఞానకేంద్రానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**(అనువాదం : ఎ. కోటిరెడ్డి)**

మానవాళిని మారణహోమం నుండి కాపాడిన

# మహోన్నత యుద్ధ విజయాన్ని స్మరించుకుందాం

**జాన్ చెరియన్**



రచయిత ప్రముఖ పాత్రికేయులు

***నాజీ జర్మనీని ఓడించిన ప్రపంచ ప్రసిద్ధి పొందిన రెండవ ప్రపంచ యుద్ధపు 70వ వార్షికోత్సవాన్ని పశ్చిమ దేశాల నాయకులు బహిష్కరించారు. కాని అదే సందర్భంలో ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన సంక్షోభాలను ఎదుర్కోవటానికి మాస్కో తో కలిసి పని చేయటానికి మటుకు సన్నద్ధమౌతున్నారు.***

**2015** మే 9వ తేదీన ప్రపంచ నాయకులందరూ మాస్కో నగరానికి విచ్చేసి, నాజీ జర్మనీని ఓడించిన బ్రహ్మాండమైన దేశ భక్తియుతమైన యుద్ధాన్ని గుర్తు చేసుకోవడానికి 70వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. 70 సంవత్సరాల క్రితం ఇదే రోజున రష్యన్ సైనికులు బెర్లిన్‌లోని జర్మన్ పార్లమెంటు (రీచ్‌స్టాగ్) భవనంపై ఎర్రజెండా ఎగురవేశారు. సంయుక్త కూటమి దేశాలు రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ నాయకత్వంలోని అక్షరాజ్యాల కూటమిపై సాధించిన విజయంలో జోసఫ్ స్టాలిన్ నాయకత్వంలో రష్యా కీలకపాత్ర పోషించింది. ఈ యుద్ధంలో తమ భూభాగాన్ని రక్షించుకోవడానికి దాదాపు 2.7 కోట్ల మంది సోవియట్ యూనియన్ పౌరులు ప్రాణాలర్పించారు. మరణించిన వారిలో ఎక్కువ శాతం సాధారణ ప్రజలే ఉన్నారు. 20 లక్షల మంది సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు. చాలామంది చరిత్రకారులు గుర్తించిన అంశం ఏమిటంటే, జర్మన్‌ల సారథ్యంలో దాడులు జరిపిన జాత్యహంకార శక్తులను తిప్పికొట్టిన యుద్ధంలో సోవియట్ సైన్యం ప్రముఖ పాత్ర పోషించిందని, అదే యుద్ధంలో కీలక మలుపుగా నిలిచిందని తెలిపారు. స్టాలిన్ గ్రాడ్, లెనిన్ గ్రాడ్, మాస్కో మరియు కుర్స్కలలో జరిగిన పోరాటాలు చరిత్రని తిరగరాసిన మహోన్నత ఘటనలుగా నిలిచాయి. 1942–43లో స్టాలిన్ గ్రాడ్ పోరాటంలో ఎర్ర సైన్యం సాధించిన విజయం, మొత్తం యూరప్‌పై సాధించిన మౌలిక విజయంగా నిలిచింది.

కొద్దిమంది రష్యన్ శత్రువులు చరిత్రను తిరగరాసే ప్రయత్నాలు చేస్తున్నారనీ, అందులోనూ ఫాసిస్టు జర్మనీని ఓడించిన యుద్ధంలో రష్యన్ల పాత్రను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్నారని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గత కొంతకాలంగా విమర్శిస్తున్నారు. ఇలా చేస్తున్నవారి లక్ష్యం స్పష్టంగా అర్థమౌతుందని తెలిపారు. రష్యా యొక్క బలాన్ని, నైతికతను దెబ్బతీయాలని, ప్రజలను విడదీసి ఒకరిమీద ఒకరిని ఉసి గొల్పేలా చేయాలని, చారిత్రకంగా ఉన్న కొన్ని ఊహాగానాలను ఉపయోగించుకొని తమ భౌగోళిక రాజకీయ లక్ష్యాలను సాధించాలని వారు ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ మహోన్నత దేశభక్తియుత యుద్ధం యొక్క 70వ వార్షికోత్సవం సందర్భంగా క్యూబా యోధుడు ఫైడల్ కాస్ట్రో రాసిన లేఖలో వీరులు, హీరోలైన రష్యా ప్రజలకి నివాళులర్పించారు. “ఈ యుద్ధంలో పోరాడి మరణించిన సోవియట్ ప్రజలందరూ వారి భూమి కోసం కాక మొత్తం మానవాళి కోసం త్యాగం చేశారని, సరియైన ఆలోచనా మార్గంలో వెళ్ళారని, పోషలిస్టులుగా, మార్క్సిస్టు లెనినిస్టులుగా, కమ్యూనిస్టులుగా నిలిచారని, తద్వారా చీకటి రోజులను తరిమికొట్టారని” కొనియాడారు.

ఇదంతా తెలిసినప్పటికీ, ఈ సంస్మరణ ఉత్సవాలలో రష్యా ప్రభుత్వంతో కలిసి పాలు పంచుకోవాల్సిన పశ్చిమ దేశాల నాయకులు మాత్రం, మూర్ఖంగా, నిస్సిగ్గుగా 70వ వార్షికోత్సవాన్ని బహిష్కరించారు. ఈ పరిణామానికి నాయకత్వం వహించిన అమెరికా, ఈ చర్య ద్వారా ఉక్రెయిన్‌లో జరుగుతున్న పరిణామాల పట్ల పశ్చిమ దేశాల అసంతృప్తిని తెలియ జేసింది. అయినప్పటికీ చాలా పశ్చిమ దేశాల నాయకులు ఈ బహిష్కరణలో పాలు పంచుకోవటానికి ఇష్టపడలేదు. జర్మనీ ఛాన్సలర్ ఎంజెలా మెర్కెల్, 70వ వార్షికోత్సవం జరిగిన కొద్దిరోజులకే యుద్ధంలో మరణించిన వారికి నివాళులర్పించటం కోసం మాస్కో వెళ్ళింది. మరణించిన రష్యన్లలో ఎక్కువ శాతం జర్మన్ సైన్యాలతో జరిగిన పోరాటంలోనే అంతమయ్యారు. వాషింగ్టన్, జర్మనీల నుండి ఎన్ని ఒత్తిడులు వచ్చినా చెక్ అధ్యక్షుడు మిలోస్ జిమాన్ మరియు సెర్బియా అధ్యక్షుడు తొమిస్లావ్ నికోరిక్ లాంటివారు హాజరైన కొద్దిమంది యూరోపియన్ నాయకులలో ఉన్నారు. 2015 ఏప్రిల్‌లో

జరిగిన జాతీయ టెలివిజన్ కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ 'మాట్లాడుతూ, కొంతమంది పశ్చిమ దేశాల నాయకులు హాజరు కావాలనుకున్నారు. కానీ వివక్షా పూరితంగా వాషింగ్టన్ నాయకత్వం వారికి అనుమతి నివ్వకుండా అడ్డుకుంటోందని తెలిపారు"

వింతేమిటంటే అమెరికన్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ జాన్ కెర్రీ మే నెల రెండోవారంలో రష్యాలో అడుగుపెట్టాడు. అమెరికా భాగోతాన్ని ప్రపంచానికి బట్టబయలు చేసిన ఎడ్వర్డ్ స్నోడెన్‌కు 2013 మే నెలలో రాజకీయ ఆశ్రయం కల్పించిన తర్వాత, అమెరికా సెక్రటరీ గారు మొట్టమొదటిసారిగా రష్యా వచ్చారు. ఈ కాలంలోనే ఉక్రెయిన్‌లో పశ్చిమదేశాల అనుకూల ప్రభుత్వాన్ని నెలకొల్పడంతో అమెరికా, రష్యా సంబంధాలు మరింత దిగజారాయి. నల్ల సముద్రతీరంలోని సోచిలో కెర్రీ పుతిన్‌తో భేటీ అయ్యాడు. ఉక్రెయిన్ విషయంలో భేదాభిప్రాయాలు తీవ్రంగా ఉన్నప్పటికీ, పశ్చిమ దేశాల నాయకుల పర్యటనల ద్వారా వారు రష్యాతో మరలా వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకోవటానికి సంసిద్ధంగా ఉన్నారని సంకేతాలను ఇచ్చినట్టయ్యింది.

ప్రపంచవ్యాప్తంగా భిన్నమైన, సంక్లిష్టమైన సమస్యలు తీవ్రమైన నేపథ్యంలో పశ్చిమ దేశాలకి రష్యా సాయం ఎంతగానో అవసర మైంది. సిరియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ మరియు ఇతర ముఖ్య ప్రాంతాలన్నింటిలో ఇస్లామిక్ తీవ్రవాదం పెరగడం పట్ల, అమెరికా, రష్యా రెండూ ఆందోళనలకు గురవుతున్నాయి. అలాగే ఇరాన్‌తో ఉన్న వైఖరిలో రష్యానుంచి ఎటువంటి మార్పులను అమెరికా కోరుకోవడం లేదు. పశ్చిమ దేశాలు ఇప్పటికీ ఇరాన్ మీద ఆంక్షలు ఎత్తివేయనప్పటికీ, రష్యా ఇరాన్‌కి శక్తివంతమైన ఎస్-300 రాకెట్లను పంపడానికి అంగీకరించింది. బరాక్ ఒబామా ప్రభుత్వం టెహరాన్‌తో జరిపే అణు చర్చలు విఫలమైతే, అంతర్జాతీయంగా ఇరాన్‌పై విధించిన ఆంక్షలను రష్యా పట్టించుకునే పరిస్థితి ఉండదు. ఇప్పటికే రష్యా, చైనా, ఇరాన్‌ల మధ్య వ్యూహాత్మక సహకార ఒప్పందం కుదిరేలా ఉంది. మొట్టమొదటి సారిగా మధ్యధరా సముద్రంలో రష్యా, చైనాలు సంయుక్తంగా నౌకదళ విన్యాసాలు చేయనున్నాయి. జాన్ కెర్రీ, పుతిన్‌ల మధ్య జరిగిన చర్చల తర్వాత, రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ 'మాస్కోపై ఆంక్షలు విధిస్తామని ఎవరు బెదిరించినా దానివలన ప్రయోజనమేమీ ఉండదని" నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

"ఇప్పటికే రష్యా, చైనా, ఇరాన్‌ల మధ్య వ్యూహాత్మక సహకార ఒప్పందం కుదిరేలా ఉంది. మొట్టమొదటి సారిగా మధ్యదరా సముద్రంలో రష్యా, చైనాలు సంయుక్తంగా నౌకదళ విన్యాసాలు చేయనున్నాయి. జాన్ కెర్రీ, పుతిన్‌ల మధ్య జరిగిన చర్చల తర్వాత, రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్‌రోవ్ ఒక ప్రకటనలో 'మాస్కోపై ఆంక్షలు విధిస్తామని ఎవరు బెదిరించినా దానివలన ప్రయోజనమేమీ ఉండదని" నిర్ద్వంద్వంగా ప్రకటించారు."



పోట్స్ డామ్ చర్చల సందర్భంగా స్టాలిన్, చర్చిల్, ట్రూమన్

70వ వార్షికోత్సవ సంబరాలలో అద్భుతమైన మిలిటరీ పెరేడ్‌లో పుతిన్‌తోపాటు పాల్గొన్న 30 దేశాల నేతలలో చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మరియు ఇండియా అధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీలు కూడా ఉన్నారు. చైనా అధ్యక్షుడిని, అతని భార్యను పుతిన్ పక్కనే కూచోబెట్టి అరుదైన గౌరవం అందించారు. మొదటి వరుసలో కూచోబెట్టిన వారిలో క్యూబన్ అధ్యక్షుడు రావుల్ కాస్ట్రో, వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా, జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే ఉన్నారు. ఉత్తర కొరియా యువ నాయకుడిని కూడా ఆహ్వానించారు. కాని, ఆయన ఆఖరి నిమిషంలో అత్యవసర పరిస్థితుల వలన రాలేకపోతున్నానని తెలియజేశారు. కొరియా, సెర్బియా లాంటి దేశాలు కూడా జాత్యహంకార శక్తులకు వ్యతిరేకంగా ఆనాడు యుద్ధంలో పాలు పంచుకున్నాయి. ఉక్రెయిన్ మరియు క్రొయేషియాలో కొంతమంది నాజీలకు మద్దత్తుగా నిలిచారు.

ఉక్రెయిన్‌లో జాత్యహంకార శక్తుల అనుకూల వాదులైన స్టీఫెన్ బండేరా నాజీలతో కలిసిచేసిన పోరాటంలో జాతి నాయకుడిగా గుర్తింపు పొందాడు. జాత్యహంకారంతో కూడిన పార్టీలైన 'రైట్ సెక్టార్' మరియు 'స్వబోధా'లు ప్రభుత్వంలో నేటికీ పాత్ర పోషిస్తూ, తమ స్వంత సాయుధ గ్రూపులను నడుపుతున్నాయి. యూరప్‌లో మళ్ళీ జాత్యహంకార ధోరణులు పెరుగుతున్నాయని పుతిన్ తన ప్రసంగంలో హెచ్చరించారు.

అంతేకాదు, మహోన్నతమైన ఆ యుద్ధం మన దేశ చరిత్రలో ఒక గొప్ప ఘటనగా మిగిలిపోతుందని, పరిస్థితులు మరోలా మారుతున్నాయని హెచ్చరిస్తూ, ఆనాటి యుద్ధంలో తమ సహభాగస్వాములైన, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల పాత్రను కూడా పొగిడారు. కానీ అదే సందర్భంలో ఆయన పరోక్షంగా ఈ దేశాలు ఈ మధ్యకాలంలో అనుసరిస్తున్న వైఖరిని

> **"ఆనాడే లండన్, ఫ్రాన్స్ ప్రభుత్వాలు మాస్కో ప్రతిపాదనను అంగీకరించి ఉంటే, జర్మన్ జాత్యహంకారులను ఆదిలోనే అంతమొందించే వారమని తెలియజేశాడు. సోవియట్ ప్రభుత్వం భారీఎత్తున బలగాలను పంపటానికి సిద్ధమైంది. బ్రిటన్, ఫ్రాన్స్ సేనలతో కలిసి పనిచేయడానికి 1939 ఆగస్టు 15వ తేదీన ఈ ప్రతిపాదన చేయబడింది. కాని రెండు దేశాలూ ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి."**

తీవ్రంగా విమర్శించారు. "అంతర్జాతీయ సంబంధాలలో గత కొన్ని దశాబ్దాలుగా మౌలికమైన సూత్రాలను కావాలనే కొంతమంది విస్మరిస్తున్నారు" అన్నారు. ఏకధృవ ప్రపంచం అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నాలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ అభివృద్ధికి, ఎదుగుదలకు ఇది ఆటంకంగా మారిందని విమర్శించారు.

సోవియట్ యూనియన్ పతనానంతరం మాస్కోలో ఎన్నడూ ఇంతపెద్ద ఎత్తున మిలిటరీ పెరేడ్ జరగలేదు. దాదాపు పదహారు వేలమంది సైనికుల కవాతు, 200 ట్యాంకులు, సాయుధ శకటాలు మరియు ఇతర రష్యా సంస్కృతికి సంబంధించిన వాహనాలతో పెరేడ్ జరిగింది. రష్యన్ ఎయిర్‌ఫోర్స్ కూడా దాదాపు 143 మిలిటరీ యుద్ధ విమానాలతో ఆకాశంలో అద్భుత విన్యాసాలు చేసింది. ఈ పెరేడ్‌లో రెండు వేల మంది యుద్ధ వీరులు కూడా పాల్గొన్నారు. ఈ పెరేడ్ తర్వాత దాదాపు ఐదు లక్షలమంది మాస్కో పౌరులు తమ బంధువులు, సన్నిహితులు ఎవరైతే యుద్ధంలో పాల్గొన్నారో, వారి ఫొటోలను చేతబట్టుకొని పురవీధులలో ప్రదర్శన చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా తన తండ్రిగారి ఫొటో చేతబుచ్చుకొని ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పుతిన్ చిన్న సోదరుడు కూడా లెనిన్ గ్రాడ్ యుద్ధంలో చిన్న వయసులోనే మరణించాడు. జర్మనీ సేనల ఆక్రమణ తర్వాత ఇతర రష్యన్ల వలెనే తాను, తన కుటుంబం చాలా పోగొట్టుకున్నామని పుతిన్ ప్రకటించాడు.

**స్టాలిన్ ప్రతిపాదనలు**

ఈ మహోన్నత యుద్ధాన్ని గుర్తు చేసుకుంటున్న సందర్భంలో కూడా, క్రెమ్లిన్ అధికార యంత్రాంగం స్టాలిన్‌కు దక్కాల్సిన హోదాను, ఘనతను, కావాలనే మరుగున పరిచే ప్రయత్నం చేసింది. హిట్లర్‌ను ఓడించడంలో స్టాలిన్ పోషించిన పాత్ర అమోఘం అనడంలో సందేహం లేదు. ఇప్పటికీ రష్యన్ ప్రజలలో స్టాలిన్‌కున్న ఆదరణ తరగలేదు. కార్నెజీ ఫౌండేషన్ 2013లో జరిపిన సర్వేలో 42 శాతం మంది రష్యన్లు తమ దేశాన్ని అత్యంత ప్రభావితం చేసిన చారిత్రక నాయకులలో స్టాలిన్‌ను అగ్రగణ్యుడిగా గుర్తించారు. పుతిన్ అధికార కార్యక్రమంలో స్టాలిన్‌ను పొగడటం కాని, విమర్శించడం కాని చేయలేదు. కాని ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల పుస్తకాలలో స్టాలిన్‌ను తిరిగి మరోసారి సానుకూలంగా చూయించే ప్రచురణలు పెరుగుతూ ఉన్నాయి. ఇటీవలనే బయటపడిన కొన్ని పత్రాల ఆధారంగా, 1939లోనే స్టాలిన్ బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్‌లు కూటమిగా ఏర్పడాలని ప్రతిపాదించాడని వెలుగులోకి వచ్చింది. బ్రిటన్ 'టెలిగ్రాఫ్ పత్రిక' రిపోర్టు ప్రకారం, పదవీ విరమణ చేసిన రష్యన్ విదేశాంగ ఇంటలిజెన్స్ అధికారి లెవ్ సోట్స్‌కోవ్ 700 అధికార సమాచార పత్రికలను పరిశోధించి, ఆనాడే లండన్ మరియు ఫ్రాన్స్ ప్రభుత్వాలు మాస్కో ప్రతిపాదనను అంగీకరించి ఉంటే, జర్మన్ జాత్యహంకారులను ఆదిలోనే అంతమొందించే వారమని తెలియజేశాడు. సోవియట్ ప్రభుత్వం భారీఎత్తున బలగాలను పంపటానికి సిద్ధమైంది. బ్రిటన్, ఫ్రాన్స్ సేనలతో కలిసి పనిచేయడానికి 1939 ఆగస్టు 15వ తేదీన ఈ ప్రతిపాదన చేయబడింది. కాని రెండు దేశాలూ ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. ఆ తర్వాత సంవత్సరమే మ్యూనిచ్ ఒప్పం దంలో భాగంగా బ్రిటన్ యుగోస్లోవియాను అప్పనంగా జర్మనీకి అప్పగించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తన ప్రతిపాదనలను తిరస్కరించిన తర్వాతే, రాజకీయంగా, దౌత్యపరంగా తప్పని సరి పరిస్థితులలో సోవియట్ యూనియన్ జర్మనీతో పరస్పర యుద్ధ నివారణకు మాలటోవ్–రిబ్బన్‌ట్రాప్ ఒప్పందం చేసుకుంది.



జర్మనీ పార్లమెంట్ భవనంపై అరుణపతాకాన్ని ప్రతిష్టిస్తున్న రష్యన్ రెడార్మీ సైనికుడు

సోట్స్కోవ్ చెప్పిన దాని ప్రకారం, ఆనాడే బ్రిటన్, ఫ్రాన్స్, వారి యూరోపియన్ మిత్రదేశమైన పోలెండ్ లాంటివి మాస్కో ప్రతిపాదనలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకొని ఉంటే, వారందరు కలిసి దాదాపు 300లకి పైగా డివిజన్ల సైన్యాన్ని జర్మనీకి వ్యతిరేకంగా రెండు రంగాలలో రణరంగంలోకి దింపగలిగేవారని, అప్పటికి జర్మనీకున్న సైన్యం కన్నా అది రెండింతలు ఎక్కువని, విజయం తథ్యమని తేల్చారు.

**(అనువాదం : ఎల్.ఎస్. భారవి)**

# తెలంగాణలో బలపడుతున్న నిరంకుశ ధోరణులు



రచయిత సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు

**ఎస్. వీరయ్య**

ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని టిఆర్ఎస్ నేతలు ఘనంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ ప్రజలూ సంతోషించారు. స్వయంగా ఉద్యమనేత ముఖ్యమంత్రి అయినందున ప్రజాభిప్రాయానికి విలువ పెరుగుతుందని ఆశించారు. ప్రజా ఉద్యమాల పట్ల గౌరవమూ పెరుగుతుందనుకున్నారు. స్థూలంగా ప్రజల భాగస్వామ్యం పెరుగుంతుందని ఆశించారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. సకల జనుల సమ్మెకు నాయకత్వం వహించినవారే అధికారంలో ఉన్నారు. సడక్‌బంద్‌తో సహా అనేకసార్లు తెలంగాణ బంద్ పిలుపునిచ్చిన పార్టీనే అధికారంలో ఉన్నది. అందువల్లనే ప్రజాభిప్రాయానికి గతంలో ఎప్పుడూ లేనంత విలువ కొత్త రాష్ట్రంలో దక్కుతుందని జనం భావించారు. కాని జరిగిందేమిటి? తెలంగాణ రాష్ట్ర తొలి వార్షికోత్సవ ప్రారంభసభ జనం లేక వెలవెలబోయిందెందుకు? సరిగ్గా యేడాది క్రితం కేరింతలు కొడుతూ సంబురాలు జరుపుకున్న జనమే వార్షికోత్సవ వేళ స్తబ్దంగా ఉన్నారెందుకు?

కొత్త ప్రభుత్వానికి తమ బాధలు చెప్పుకునేందుకు ప్రయత్నించిన ప్రజాసంఘాల ప్రతినిధులకు నెలలు గడిచినా ముఖ్యమంత్రి దర్శనం లభించలేదు. సంఘాలకే కాదు, పార్టీల ప్రతినిధులకు కూడా సమయం ఇవ్వలేదు. పరిష్కరించడం సంగతి అట్లా ఉంచి, కనీసం తమ సమస్యలు వినేందుకు సిద్ధపడలేదు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధ్యం కాదన్నారు. ఇప్పుడు వేతనాలు కూడా పెంచలేమంటున్నారు. సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికుల మీద నిర్బంధం ప్రయోగించారు. సమ్మె విచ్ఛిన్నం చేయడానికి చేయవలసిందంతా చేశారు. అయినా కార్మికులు ఐక్యంగా నిలబడడంతో సమ్మెను పరిష్కరించక తప్పలేదు. కానీ సంఘాల పాత్రను విస్మరించి ఏకపక్షంగా ప్రభుత్వం ప్రకటించిన తీరు గమనించాలి. కార్మికులు అడిగినదానికంటే ఒకశాతం ఫిట్‌మెంట్ ఎక్కువే ఇవ్వడం వలన ఈ విషయాన్ని అత్యధికులు పట్టించుకుని ఉండకపోవచ్చు. కానీ సమిష్టి బేరసారాల హక్కుకు సంబంధించిన విషయమిది. అంగన్‌వాడీ రంగంలో కూడా జరిగింది ఇదే. వేతనాలు పెంచడం సంతోషకరం. కానీ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, సమిష్టి బేరసారాల హక్కును గౌరవించక పోవడం మున్ముందు తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. మునిసిపల్ కార్మికుల సమస్యలు చర్చిస్తున్న సందర్భంగా "మేము పెంచదలచు కున్నప్పుడు పెంచుతాం. మా ముఖ్యమంత్రి యూనియన్లకెందుకు అవకాశమిస్తాడు?" అన్న మాటలు సాక్షాత్తు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి నోటి నుండి వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఫ్యూడల్ దానగుణం ఒకవైపు. నిరంకుశ ధోరణులు మరొకవైపు ప్రతిబింబిస్తున్నాయి.

శాసనసభ లోపల, వెలుపల జరుగుతున్న పరిణామాలు కూడా ప్రాధాన్యత సంతరించు కున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పర్చిన తొలి దినాల్లో పార్లమెంటరీ సాంప్రదాయాలను, విలువలను కాపాడుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పుచ్చలపల్లి సుందరయ్య అనుసరించిన విలువలను పునరుద్ధరిస్తామన్నారు. ప్రతిపక్షాల మాటకు విలువనిస్తామని ప్రకటించారు. ఆచరణ అందుకు భిన్నంగా ఉన్నది. చట్టసభల్లో ప్రతిపక్షం పట్ల అసహనం పెరుగుతున్నది. సభలో ప్రతిపక్షాన్ని నిర్మూలించే ధోరణి వ్యక్తమవు తున్నది. రాష్ట్రాన్ని వేధించే అనేక కీలకమైన సమస్యలపై కూడా అఖిలపక్షాన్ని సంప్రదించ లేదు.

సభ వెలుపల ప్రజల కార్యాచరణ పట్ల అసహనం పెరుగుతున్నది. అధికారుల చుట్టూ, మంత్రుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కానప్పుడు ప్రజాస్వామ్యయుతంగా ప్రజలు ఆందోళనా పోరాటాలకు పూనుకుంటారు. శాసనసభ సమావేశాల సందర్భంగా అయితే తమ సమస్యలకు మరింత ప్రాధాన్యత దక్కుతుందని భావించడం సహజం. కానీ తెలంగాణ రాష్ట్ర శాసనసభా సమావేశాల సందర్భంగా అవాంఛనీయ అనుభవాలే ఎదురైనాయి. వివిధ తరగతుల పేదల ఆందోళనలకు అనుమతులివ్వలేదు. అప్పటికే ఇచ్చిన అనుమతులు కూడా కొన్ని రద్దు చేశారు. రాజధానికి చేరుకున్న జనం మీద పోలీస్ నిర్బంధం ప్రయోగించారు. ధర్నాచౌక్ వద్ద గుమిగూడిన పేదలకు అన్ని వైపులా నిలువెత్తు బారికేడ్లు ఏర్పాటు చేసారు. జైలు గోడలను తలపించాయవి. వారి నినాదాలు వారికే తప్ప బయటివారెవరికీ వినిపించవు. ఎవరికీ వారు కనిపించరు. ఇది కూడా ఒక తరహా నిర్బంధమే. హైదరాబాదు నగరంలో ధర్నా చౌక్ మినహా ఇంకెక్కడా, ఎప్పుడూ నిరసన కార్యక్రమాలకు అనుమతి లేదు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేనిచోట కూడా నిషేధమే. భారీ బహిరంగ సభలు

**"ప్రజాభిప్రాయాన్ని, ప్రజల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకోవడమే ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేసే మార్గం. ప్రజల్లో వ్యక్తమయ్యే అసంతృప్తికి మూలం ఆర్థిక, సామాజిక సమస్యల్లో ఉంటుందన్నది వాస్తవం. ప్రభుత్వం మాత్రం ఆ దశలో పరిశీలించకుండా పోలీస్ వ్యవస్థమీదనే విశ్వాసం పెంచుకుంటు న్నట్టున్నది. ప్రజా ఉద్యమాలపట్ల అనుసరించిన వైఖరి ఇందుకు తార్కాణం."**

ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. టిఆర్ఎస్ నాయకత్వానికి ఈ విషయం తెలియనిది కాదు. అనేక సందర్భాల్లో భారీ సమీకరణలు చేసినవారే. అయినా నగర నడిబొడ్డున జనసమీకరణకు అవకాశం ఉన్న ఏకైక ప్రభుత్వ స్థలం ఎన్టీఆర్ స్టేడియంలో భవనాలు నిర్మించాలని నిర్ణయించారు.

స్వచ్ఛ హైదరాబాదు పేరుతో నగరంలో ఎక్కడా పోస్టర్లు ఉండరాదంటున్నారు. నగర స్వచ్ఛతకు పోస్టర్లే ఆటంకమా? పర్యావరణం, డ్రైనేజీ, చెత్త, గతుకుల రోడ్లు, మురికివాడలను వదిలి పోస్టర్ల గురించే ఎందుకు మాట్లాడు తున్నారు? కరపత్రాలు, పోస్టర్లు, ధర్నాలు, ప్రదర్శనలు పేద, మధ్య తరగతి ప్రజల భావ వ్యక్తీకరణకు ఉన్న కొద్దిపాటి మార్గాలు. వీటికి పరిమితులు విధిస్తే ఇక ప్రజాస్వామ్య హక్కులు అందుబాటులో ఉండేది ఎవరికి? కోట్లు ఖర్చుపెట్టి హోర్డింగ్‌లు, మీడియాలో వ్యాపార ప్రకటనలు చేయగల కోటీశ్వరులకేకదా!

అసహనం, హద్దులు దాటుతున్న ఛాయ లు కూడా కనపడుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ నేత చిన్నారెడ్డిమీద టిఆర్ఎస్ కార్యకర్తలు చేయిచేసుకున్న వైనం ఇందుకొక ఉదాహరణ. మరో నాయకుడు రేవంత్‌కు పట్టిన గతే నీకూ పడుతుందని కృష్ణమాదిగను హెచ్చరించారు. ఇంకోనేత ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కళాకారులను బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. కాంగ్రెస్, టిడిపిలకు తెలంగాణలో పనిచేసే హక్కులేదని సాక్షాత్తు మంత్రులే మాట్లాడుతున్నారు. ప్రజలు ఎన్నికల్లో ఏ పార్టీనైనా తిరస్కరించవచ్చు. కానీ ఒకపార్టీ పనిచేసే హక్కులేదని మరొక పార్టీ చెప్పడం అప్రజాస్వామ్యం. ప్రతిపక్షాల నుండి ప్రజా ప్రతినిధులను ఆకర్షించడాన్ని కూడా బహిరంగంగా సమర్ధించుకుంటున్నారు. అభివృ ద్ధికోసం అధికార పార్టీలో చేరడం తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రజలూ-ప్రతిపక్షాలే కాదు, సొంత పార్టీలో కూడా భిన్నాభిప్రాయాలకు తగిన అవకాశం లేదన్న అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. మంత్రివర్గంలో కూడా ముఖ్యమంత్రి ముందు స్వేచ్ఛగా భిన్నాభిప్రాయం చెప్పగల పరిస్థితి లేదు. తెలంగాణ రాష్ట్ర వార్షికోత్సవ సందర్భంగా వెలువడిన కొన్ని సర్వేల్లో కూడా మంత్రివర్గంలో ముఖ్యమంత్రి మాత్రమే జయప్రదమయ్యారని ప్రజాభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యమంత్రి గొప్పవాడని చెప్పడానికిది బాగానే కనిపించవచ్చు. నాణేనికి మరోవైపు కూడా చూడాలి. మంత్రులెవరూ జయప్రదం కానప్పుడు ఆ మంత్రివర్గ నాయకత్వం జయప్రదమైందని ఎలా చెప్ప గలం? మంత్రివర్గ సహచరులను నిర్ణయాల లోనూ, అమలు క్రమంలోనూ సమర్ధవం తంగా భాగస్వాములను చేయడంలో వైఫల్యమే ఇది.

ప్రజాభిప్రాయాన్ని, ప్రజల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకోవడమే ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేసే మార్గం. ప్రజల్లో వ్యక్తమయ్యే అసంతృప్తికి మూలం ఆర్థిక, సామాజిక సమస్యల్లో ఉంటుందన్నది వాస్తవం. ప్రభుత్వం మాత్రం ఆ దశలో పరిశీలించకుండా పోలీస్ వ్యవస్థమీదనే విశ్వాసం పెంచుకుంటున్న ట్టున్నది. ప్రజా ఉద్యమాలపట్ల అనుసరించిన వైఖరి ఇందుకు తార్కాణం. అంతే కాదు. ఈ మధ్య మురికివాడల్లో పోలీసుల తనిఖీలు విచ్చలవిడిగా చేస్తున్నారు. అర్ధరాత్రి నాలుగైదు గంటలపాటు తనిఖీల పేరుతో పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నేరస్తులు ఉన్న బస్తీలను "జల్లెడ పట్టడం" అని దీనికో ముద్దుపేరు పెట్టారు. ఒకరిద్దరు నేరస్తులుంటే ఆ బస్తీ మొత్తం ప్రజలను నేరస్తులుగా పరిగణిస్తారా? ఆ పేరుమీద సాధారణ ప్రజల వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించవచ్చా? అనేక సందర్భాల్లో టెర్రిస్టులు, ఇతర సంఘ వ్యతిరేక శక్తుల అడ్డాలు, ఆస్థిపరుల కాలనీల్లోనూ, గేటెడ్ కమ్యూనిటీల్లోనూ దొరకడం తెలిసిందే. మరి గేటెడ్ కమ్యూ నిటీల్లో కూడా జల్లెడపట్టే కార్యక్రమం పేరుతో అర్ధరాత్రులు నిద్రాభంగం కలిగించగలరా? ఇంతెందుకు? సంఘ వ్యతిరేక శక్తులకు ప్రజా




తెలంగాణా అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన

ప్రతినిధులు, మంత్రులే ఆశ్రయమిస్తున్న సందర్భాలు అనేకం. పెద్దపెద్ద మోసాలు, కుంభకోణాల్లో పెద్దల పేర్లే కదా ముందుకొస్తున్నవి? అయినా పేదల బస్తీలే లక్ష్యంగా ఎందుకు మారుతున్నాయి? ఇప్పుడు రైల్వే స్టేషన్లలోనూ, బస్టాండ్లలోనూ కూడా జల్లెడపడతారట!

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదట నిధులు విడుదల చేసింది పోలీస్ శాఖకేనని తెలుస్తున్నది. వేతనాలు పెంచింది కూడా పోలీస్ శాఖలోనే. ఇప్పుడు ఖాళీ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రకటించిన పోస్టుల్లో ఎక్కువ భాగం పోలీస్ శాఖలోనే. ఆధునిక వాహనాలు మొదట అందుబాట్లోకి తెచ్చింది కూడా పోలీస్ అధికారులకే. రాష్ట్ర హోం శాఖా మంత్రి, ఉన్నతాధికారులు బ్రిటీష్ పోలీస్ వ్యవస్థను అధ్యయనం చేసి వచ్చారు. మొత్తం మీద పోలీస్ శాఖ మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. మొత్తంమీద ప్రజాభిప్రా యానికి, ప్రజల భాగస్వామ్యానికి విలువలేదు. ప్రజా స్వామ్యం స్థానంలో ఏక స్వామ్యం అమలు జరుగు తున్నది. నిరంకుశ ధోరణులు బలపడు తున్నాయి. ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తం కావాల్సిన సమయమిది. •

# యువతరానికి 'విప్లవ సందేశం'




ఎం. నిర్మల్‌కుమార్

ప్రిన్స్ పీటర్ అలెగ్జేవిచ్ క్రొపాట్కిన్ రష్యా దేశానికి చెందిన ప్రపంచస్థాయి మేధావి. ఇతను వర్గ రీత్యా జమీందారీ కుటుంబానికి వారసుడైనప్పటికీ స్వతంత్ర భావాలతో పెరిగాడు. ఉన్నతస్థాయి ఆలోచనలు వంట బట్టటం చేత సోషలిస్టుగా మారాడు. జమిందారీ వర్గాల్లో ఉండే అవినీతి, ఆడంబరాలు, సోమరితనం, అమానుషకృత్యాలు చిన్నప్పటి నుండీ ఇతనికి నచ్చేవికావు. స్వయంగా ఇతను తన రూరిక్ వంశపు జమీందారీ కుటుంబ పోకడలను పరిశీలించటం ద్వారా ఆ వ్యవస్థ యొక్క స్వరూప స్వభావాలను అర్థం చేసుకోగలిగాడు. ఈ జమిందార్లకు పెద్దన్నలుగా ఉన్న జార్ చక్రవర్తులు రష్యాదేశపు సామాజిక జీవితాన్ని దిగజార్చిన తీరు ఇతనిలో తిరుగుబాటు భావాలను పెంచింది. ఆనాటి యూరప్ రాజకీయాలు ఇతనిని సోషలిస్టుగా, అనార్కిస్టుగా మార్చాయి.

కళలు, సామాజిక పాదార్థిక శాస్త్రాల విజ్ఞానం కలబోసుకున్న అరుదైన మేధస్సు క్రొపాట్కిన్‌ది. ఇతను భూగోళ శాస్త్రవేత్తగా అనేక పరిశోధనలు చేశాడు. గ్లేషియల్ డిపాజిట్లను కనుగొన్నాడు. రష్యా ప్రాంతపు జల ప్రళయ కాల నిర్ణయానికి సంబందించి శాస్త్రీయ నిర్ధారణలు చేశాడు. ఇంకా ఇతను కవి, రచయిత, గాయకుడు, చిత్రకారుడు, పలు బాషల్లో పండితుడు. అంతకుమించి సోషలిస్టు సిద్ధాంతవేత్త, విప్లవకారుడు. క్రొపాట్కిన్ ఒకవైపు బహుముఖ ప్రజ్ఞ కలిగిన ప్రతిభావంతునిగా యూరప్ వైజ్ఞానిక సమాజం చేత కొనియాడబడుతున్న కాలంలోనే, రష్యా సమాజం అనేక తిరుగుబాట్లుకు నెలవుగా ఉండేది. భూస్వామ్య విధానపు దోపిడి, జార్ చక్రవర్తుల నిరంకుశ పరిపాలన, అప్పుడే తలెత్తుతున్న పెట్టుబడిదారీ వర్గాల అవకాశవాద రాజకీయాలు ఆనాటి రష్యన్ యువతను, మేధావులను తీవ్రమయిన అసంతృప్తికి గురిచేశాయి. అనేక సామాజిక ఉద్యమాలు జరిగాయి. వందలాది మంది యువతీయువకులు ఉరితీయబడ్డారు. వేలాది మంది సైబీరియా ప్రవాసశిక్షకు గురయ్యారు. ఎంతకీ అణగని మహా విప్లవశక్తితో రష్యా కంపించిపోయింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సోషలిజం, ప్రజాస్వామ్యం వంటి ఆధునిక భావాలను ప్రబోధించే విప్లవ సాహిత్యం రష్యాను ఉర్రూతలూగించింది.

1870 ప్రాంతంలో ఈ విప్లవ వాతావరణానికి నాయకుడు బొరోడిన్. పోలీసులు, గూఢచారులు బొరోడిన్‌ను పట్టుకోవడానికి చాలా ప్రయత్నాలు చేశారు. అయినా చాలాకాలం పాటు అతని జాడను కూడా పసిగట్టలేక పోయారు. చివరకు 10 సంవత్సరాల రాజకీయ జీవితం తరువాత బొరోడిన్ పట్టుబడ్డాడు. ఇతని అరెస్ట్ రష్యాను నివ్వెరపర్చింది. బొరోడిన్ మరెవరోకాదు, క్రొపాట్కినే. మహామేధావి, ఉన్నత మానవుడూ అయిన క్రొపాట్కిన్ విప్లవకారుడు కూడా అని తెలిసి కొందరు సంతోషించారు. మరికొందరు విచారించారు. మూడు సంవత్సరాల జైలు జీవితం అనంతరం ఇతను జైలునుండి తప్పించుకొని ఫిన్‌లాండ్ వెళ్ళిపోయాడు. ఆ తర్వాత స్వీడన్, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్ దేశాలలో ఉంటూ విప్లవ కార్యక్రమాలు పర్యవేక్షిస్తాడు. రష్యా ఒత్తిడితో ఫ్రాన్స్ ప్రభుత్వం క్రొపాట్కిన్‌ను అరెస్ట్ చేసి, జైలుశిక్ష విధిస్తుంది. మిగిలిన యూరప్ సమాజపు ఒత్తిడితో క్రొపాట్కిన్ విడుదలవుతాడు. 1917 వరకు ఇతను ఇంగ్లాండ్‌లో నివసిస్తాడు. రష్యా విప్లవం విజయవంతమయ్యాక రష్యా వస్తాడు. "ఫీల్డ్స్, ఫ్యాక్టరీస్ అండ్ వర్క్‌షాప్స్," "రష్యా, ఫ్రాన్స్ జైళ్ళలో," "విప్లవ సందేశం" అనేవి ఇతని ప్రముఖ రచనలు. ఎలాంటి అధికార కేంద్రీకరణనూ అంగీకరించని (అనార్కిజం) అరాచకవాదం అనే తత్వశాస్త్రానికి మూల సిద్ధాంత వేత్తలలో క్రొపాట్కిన్ ఒకరు. అయితే మరో ప్రముఖ అనార్కిస్టు బకునిన్ వలే ఇతను కమ్యూనిస్టు వ్యతిరేకి కాదు. బోల్షివిక్కుల పట్ల తటస్థంగా ఉండిపోయాడు.

విప్లవ సందేశం అనే ఇతని పుస్తకం ప్రపంచవ్యాప్తంగా ఎందరినో ప్రభావితం చేసింది. లెనిన్, ట్రాట్స్కీ, స్వెర్డలోవ్, మావో వంటి నాయకులు ఈ పుస్తకం చదవమని కార్యకర్తలకు సూచించేవారు. మన దేశానికి సంబంధించి భగత్‌సింగ్ వంటి తొలితరం

**"ఈ పుస్తకంలోని రాతలు మనతో మాట్లాడుతున్నట్లు ఉంటాయి. మనలోని ఉదాసీనతను, స్వార్ధ చింతనను, తటపటాయిం పులను, సంకల్పలేమిని క్రొపాట్కిన్ కడిగి పారేస్తాడు. విద్యార్థులను, విద్యాభ్యాసం పూర్తి చేసుకొని వివిధ వృత్తుల్లోకి ప్రవేశించబోతున్న యువతీ యువకులనుద్దేశించి అనేక సామాజిక విషయాలను క్రొపాట్కిన్ చర్చిస్తాడు."**

విప్లవకారులు, శ్రీశ్రీ వంటి విప్లవకవులు ఈ పుస్తకం చేత ప్రభావితం చేయబడ్డారు. మహా ప్రస్థానంలోని కొన్ని కవితలను ఈ పుస్తకం ప్రభావంతోనే వ్రాశానని శ్రీశ్రీ తన ఆత్మకథలో రాశాడు. ఈ పుస్తకం పరిమాణంలో చాలా చిన్నది. కానీ దీని రూపం-సారం విషయంలో అతిగొప్ప ప్రభావం చూపింది. ఇది 1936 లోనే తెలుగులో ముద్రింపబడింది. మహీధర సోదరులు తెలుగులోకి అనువదించారు. ఇప్పుడు ప్రజాశక్తి వారు దీనిని పునర్ముద్రించారు.

ఈ పుస్తకంలోని రాతలు మనతో మాట్లాడుతున్నట్లు ఉంటాయి. మనలోని ఉదాసీనతను, స్వార్ధచింతనను, తటపటాయిం పులను, సంకల్పలేమిని క్రొపాట్కిన్ కడిగి పారేస్తాడు. విద్యార్థులను, విద్యాభ్యాసం పూర్తి చేసుకొని వివిధ వృత్తుల్లోకి ప్రవేశించబోతున్న యువతీ యువకులనుద్దేశించి అనేక సామాజిక విషయాలను క్రొపాట్కిన్ చర్చిస్తాడు. సాంఘిక బాధ్యతలను సజావుగా నిర్వహించినపుడే మనిషి సంఘజీవిగా విజయం సాధిస్తాడు. ప్రతి వృత్తినీ సామాజిక బాధ్యతగానే భావించాలి. కేవలం ధనార్జనా సాధనంగా మాత్రమే పరిగణించకూడదు. సామాజిక బాధ్యతలను నిజాయితీగా నిర్వహించడమంటే సోషలిస్టుగా జీవించడమే అంటాడు క్రొపాట్కిన్. సమిష్టి జీవనమే సోషలిజం, సమిష్టి తత్వమే సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం. ఈ సత్యాన్ని గుర్తెరిగి అందుకనుగుణంగా ఆచరణలోనికి దిగడమే ప్రజలందరి కర్తవ్యం. అదే అత్యున్నత సామాజిక ధర్మం. అదే విప్లవమార్గం. పుస్తకం ఆసాంతం క్రొపాట్కిన్ మానవ జీవిత ప్రాశస్త్యాన్ని గురించి చర్చిస్తాడు. కేవలం ధనార్జన, కుక్షింభరత్వం, సంకుచితమైన వ్యక్తి సుఖం వంటి లక్ష్యాలు పశుప్రాయాలని ఈసడిస్తాడు. మానవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యుక్తాయుక్త విచక్షణాజ్ఞానాన్ని వినియోగించాలి. మానవ చైతన్యాన్ని సరైనమార్గంలో నడిపిస్తే మానవ సమాజాన్ని విశ్వ మానవ సమాజంగా మార్చవచ్చు. వర్గ అసమానతలు వదిలేస్తే మనిషి అన్ని రకాల బానిసత్వాల నుండి విముక్తుడవు తాడు. నేటి విద్య మానవుల్లో సంకుచితత్వాన్ని, మోసాన్ని, అహంకారాన్ని పెంచేదిగా ఉంది. దీని స్థానంలో సోషలిస్టు విద్య రావాలి. అది మాత్రమే మనిషి బాహ్య ప్రవర్తనకు, మేధోప్రబోధానికి సామరస్యాన్ని కుదర్చగలుగు తుంది. అప్పుడే అన్ని రకాల దుర్మార్గాలూ నశిస్తాయి. అందుచేత ఈ వర్గ సమాజాన్ని సమూలంగా మార్చేసే విప్లవాన్ని ప్రతి ఒక్కరూ ఆహ్వానించాలని క్రొపాట్కిన్ కోరతాడు. "విప్లవం సామాజిక అవసరమేకాదు. అది వ్యక్తిగతంగా నీ అవసరం కూడా! నిన్ను నువ్వు విప్లవంలో భాగం చేసుకుంటే అది నిన్ను సంకుచితత్వం నుండి బయటికి లాగుతుంది. అప్పుడు పరిశు ద్ధుడివి అవుతావు'' అంటూ పిలుపిస్తాడు క్రొపాట్కిన్.

వైద్యవృత్తిని పవిత్రవృత్తి అంటారు. కానీ నిజానికి ఈ అవినీతికర వర్గ సమాజంలో వైద్యవృత్తి అనేక రకాలయిన మోసాలతో నిండిపోయింది. వైద్యశిక్షణ పొందేటప్పుడు మానవసేవే ఈ వృత్తి పరమార్థం అని ప్రతి వైద్య విద్యార్థీ శిక్షణ పొందుతాడు. ఎన్నో మహదాశయాలతో, ఉత్తేజంతో వృత్తిలోనికి ప్రవేశించిన వైద్యుల్ని ఈ వర్గ సమాజం ధనార్జనా సుడిగుండంలో ముంచేస్తుంది. పవిత్రత, మానవసేవ వంటి భావాలన్నీ మనసు పొరల్లో అడుగు భాగానికి అణగదొక్కబడతాయి. ఈ సమాజంలో కొందరికి శ్రమ ఎక్కువై, తిండి, విశ్రాంతి తక్కువై రోగాలొస్తాయి. మరికొందరికి తిండి, సుఖాలు ఎక్కువై శరీరక శ్రమ లేక రోగాలొస్తాయి. ఈ వైరుధ్యానికి పరిష్కారం వైద్యశాస్త్రంలో లేదు. సామాజిక శాస్త్రంలో ఉంది. సోషలిజంలో ఉంది. వర్గరహిత సమాజం ఏర్పడితే అందరి ఆరోగ్యాలూ బాగవుతాయి. వైద్యాన్ని గురించి రాస్తూ రచయిత ఓపేద స్త్రీ రోగిని వర్ణిస్తాడు. సరిపోయినంత గాలి, వెలుతురు లేని ఇల్లు. నేలంతా చెమ్మగా ఉంటుంది. సరైన తిండిలేక ఏముకల గూడులా మారిన శరీరం. మురికిలో పెరుగుతున్న పిల్లలు. రెక్కలు ముక్కలయ్యేట ట్లున్న పని. అదే పనిగా దగ్గుతూ ఆ స్త్రీరోగి వైద్యుని వద్దకొస్తుంది. వైద్యుడేమో విశ్రాంతి తీసుకోమని, పోషకాహారం తీసుకొమని, పరిశు భ్రమైన, సౌకర్యవంతమైన ఇంట్లో నివసించమని సలహా ఇస్తాడు. కోట్లాది ప్రజలకు ఈ నికృష్ట

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**- ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తి ప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ-2

సమాజంలో ఇవి సాధ్యం కావు. సమ సమాజంలోనే ఇవి సాధ్యమౌతాయని వైద్యులు అర్థం చేసుకోవాలి. అందుకే వైద్యులు విప్లవానికి మద్దతివ్వాలంటాడు.

మానవ సమాజం ఏలా ఉండాలి ? పరిపాలన ఎలాసాగాలి ? మనిషి సర్వతో ముఖాభివృద్ధి అంటే ఏమిటి? మనిషికి తార్కిక ఆలోచన ఎలా నేర్పాలి ! చాలా కాలం నుండి ఇటువంటి అంశాల గురించి శాస్త్రాలు బోధి స్తూనే ఉన్నాయి. తాత్వికులు ఆలోచిస్తూనే ఉన్నారు. కానీ ఇవన్నీ జరగటం లేదు. ఎందుకని? ఆదర్శ సమాజ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్నదేమిటి ? కొద్ది శాతంగా ఉన్న ధనిక వర్గాలు సామాజిక సంపదలో అధిక భాగాన్ని తమ సొంతం చేసుకున్న ఫలితంగానే ఈ ఆదర్శాలు వాస్తవ రూపం దాల్చటం లేదంటాడు క్రొపాట్కిన్. శాస్త్ర పరిశోధనల కారణంగా ఆవిష్కరించబడ్డ విజ్ఞానమంతా పుస్తకాలలోకి చేరిపోతుంది. ఆ పుస్తకాలు బీరువాలలోకి చేరిపోతున్నాయి. కాని సామాన్య జనులకు ఈ విజ్ఞానంలోని ఆవగింజంత భాగం కూడా అందటం లేదు. ఈ విజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి రావాలంటే సోషలిజం రావాలి. అందుచేత మేధావులంతా సోషలిజానికి మద్దత్తు ఇవ్వాలి.

పెట్టుబడి దారీ సమాజం అన్యాయమైంది కాదని కొందరు వాదిస్తున్నారు. ఈ వ్యవస్థలో జరిగే అక్రమాలను సరిచేయడానికే న్యాయ వ్యవస్థ ఉందంటారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు, శాసనాలు, చట్టాలు, న్యాయశాస్త్రం మొదలైనవన్నీ ఈ వ్యవస్థను సరైన మార్గంలో నడిపించే వంటారు. ఈ వాదన వినడానికి బాగానే ఉంటుంది. కాని సామాజిక వాస్తవమెలా ఉంది? భూస్వామి దౌర్జన్యానికి గురైన ఒక శ్రామికుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి సహాయం పొందగలడా? కేసు వేయగలడా ? చివరికి బాధితునికే శిక్ష పడుతుంది. చట్టాలు ధనవంతుల యొక్క చుట్టాలు. ఆరుగాలం శ్రమించి, రెక్కలు ముక్కలు చేసుకొని, మహారణ్యాలను యోగ్యమైన మాగాణి భూములుగా మార్చిన శ్రామికులకు కడుపునిండా తిండి దొరకదు. కాని కుయుక్తులతో ఆ మాగాణులకు వేరొకరు యజమానుల య్యారు. సోమరిపోతులు అంతులేని సంపదలతో తులతూగుతుంటారు. ఇదెక్కడి ధర్మమో ఈ న్యాయశాస్త్రాలు చెప్పగలవా? ఒకడు ఆకలికి తాళలేక రొట్టె దొంగిలిస్తే అది నేరం! వాడికి ఎలాంటి శిక్షలు విధించాలో న్యాయ శాస్త్రం స్పష్టంగా చెపుతుంది. కాని వాడికి పని దొరక్క పోవడానికి, పస్తులకు, వేదనలకు, పీడనకు కారణమైన వారి గురించి ఈ న్యాయశాస్త్రాలేమీ మాట్లాడవు. ఎందుకని? ఎందుకంటే ఇది యజయానుల పక్షం వహించే న్యాయవ్యవస్థ. ఈ వర్గ సమాజంలో బలహీనులకు రక్షణ లేదు. నిజమైన న్యాయం, నిజమైన ధర్మం సమ సమాజంలోనే సాధ్యం. అందుచేత నిజాయితీ గల ప్రతి న్యాయవాదీ విప్లవ మార్గంలోకి రావాలంటాడు క్రొపాట్కిన్.

" ఒకడు ఆకలికి తాళలేక రొట్టె దొంగిలిస్తే అది నేరం! వాడికి ఎలాంటి శిక్షలు విధించాలో న్యాయ శాస్త్రం స్పష్టంగా చెపుతుంది. కాని వాడికి పని దొరక్క పోవడానికి, పస్తులకు, వేదనలకు, పీడనకు కారణమైన వారి గురించి ఈ న్యాయశాస్త్రాలేమీ మాట్లాడవు. ఎందుకని? ఎందుకంటే ఇది యజయానుల పక్షం వహించే న్యాయవ్యవస్థ. "



ప్రిన్స్ క్రొపాట్కిన్

ఇంజనీర్లు తమ యవ్వనాన్నంతా పరిశోధనలకే అంకితం చేస్తారు. ఉత్పత్తిని సులభతరం చేస్తారు. తమ మేధస్సుతో, నైపుణ్యంతో అద్భుతమైన యంత్రాలు తయారు చేస్తారు. మానవజాతి కది గొప్ప ముందడుగను కుంటారు. కానీ దీని పర్యవసానమేమిటి ? వేలకొలది శ్రామికులు నిరుద్యోగులౌతారు. వారి కుటుంబాలు, పిల్లలు అధోగతి పాలవుతారు. కానీ పెట్టుబడిదార్లు మాత్రం మరింత ధనవంతులౌతారు. ఇదేనా మానవజాతి ముందడుగు? ఇంజనీర్ల కృషికి ఈ పర్యవసాన మేనా సార్థకత? సహృదయులైన ఇంజనీర్లు ఆలోచించాలి. ఉత్పత్తి విధానంలో ఉన్న లోపాలు సరిచేయబడకుండా మానవజాతి ప్రస్థానం ఉన్నత శిఖరాలవైపు సాగిపోజాలదు. దీనికి పరిష్కారం సోషల్ ఇంజనీరింగ్‌లో ఉందంటాడు క్రొపాట్కిన్. విప్లవమంటే సోషల్ ఇంజనీరింగేనంటాడు క్రొపాట్కిన్.

సామాజిక నిర్మాణంలో అతి ముఖ్యమయి నది ఉపాధ్యాయ వృత్తి. ఈనాటి పిల్లలంతా రేపటి ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, పొలిటీషియన్లుగా, ఇలా రకరకాల లక్ష్యాలతో ఎదగాలని ఉపాధ్యాయులు కోరుకుంటారు. మంచిదే! మానవ సమాజానికి ఇంజనీర్లు, డాక్టర్లు వంటి వృత్తి నిపుణులు కావాల్సిందే ! కానీ వీటికంటే ముందు నేటి సమాజానికి ఉత్తమ పౌరులు కావాలి. మంచి మనుషులు కావాలి. కేవలం వారు వృత్తి నిపుణులుగా తయారైతే సరిపోదు. కేవలం డబ్బుకు తమ నైపుణ్యాన్ని అమ్ముకునే వారుగా ఉంటే క్రమ క్రమంగా అవినీతిలోకి దిగిపోతారు. సామాజిక బాధ్యత లను గాలికొదిలేస్తారు. అందుకే తమ హక్కులు, విధుల పట్ల సరైన చైతన్యం గల నూతన మానవులు కావాలి. అలాంటి నూతన మానవు లు రూపుదిద్దుకోవటం సోషలిజంలోనే సాధ్య మౌతుంది. సమిష్టి ప్రయోజనం అనే సూత్రం సమాజానికి క్రమశిక్షణ నేర్పుతుంది. కేవలం కొద్దిమంది స్వార్థపరుల వ్యక్తిగత ప్రయోజనం ఆధారంగా నడిస్తే సమాజంలో క్రమశిక్షణ లోపిస్తుంది. అశాంతి పెరుగుతుంది. అందుచేత ఉపాధ్యాయులు పిల్లల మనసుల్లో సోషలిస్టు బీజాలు నాటాలి. అయితే సోషలిజాన్ని కూడా పిడివాదంలాగా, మత సూత్రాల మాదిరిగా నేర్పకూడదు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం ఏర్పరచాలి. ఏది మంచి, ఏది చెడో స్వయంగా

> **"బీదవాళ్ళలో పుట్టి కూడా ఎవడు సోషలిస్టు విప్లవానికి దూరంగా ఉంటాడో, వాడు తన సౌఖ్యం ఎందులో ఉందో కూడా ఎరుగని మూర్ఖుడని చెప్పక తప్పదు. మీరు సోషలిజం భ్రమలలో నుండి బయటికి రండి. పస్తులు, పేదరికం, యుద్ధాలు, అనారోగ్యం, నీచత్వం, మురికి, అవినీతి, దోపిడి వంటి దుర్గుణాలను అంతమొందించే విప్లవాన్ని ప్రేమించండి."**

నిర్ధారించుకోగలగాలి. జిజ్ఞాస, పరిశోధనా శక్తి, ప్రశ్నించే స్వభావాలు, పిల్లల్లో అభివృద్ధి పరచాలి. ఉపాధ్యాయులు సాధారణంగా పిల్లల్లో ఊహాశక్తిని పెంచేందుకు, వారికి సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేసేందుకు, నైతిక విలువలు నేర్పేందుకు, పురాణాలు, ఇతిహాస కథలు బోధిస్తారు. కాని ఈ కథలన్నీ చరిత్రలో భాగం కాదని పిల్లలకు అవగాహన కల్పించాలి. లేదంటే పిల్లల్లో మూఢ విశ్వాస్వాలు పెరుగుతాయి. ఈ కథలకంటే చారిత్రక గాధలు బోధించడం మరింత ప్రయోజనకరం. పిల్లల్లో మూఢవిశ్వాసాలు, అశాస్త్రీయ భావాలుంటే వారీ వ్యవస్థను మార్చలేరు. అసలు సమస్యలు వదిలేసి, పనికి రాని విషయాల చుట్టు తిరుగుతుంటారు. పిల్లల్లో మానవత్వాన్ని పెంచే విద్య నేటి అవసరం. పెట్టుబడిదారీ వ్యవస్థ పిల్లలకు మానవత్వాన్ని నేర్పదు. కేవలం సోషలిస్టు వ్యవస్థే పిల్లల్లో మానవత్వాన్ని, శాస్త్రీయ దృక్పధాన్ని పెంచుతుంది. కాబట్టి విద్యావేత్తలు, ఉపాధ్యాయులు సోషలిజాన్ని కోరుకోవాలంటాడు క్రొపాట్కిన్.

మానవుల్లో సున్నితత్వాన్ని, స్పందించే గుణాన్ని, సృజనాత్మకతను పెంచాలి. మానవ హృదయానుభూతులను, కళలను తేజోవంతం చేయాలి. గొప్ప వెలుగుల వైపుకు వారిని నడిపిం చాలి. కాని నేటి కళలు నీచమైన వ్యాపారాల్లాగా మారిపోయాయి. వర్తక దుకాణంలో అలంకారాల్లాగా, కళలు కొడిగట్టిన దీపాల్లాగా కాంతి విహీనంగా మారి పోయాయి. కళలు అద్భుత మత కల్పనల చుట్టూ, రాజుల భజనల చుట్టూ, చౌకబారు శృంగారం చుట్టూ తిరుగుతున్నాయి. ఈ బానిస బంధనాల నుండి కళలు విముక్తి కావాలి. ప్రజల జీవిత సమస్యలను స్వీకరించాలి. అభాగ్యులకు ఓదార్పునివ్వాలి. వారిని ముందుకు నడిపిం చాలి. వారిలో ధైర్యాన్ని కల్గించాలి. యువతి యువకుల్ని కార్యోన్ముఖుల్ని చేయాలి.



అక్టోబర్ విప్లవ రథ సారథి వి.ఐ. లెనిన్

మహోన్నత ఆదర్శానికి, నీచపు స్వార్ధానికి మధ్య జరుగుతున్న పోరాటాన్ని చిత్రించాలి. జ్ఞాన జ్యోతిని వెలిగించి, ఉద్యమాల వెలుగుల్ని నలుదిశలా వ్యాపింప జేయాలి. న్యాయం, సమానత్వం వంటి ఉన్నతాదర్శాలకు కళాకారులు మద్దతివ్వాలి. కొందరు మనుషుల్ని జంతువుల కంటే హీనంగా చాకిరీ చేయించే ఈ వ్యవస్థను మార్చే కళల్ని సృష్టించాలి. ఈ మార్గంలో నడిస్తేనే కళాహృదయానికి సార్థకత. లేదంటే కళాకారులు కిరాయి నిపుణులుగా మారిపోతారు.

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు, అన్ని వృత్తుల వారికీ సోషలిస్టు మార్గంలోకి రమ్మని విప్లవ సందేశం వినిపిస్తాడు క్రొపాట్కిన్. భూస్వామ్య – పెట్టుబడిదారీ శక్తులపై విజయమే అందరి లక్ష్యం కావాలంటాడు. ఆఖరు మాటగా ఇలా చెపుతాడు "ఎవరి దగ్గర జ్ఞానం, వక్తృత్వం, యోగ్యత, కష్టించే తత్వాలు ఉన్నాయో, వాళ్ళంతా లేచిరండి. మీ స్నేహి తుల్ని కూడా ఈ న్యాయపక్షానికి తీసుకురండి. కానీ మీరంతా ఒక్క విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. మహానాయకునిలాగా కాక, స్నేహితుని వలే రంగంలోకి దూకండి. ఇది అధికారం కాదు. ఉదాత్త బాధ్యత. ఓ ధనవంతులారా! మీ జీవితాల్లోని అశాంతిని, ద్వంద్వత్వాన్ని పోగొట్టు కోవాలంటే సోషలిస్టు లతో చేతులు కలపండి. ఓ బీదసాదలారా ! బీదవాళ్ళలో పుట్టి కూడా ఎవడు సోషలిస్టు విప్లవానికి దూరంగా ఉంటాడో, వాడు తన సౌఖ్యం ఎందులో ఉందో కూడా ఎరుగని మూర్ఖుడని చెప్పక తప్పదు. మీదే సోషలిజం. భ్రమలలో నుండి బయటికి రండి. పస్తులు, పేదరికం, యుద్ధాలు, అనారోగ్యం, నీచత్వం, మురికి, అవినీతి, దోపిడి వంటి దుర్గుణాలను అంతమొందించే విప్లవాన్ని ప్రేమించండి."

దుర్మార్గమైన దోపిడిని, అసమానతలను అర్ధం చేసుకోకుండా దానిని వ్యతిరేకించకుండా ఎవరెన్ని మాటలు చెప్పినా, ధర్మ ప్రవచనాల పేరుతో మాయ మాటలు చెప్పినా దండగే. ఈ సత్యాన్నే ప్రిన్స్ క్రొపాట్కిన్ రచించిన " విప్లవ సందేశం పుస్తకం స్పష్టం చేస్తుంది. ఎందరో యువతీ యువకులను, భావుకులను ఎన్నో తరాలుగా ఉత్తేజ పరిచిన గొప్ప పుస్తకం ఇది. కొన్ని దశాబ్దాల తరువాత తెలుగులో మళ్ళీ వెలువడిన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరు చదవాలి.

# చైనా శతాబ్దం

**అతుల్ అనేజా**



రచయిత అంతర్జాతీయ పరిణామాల విశ్లేషకులు

రెండవ ప్రపంచయుద్ధానంతర ఆర్థికాభివృద్ధి క్రమాన్ని పరిశీలిస్తున్న సమకాలీన చరిత్రకారులు 2015, మార్చి 12వ తేదీని వారి క్యాలెండర్లలో తప్పనిసరిగా గుర్తు పెట్టుకుంటారు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ప్రపంచంపై ఆధిపత్యం ఛెలాయించిన పాక్స్ అమెరికానా ఆరోజు దివాళా తీసింది. దాని స్థానంలో బహుళధృవ ప్రపంచం రూపుదిద్దుకుంటున్నది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా(బ్రిక్స్), ఇంకా అనేక దక్షిణ దేశాలతో కలిసి చైనా ఒక ప్రముఖశక్తిగా అభివృద్ధి అవుతున్నది. బ్రిక్స్ దేశాలు, ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులో నూతన భాగస్వాముల మద్దతుతో, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లతో చైనా "పాక్స్ సినికా"గా అవతరించబోతున్నదని వేన్ మాడ్ సన్ స్ట్రాటజిక్ కల్చరల్ ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో పెట్టిన వ్యాసంలో స్పష్టంగా చెప్పాడు. అమెరికన్ శతాబ్దం ప్రారంభమౌతున్నదని టైమ్ పత్రికలో 1941లో హెన్రీలూస్ చెప్పిన అంశాన్ని ఈ పరిణామాలు పక్కకు నెట్టేస్తున్నాయి.

చర్చిల్ తర్వాత కాలంలో అమెరికాకు అత్యంత విశ్వాసపాత్రంగా వ్యవహరిస్తున్న బ్రిటన్ చైనా నాయకత్వంలోని ఎఐఐబిలో చేరాలన్న అశ్చర్యకరమైన నిర్ణయం తీసుకున్న తర్వాత, మాడిసన్ ఎటువంటి సందేహానికి తావులేకుండా ఈ నిర్ణయానికి వచ్చాడు. ఇందుకు వాషింగ్టన్ నుండి తీవ్రస్థాయిలో స్పందన ఉంటుందని తెలిసినప్పటికీ, బ్రిటిష్ ఖజానా ఛాన్సలర్ జార్జి వోస్‌బర్న్, టోరీల నాయకత్వం తమ ఆత్మగౌరవాన్ని వదులుకోనప్పటికీ, అప్పటి వరకు ఉన్న పసలేని ఆలోచనలను పక్కనపెట్టి, బ్రిటన్ భవిష్యత్తు వాషింగ్టన్‌తో, వాల్‌స్ట్రీట్‌తో ముడిపడిలేదనే నిర్ణయానికి వచ్చారు. దానికి బదులుగా షాంఘై, షెన్‌జెన్, హాంగ్‌కాంగ్, బీజింగ్‌లు వారిని ఆకర్షించాయి. బ్రిటన్‌లో చావుబతుకుల పోరాటంలో ఉన్న కంపెనీలను, సేవల రంగాన్ని యూరేషియా కారిడార్‌లో జరుగుతున్న అభివృద్ధి, ఫలితంగా వచ్చే లాభాల నుండి వెనక్కి మళ్ళించటం అసాధ్యం.

2008 సంవత్సరంలో వచ్చిన తీవ్రమైన ద్రవ్య సంక్షోభం నుండి బయటపడటంలో పశ్చిమదేశాలు విఫలం కావటం బ్రిటన్ తూర్పువైపుకు చూడటంలో నిర్ణాయకమైన పాత్ర వహించింది. జర్మనీని మినహాయిస్తే మిగతా యూరప్ దివాళాతీసే పరిస్థితిలో ఉంది. అమెరికా ప్రస్తుత సంక్షోభం నుండి బయటపడి, ప్రపంచ పరిణామాలను శాసించగలిగేస్థాయిలో ఆర్థికాభివృద్ధిని సాధించగలదని భజనపరులు ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేస్తున్న కట్టుకథలు బట్టబయలవుతున్నాయి.

**నూతన భావాలతో చైనా పురోగమనం**

ఇందుకు భిన్నంగా చైనా అధునాతన భావాలు, నూతన ఆవిష్కరణలతో దూసుకు పోతున్నది. కాలుష్యరహిత విద్యుత్, ఎలక్ట్రిక్ కార్లు, ఇంటర్నెట్ వినియోగం, ఈ కామర్స్, పెద్దసంఖ్యలో నూతన ఆవిష్కరణలతోపాటు పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని సాధిస్తున్నది. సిలికాన్ వ్యాలి సమీప భవిష్యత్‌లో కనుమరుగయే పరిస్థితి లేనప్పటికీ, షెన్‌జెన్ అత్యంత వేగంగా నూతన ఆవిష్కరణల కేంద్రంగా రూపొందుతున్నది. షెన్‌జెన్‌లోని పారిశ్రామికాభివృద్ధి తృష్ణను గార్డియన్ పత్రిక 2014లోనే అర్థం చేసుకున్నది. "బయటి నుండి చూసేవారికి కోటి యాభైలక్షల మంది వరకు నివసిస్తున్న ఈ నగరం అభివృద్ధి చైనాలో అస్తవ్యస్తంగా ఉన్న ఇతర మెట్రోపాలిటన్ నగరాలలో ఉన్నట్లుగానే అనిపిస్తుంది. కాని ప్రపంచస్థాయిలో ఉన్న నూతన ఆవిష్కరణలు చేసే (హ్యాకర్స్) నిపుణులకు, పారిశ్రామిక వేత్తలకు ఇది అంతిమ సాంకేతిక లక్ష్యంగా ఉన్నది. అద్భుతమైన, వైవిధ్యంతో కూడిన అవకాశాలు, సృజనాత్మకమైన అన్వేషణలకు ఈ నగరం నిలయంగా ఉన్నది" అని రాసింది.

చైనా మొత్తంగానే తక్కువ ఖర్చుతో సరుకులు ఉత్పత్తిచేసే ప్రపంచ ఉత్పత్తిదారు స్థానం నుండి, తక్కువ కార్బన్‌లను విడుదల చేసే, నూతన సాంకేతికావిష్కరణలను చేసే ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి కావటానికి, "మధ్య తరగతి ఆదాయ పరిధి" కి దారితీసిన ఆర్థిక స్థంభన నుండి బయటపడటానికి ప్రయత్నం చేస్తున్నది. ఈ క్రమంలోనే చైనావారు షెన్‌జెన్ నగరాన్ని మరింత క్రమబద్ధీకరించబడిన నగరంగా తీర్చిదిద్దటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. చైనా చంద్రయానం కార్యక్రమానికి నాయకత్వం వహించిన మా జింగ్యూను మార్చి చివరిలో నగర పార్టి నాయకునిగా నియమించారు. హాంగ్‌కాంగ్ నుండి వెలువడే సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక " ఆచరణవాది, స్వేచ్ఛగా ఆలోచించే ఈ సంస్కరణవాది నగరాన్ని ప్రపంచ నూతన ఆవిష్కరణల కేంద్రంగా రూపొందిస్తాడని" వర్ణించింది. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచాన్ని తలదన్నే విధంగా షెన్‌జెన్ నగరాన్ని రూపొందించటానికి తీవ్రంగా ఆలోచించే ఒకగ్రూపు అక్కడ ఉన్నది. 1978లో డెంగ్ జియావో పింగ్ సంస్కరణలకు ప్రారంభకేంద్రం, చైనా డిజిటల్ రాజధాని అయిన షెన్‌జెన్ ఉన్నత సాంకేతిక నైపుణ్యంకల సంస్థలకు కేంద్రంగా ఉన్నది. వెబ్‌సైట్‌లలో పెద్దసంస్థగా ఉన్న టెన్‌సెంట్, టెలికాం స్టార్ హువాయి, డ్రోన్‌లు తయారుచేసే డిజెఐ, స్మార్ట్‌ఫోన్‌ల తయారీలో ప్రముఖసంస్థగా ఉన్న ఒన్‌ప్లస్‌లు ఈ లిస్టులో ఉన్నాయి.

ప్రపంచస్థాయికి వినియోగాన్ని పెంచుకోవటం, నూతన ఆవిష్కరణల ప్రాతిపదికపై తమ ఆర్థికవ్యవస్థను ప్రపంచస్థాయి ఆర్థికవ్యవస్థగా తిరిగి పట్టాలెక్కించాలని ప్రయత్నిస్తున్న, ఆచరణాత్మకంగా వ్యవహరించే చైనీయులు ఉన్నతమైన నూతన ఆలోచనలు ఎక్కడి నుండి వచ్చినా వాటికోసం ఆరాటపడుతున్నారు. "ఎలుకలను పడుతున్నంత వరకు పిల్లి తెల్లదా నల్లదా అన్నది ప్రశ్నకాదు" అన్న డెంగ్ సిద్ధాంతాన్ని గౌరవిస్తూ దావోస్ తరహాలో, దక్షిణ చైనాలోని ఆహ్లాదకరంగా ఉండే హైనాన్ దీవిలోని బావోలో మార్చిలో జరిగిన ఆసియా

“బ్రిటన్ ఈ ఆంక్షలను తెంచుకోగానే యూరప్‌లోని ముఖ్యదేశాలైన జర్మని, ఫ్రాన్స్, ఇటలీలు కూడా అమెరికాను వదిలి ఎఐఐబి గ్రూపులోకి చేరిపోయాయి. ఆ తర్వాత స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, డెన్‌మార్క్‌లు కూడా చేరాయి. ఎఐఐబిలో వ్యవస్థాపక సభ్యులుగా చేరటానికి మార్చి 31ని చివరితేదీగా నిర్ణయించటంతో, ఆస్ట్రేలియా, దక్షిణకొరియాలు కూడా ఎఐఐబిలో చేరతామని ప్రకటించటంతో, ఈ విషయంలో యుద్ధానంతర పశ్చిమ దేశాల కూటమిలోని పసిఫిక్ విభాగం విచ్ఛిన్నమైపోయింది.”

ఫోరం వార్షిక సమావేశంలో బిల్‌గేట్స్, టెస్లా ఎలక్ట్రిక్‌కారు రూపొందించిన ఎలాన్ మస్క్‌లను ప్రముఖ అతిథులుగా ఆహ్వానించారు. ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్ బైదు సహ సంస్థాపకులైన రాబిన్‌లీ “చైనా మేధస్సు” ప్రాజెక్టును గురించి ప్రతిపాదిస్తూ, అది ఆటోమేటిక్ డ్రైవింగ్, ఉన్నతమైన నూతన డ్రోన్‌లు, మరమనుషులను(రోబోట్స్) తయారు చేయటం, అతి విస్తారమైన సమాచారాన్ని విశ్లేషణ చేయటం, మనుష్యులు-యంత్రాల మధ్య పరస్పర ప్రతిస్పందనలు తదితర ప్రత్యేకరంగాలపై కేంద్రీకరించాలని చెప్పారు.

ఎఐఐబితో కలిపి వివిధ రకాలైన నూతన బ్యాంకులు నిధులను వెచ్చిస్తున్న, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ప్రత్యేకంగా కేంద్రీకరించి అమలుచేయబూనుకున్న సిల్క్‌రోడ్ ప్రాజెక్టులో వివిధ పథకాలకు ఉన్న విస్తారమైన అవకాశాలను ఎట్టి పరిస్థితులలోనూ కోల్పోరాదని బ్రిటన్ భావిస్తున్నది. అహంకారంతో వ్యవహరిస్తున్న అమెరికాకు ఇది ఆగ్రహం కలిగించినప్పటికీ బ్రిటన్ ఈ నిర్ణయం తీసుకున్నది. బ్రిటన్ ఈ ఆంక్షలను తెంచుకోగానే యూరప్‌లోని ముఖ్యదేశాలైన జర్మని, ఫ్రాన్స్, ఇటలీలు కూడా అమెరికాను వదిలి ఎఐఐబి గ్రూపులోకి చేరిపోయాయి. ఆ తర్వాత స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, డెన్‌మార్క్‌లు కూడా చేరాయి. ఎఐఐబిలో వ్యవస్థాపక సభ్యులుగా చేరటానికి మార్చి 31ని చివరితేదీగా నిర్ణయించటంతో, ఆస్ట్రేలియా, దక్షిణకొరియాలు కూడా ఎఐఐబిలో చేరతామని ప్రకటించటంతో, ఈ విషయంలో యుద్ధానంతర పశ్చిమ దేశాల కూటమిలోని పసిఫిక్ విభాగం విచ్ఛిన్నమైపోయింది.

తనతో ఉన్న గ్రూపు విచ్ఛిన్నమైపోగానే అమెరికా తన ఆగ్రహాన్ని తనలోనే అణచుకోవటానికి ప్రయత్నించింది. బ్రిటన్ ఎఐఐబిలో చేరాలని ప్రకటించిన తర్వాత పేరు చెప్పని అమెరికా అధికారి ఒకరు “ఆర్థికశక్తిగా ఎదుగుతున్న చైనాకు అన్నింటిలోనూ నిరంతరం స్థానం కల్పించే ధోరణి పట్ల మనం జాగ్రత్తగా ఉండాలని” బ్రిటన్‌కు నీతులు చెప్పే ప్రయత్నం చేశాడు.

వేగంగా మారుతున్న ప్రపంచంలోని వాస్తవాలతో అమెరికా రాజీపడలేకపోతున్నదని చాలామంది భావిస్తున్నారు. ఏకధృవ ప్రపంచంలోని ఆర్థిక, భౌగోళిక, రాజకీయశక్తి అయిన అమెరికా వేగంగా క్షీణిస్తున్న పరిస్థితులలో కాలం చెల్లిన విధానాలను పట్టుకుని వేలాడుతున్నదని ఫైనాన్షియల్ టైమ్స్ రాసింది. “చైనా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతున్నది. అది ప్రపంచ ద్రవ్య వ్యవస్థలో కూడా విడదీయరాని భాగంగా ఉంటున్నది. చైనా ప్రాంతీయంగా బలపడటం ఆసియాలో అనివార్యంగా అమెరికా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని భావించటం తప్పుడు విధానమే కాక అచారిత్రకం” అని ఆ వార్తలో రాశారు. “చైనాను తన పెరటిలోనే జూనియర్ భాగస్వామిగా చూసే విధానాన్ని అమెరికా వదులుకోవటం మంచిది. అందుకు బదులుగా రాజకీయ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకొని, దేశీయ మిగులు నిధులను ప్రపంచవ్యాపితంగా పెట్టుబడులు పెడుతూ, అధిక విలువగల సరుకులను ఉత్పత్తి చేసే రంగాలలోకి పెట్టుబడులను ప్రవహింపజేయాలి. ఆసియా అభివృద్ధిలో చైనా ప్రాముఖ్యతను గుర్తించాలి.

“మేము ఈ శతాబ్దం ప్రారంభంలో శాశ్వతంగా ఉండే ఏకధృవ ప్రపంచంలో కేంద్ర స్థానంలో ఉండగలమనే నమ్మకంతో ఉన్నాం. అది వాస్తవం కాదని స్పష్టమైంది. చారిత్రకంగా మేము ఎదుర్కొన్న శత్రువుల కన్నా చైనా ఒక కీలకమైన అంశంలో భిన్నమైనది. చైనా వ్యూహాత్మక లక్ష్యాలు ఆర్థికాంశాలతో ముడిపడి ఉండటంతో పాటు అంతర్గతంగా ఆర్థిక, సామాజిక సుస్థిరతను కాపాడుకోవాలనే ఆకాంక్షతో ఉన్నది” అని అమెరికన్ అధికారులు చెపుతున్నారు.

### తూర్పుదిశగా మార్పు

ఎఐఐబిలో సభ్యత్వం కోసం 46 దరఖాస్తులు రావటంతో ప్రపంచ ఆర్థికాధిపత్యం తూర్పువైపుకు మారుతున్నదని చైనీయులు స్పష్టంగా తెలుసుకున్నారు. అయినప్పటికీ చైనా ప్రభుత్వ అధికార పత్రిక సిన్హువాలో విజయం సాధించామనే భావాలుగాని, జాత్యహంకారాన్ని రెచ్చగొట్టే ధోరణులుగానీ కనిపించలేదు. ఎఐఐబిని ఏర్పాటు చేయటానికి తీసుకున్న చొరవను సానుకూలంగా ఆదరించటానికి చైనీయులు మూడు తక్షణ కారణాలు చెబుతున్నారు. ఎఐఐబి సంస్థాపక సభ్యత్వం కోసం ప్రపంచ వ్యాపితంగా క్యూ కట్టినట్లుగా దరఖాస్తులు రావటం “నూతన ఆర్థిక క్రమం” ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేస్తున్నదనేది మొదటి కారణంగా చెపుతున్నారు.

“ఎఐఐబిలో పెరుగుతున్న భాగస్వామ్యం అంతర్జాతీయ వ్యవహారాలలో చైనా ఆధిపత్య పెరుగుదలకు సాక్ష్యమని” సిన్హువా వ్యాఖ్యానించింది. మరింత సమతూకంతో, పరస్పర లాభదాయకమైన, సమ్మిళిత అభివృద్ధితో కూడిన అంతర్జాతీయ ఆర్థిక క్రమం కోసం ప్రపంచం ఓటు చేసిందని పెద్దసంఖ్యలో దరఖాస్తులు రావటం స్పష్టం చేస్తున్నదని” అది చెప్పింది.

ద్రవ్య సమస్యలలో కూరుకుపోయిన ఆసియా దేశాలు తమ దేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించటం కోసం 2020వ సంవత్సరం వరకు సంవత్సరానికి 700ల బిలియన్ డాలర్లు కావలసివుంటాయని, ఆ దేశాల అవసరాలను ఈ బ్యాంకు తీర్చగలదనేది రెండవ కారణంగా చెబుతున్నారు. నూతన బాసెల్ నిబంధనల వలన వచ్చే సమస్యలను ఎదుర్కోవటం మరీ వ్యయభరితం కావటంతో మౌలిక సదుపాయాల కల్పన రంగానికి ఒకసారి నిధులిచ్చిన అంతర్జాతీయ బ్యాంకులు తిరిగి రుణాలివ్వటానికి ఆసక్తి కోల్పోవటంతో ఈ రంగానికి నిధులు ఒట్టిపోయాయని ఆ వ్యాసంలో చెప్పారు. పింఛన్ నిధులు, ప్రభుత్వాల వద్దవున్న నిధులు ఈ రంగంలోకి తగినంతగా రావటం లేదు. అనేక దేశాల ప్రభుత్వాలు తమ వద్దవున్న విదేశీ మారకనిధుల నిల్వలను మరింత లాభాలొచ్చే బాండ్లలోనూ, షేర్లలోనూ పెట్టుబడులుగా పెడుతున్నారు.”

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐయంయఫ్)లో సంస్కరణలను అమెరికా అడ్డుకోవటం మూడవ కారణం. సంస్కరణలు అమలు జరిగితే మరిన్ని నిధులను కోటా ప్రకారం పంపిణీ చేయటానికి అవకాశం ఉండేది. “బ్రెటన్ ఉడ్స్ సంస్థలలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకనుగుణంగా ఎక్కువ వాటాను కేటాయించటానికి జరిగిన అనేక ప్రయత్నాలను నిరోధించటం జరిగింది.”

ఆసియాలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయటం అత్యున్నత సాంకేతిక

పరిజ్ఞానం కలిగిన అభివృద్ధి చెందిన దేశాల పెట్టుబడులకు, వాణిజ్యానికి అపార అవకాశాలను కల్పిస్తుందని చైనా గట్టిగా వాదిస్తున్నది.


**విలువ కోల్పోతున్న ఆసియాకు ప్రాధాన్యత (పైవోట్ టు ఆసియా) నినాదం**

అట్లాంటిక్ కూటమిలోని ముఖ్యదేశాలు అమెరికాను వదులుకోవటానికి, ఎఐఐబిలో చేరటానికి నిర్ణయం తీసుకోవటం "ఆసియాకు ప్రాధాన్యతనివ్వటం" లేక "బలాబలాల సమతూకాన్ని తిరిగి మార్చటం" అనే వ్యూహాన్ని ముందుకు సాగకుండా నిరోధించింది. ఆసియాకు ప్రాధాన్యత నివ్వటం అనే అంశం– చైనాను నిరోధించే విధానంలో సైనికంగా చివరి అంశమని బీజింగ్ భావిస్తున్నది– అమెరికా పసిఫిక్ కమాండ్‌ను బలపరచుకోవటానికి దారితీస్తుంది. ఒకసారి ప్రాధాన్యత అనే అంశం అమలు ప్రారంభమైతే మొత్తం అమెరికా సైన్యంలోని 60 శాతం ఆ పరిధిలోకి వస్తుంది. అమెరికా పసిఫిక్ కమాండ్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉన్న 3, 60, 000 సైన్యం చైనా ఆందోళనకు కారణం అవుతున్నది. వీరితోపాటు 200 యుద్ధనౌకలు ఉన్నాయి. వీటిలో ఐదు ఎదురుదాడి చేయగల విమానవాహక నౌకాగ్రూపులున్నవి. చైనా, ఉత్తరకొరియాలను ప్రధాన లక్ష్యాలుగా చేసుకొని అమెరికా ఈ ప్రాంతంలో అధికారం ఛలాయించటానికి ప్రయత్నిస్తున్నది. ఈ ప్రాంతంలో బలాబలాల సమతూకాన్ని మార్చే సిద్ధాంతంలో భాగంగా దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, జపాన్‌లలో అమెరికా బలగాలను పెంచాలి. మలక్కా జల సంధికి దగ్గరగా ఉన్న సింగపూర్ లాంటి దేశాల సైనికపాత్రను మరింత పెంచాల్సివుంటుంది.

కాని దక్షిణకొరియా, సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియాలు ఇప్పటికే ఎఐఐబిలో భాగస్వాములై చైనా ఆర్థికాభివృద్ధితో తమ భవిష్యత్‌ను ముడివేసుకొన్న స్థితిలో, చైనాను నిరోధించటంలో ముందుండాలనే విధానం క్రమంగా బలహీనపడిపోతున్నది.

అట్లాంటిక్ కూటమి, దాని అనుబంధ సంస్థలు బీటలు వారటం స్పష్టంగా కనిపిస్తున్న స్థితిలో అమెరికా నాయకత్వంలో రూపొందుతున్న ట్రాన్స్ పసిఫిక్ కూటమి (టిపిపి) ప్రాధాన్యతకు సంబంధించి కొత్త ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. బలాబలాల సమతూకాన్ని మార్చటం యొక్క ఆర్థిక విభాగంగా టిపిపిలో చైనాను మినహాయించి ఈ ప్రాంతంలోని ప్రధాన దేశాలైన జపాన్, ఆస్ట్రేలియా, వియ త్నాం, సింగపూర్, మలేషియా, కెనడాలాంటి 12 దేశాలతో ఉన్నతస్థాయి స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని భావించారు. కాని గత సంవత్సరం బీజింగ్‌లో జరిగిన ఆసియా–పసిఫిక్ ఎకనామిక్ కో ఆపరేషన్ (అపెక్) శిఖరాగ్ర సమావేశంలో ఈ గ్రూపు చైనా ప్రతిపాదించిన ఫ్రీట్రేడ్ ఏరియా ఆఫ్ ఆసియా–పసిఫిక్ (యఫ్‌టిఎఎపి)కి మద్దత్తునిచ్చింది. అనేక ఆంక్షలతో ఉన్న టిపిపి కన్నా చైనా ప్రతిపాదన మరింత స్వేచ్ఛనిస్తూ, అందరిని కలుపుకెళ్ళేదిగా ఉంది. రూపుదిద్దుకుంటున్న బహుళ ధృవ ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలతో ఆర్థిక, రాజకీయ అధికారాన్ని పంచుకోవటంలో ఇప్పటికీ విఫలమైన అమెరికాకు ఎఐఐబి వాస్తవరూపం దాల్చటం కోలుకోలేని దెబ్బగా పరిణమించింది. అత్యధికంగా అమ్ముడుపోయిన 'వెన్ చైనా రూల్డ్ ది వరల్డ్' పుస్తక రచయిత మార్టిన్ జాక్వెస్ ఆర్థికాధికారం అభివృద్ధి చెందిన దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మారేక్రమంతో అమెరికా సర్దుకుపోలేక పోతున్నదని గ్లోబల్ టైమ్స్‌లో రాశాడు.

> **"ఎఐఐబిలో సభ్యత్వం కోసం 46 దరఖాస్తులు రావటంతో ప్రపంచ ఆర్థికాధిపత్యం తూర్పువైపుకు మారుతున్నదని చైనీయులు స్పష్టంగా తెలుసుకున్నారు. అయినప్పటికీ చైనా ప్రభుత్వ అధికార పత్రిక సిన్హువాలో విజయం సాధించామనే భావాలుగాని, జాత్యహంకారాన్ని రెచ్చగొట్టే ధోరణులుగానీ కనిపించలేదు."**


చైనాలోని షెన్‌జెన్ నగరం

**సందేహ వలయంలో క్షీణిస్తున్నశక్తి**

1990ల నుండి తూర్పు ఆసియాలో అమెరికా ఆర్థికశక్తి క్షీణిస్తున్నది. ఉదాహరణకు వాణిజ్యపరంగా చూసినట్లయితే అమెరికా, చైనాల స్థానాలు మారిపోయాయి. ఒకప్పుడు అమెరికా ఉన్న స్థానాన్ని ఇపుడు చైనా ఆక్రమించింది. పశ్చిమదేశాల మద్దత్తుతో నడుస్తున్న ఐయమ్‌యఫ్, ప్రపంచబ్యాంకు లాంటి సంస్థలలో సంస్కరణలను అమలు జరిపి, చైనాలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిర్ణయాలు చేయటంలో తగినస్థానం కల్పించటానికి అమెరికా కాంగ్రెస్ ఆటంకంగా తయారైందని ఆయన చెప్పాడు. ఆ తర్వాత జాక్వెస్ " తాను చెప్పిన క్షీణిస్తున్న ఆర్థికశక్తి యొక్క సందిగ్ధస్థితి" అన్న అంశాన్ని వివరించాడు. "1945 తర్వాత అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థలో ముఖ్యపాత్ర వహించిన రెండు ప్రధాన సంస్థలైన అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకుల ఆధిపత్యాన్ని కాపాడాలని అమెరికా ప్రయత్నిస్తున్నది. అవి పశ్చిమదేశాలు, ముఖ్యంగా అమెరికా ఏర్పాటు చేసిన సంస్థలుగా ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా ఆకర్షించేస్థితి అభివృద్ధి చెందిన దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలిపోతున్న క్రమంలో అవి కాలం చెల్లిన సంస్థలుగా మారిపోయేస్థితిని ఎదుర్కొంటున్నాయి. అవి బతికిబట్టకట్టాలంటే తమనుతాము సంస్కరించు కోవాలి. పశ్చిమదేశాల జేబుసంస్థలుగా కాకుం డా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధులుగా ఉండాలి. ఆ సంస్థలపై ఆధిపత్యాన్ని కోల్పోకుం డా ఈ మార్పులను ఎలా చేయాలనేదే అమెరికా ఎదుర్కొంటున్న సందిగ్ధస్థితి."

చైనా ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న ఎఐఐబి లాంటి సంస్థలలో చేరటానికి అమెరికా తిరస్కరిస్తుంటే అది మరింత ఒంటరిపాటవు తుందని జాక్వెస్ సరిగానే ముగించాడు. రోజులు గడుస్తున్నకొద్దీ ఎఐఐబి లాంటి సంస్థలు మరిన్ని ఏర్పాటవుతూ ఉంటాయి. ఆ క్రమంలో పాత సంస్థలకు కాలంతీరి క్షీణించిపోతాయి.

# దురభిమానాన్ని రెచ్చగొట్టడం ద్వారా పాలకవర్గాలు ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తాయి

## సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

గౌరవనీయులు రాఘవులుగారికి

తమిళర్ మున్నేట్రపడై నాయకులు, కార్యకర్తలు తమిళనాడులో ఇతర భాషల నేతల విగ్రహాలను తొలగించవలసిందేనని ఆందోళన చేస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం శ్రీలంక తమిళర్ (ఎల్‌టిటిఇ) నాయకుడు ప్రభాకర్ విగ్రహాన్ని చెన్నైలో పెట్టుకొన్నది. అలాగే నాగపట్నం జిల్లా నల్లూరులో పెట్టుకొన్న ప్రభాకర్ విగ్రహాన్ని పోలీసు బలగంతో తొలగించింది. ఈ చర్యకు ప్రతిచర్యగా చెన్నైలో ఉన్న నటుడు శోభన్‌బాబు విగ్రహాన్ని తొలగించమని కోరుతూ విధ్వంసానికి దిగారు. తమిళర్ మున్నేట్ర పడైకి వ్యతిరేకంగా వెంటనే తెలుగు యువశక్తి నాయకులు, స్టేట్ శోభన్ సిండికేట్ ప్రెసిడెంట్ తీవ్రంగా ఖండించారు. ఇంతకు ముందున్న తమిళనాడు ప్రాంతీయ తమిళపార్టీలు 'ద్రవిడ మున్నేట్రం' అనే పేరు పార్టీలకు పెట్టుకొన్నారు. కాని యీ పార్టీ భాష పేరుతో పార్టీ పేరు పెట్టుకొన్నది. అందుకే యిది ఇతర భాషల నేతల విగ్రహాలను తొలగించమని ఆందోళన చేస్తున్నది. ఈ నినాదం వెనుక విడిపోయి, బలహీనపడిన తెలుగు వారిపై గురిపెట్టినట్లుగా అనిపిస్తున్నది. మీరేమంటారు?

– ఇలిపిళ్ళ సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ

**జవాబు :** తమిళనాడులో జాతి దురభిమానానికి, భాషా దురభిమానానికి గత చరిత్ర ఉంది. గతంలో కేంద్ర ప్రభుత్వం హిందీని జాతీయ భాష పేరుతో నిర్బంధం చేయాలనుకున్నప్పుడు తమిళనాడులో పెద్ద స్థాయిలో 'హిందీ వ్యతిరేక ఉద్యమం' జరిగిన విషయం మనకు తెలుసు. హిందీ వ్యతిరేకత పెరియార్ కాలంలోనే మనం చూస్తాం. సాధారణ పరిస్థితులలో మాతృభాషాభిమానంతో ఉండే ప్రజాచైతన్యాన్ని స్వార్థపర రాజకీయ శక్తులు దుర్వినియోగం చేసి భావోద్వేగాలను రెచ్చగొట్టి వినియోగించుకోవడం తమిళనాడులో జరుగుతున్నది. శ్రీలంక తమిళుల సమస్య మీద ఛాందస స్థాయికి చేరిన జాతి దురభిమానమే ఎల్‌టిటిఇ చేసిన రాజీవ్‌గాంధీ హత్యను కూడా హర్షించే స్థాయికి కొంత మందిని తెచ్చింది. ఎల్‌టిటిఇ నేత ప్రభాకరన్ విగ్రహాన్ని ఆరాధించే వారిని కూడా సృష్టించింది. ఈ వికృతస్థితిని జాతి, భాష దురాభిమానులలోనే కాక మతతత్వవాదులలోనూ మనం చూడవచ్చు. గాంధీని హత్యచేసిన గాడ్సేని కొనియాడి పూజించే స్థితికి కొంత మంది వచ్చారంటే దురభిమానం మానవత్వాన్ని ఎంత వికృత పరుస్తుందో చూడవచ్చు. దురభిమానం అనేది ఏదో ఒక్క అంశంపైనే ఏర్పడుతుంది అనుకోకూడదు. భాషా, జాతి, మతం, కులం, తెగ, ప్రాంతం – ఇలా ఏ అంశంపైనైనా దురభిమానాలు చెలరేగవచ్చు. ముఖ్యంగా పాలకుల విధానాలపై ప్రజలలో అసంతృప్తి తీవ్రంగా పెరిగినప్పుడు ప్రజలు ఐక్యమై పోరాడకుండా పాలకులు, దురభిమానాన్ని రెచ్చగొట్టి ప్రజలను నిట్టనిలువునా చీలుస్తారు. ప్రజలందరూ ఒకే భాషకు చెందినవారైతే మరో అంశాన్ని ముందుకు తీసుకువచ్చి ప్రజలను అనైక్యపరుస్తారు. తెలుగు ప్రజలు అంతా ఒకటైనా ప్రాంతాన్ని ముందుకు తీసుకువచ్చి ఐక్యతను దెబ్బతీశారు. తమిళనాడు పాలనాయంత్రాంగం పరాయిదేశస్తుడు ప్రభాకరన్ విగ్రహాన్ని తొలగించినప్పుడు, పరాయిభాష వాడైన శోభన్‌బాబు విగ్రహాన్ని ఎందుకు తొలగించకూడదన్న వాదనతోనే విధ్వంసం జరిగింది.

ఒకే మతం ఉన్న పాకిస్థాన్‌లో, ఇతర పశ్చిమా సియా దేశాల్లో మత ఉపశాఖల మధ్య ఈ రోజు మారణకాండ జరుగుతున్నది. అందువలన దురహంకారాన్ని రెచ్చగొట్టాలనుకున్నప్పుడు సందర్భాన్ని బట్టి పాలకులు ఏ అంశాన్నైనా వినియోగించుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ దురాభిమానాలు ముందుకు రావడం అదేదో ప్రత్యేకమైన అంశమనుకోరాదు. ప్రపంచంలో అనేక దేశాల్లో జరుగుతున్న ప్రజల ఐక్యతను దెబ్బతీసే విచ్ఛిన్నకర ఉద్యమాల యొక్క ఒక సందర్భం మాత్రమే. సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రపంచవ్యాపితంగా జరుగుతున్న పరిణామంలో ఇది అంతర్భాగం. ఒకొక్క దేశంలో, ఒకొక్క రాష్ట్రంలో, ఒకొక్క ప్రాంతంలో ఈ పరిణామం యొక్క వ్యక్తీకరణ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేకంగా ఉండవచ్చు. కానీ వాటన్నింటి అంతఃసారం ఒక్కటే.

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చిం చాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

గమనిక

1) జూన్ సంచికలో ప్రచురించిన 'ఎరిక్స్ హాబ్స్ బామ్' రాసిన 'ఈనాటికీ తరగని మార్క్స్ ప్రాధాన్యత' వ్యాసాన్ని ఆంగ్లంనుండి తెలుగులోనికి అనువదించినవారు తెలకపల్లి రవి.

2) జూన్ సంచికలో ప్రచురించిన ఎన్. రామ్ రచించిన 'అంబేద్కర్ వారసత్వం' వ్యాసంలో అంబేద్కర్ జన్మించిన సంవత్సరం 1891కు బదులుగా 1871 అని ప్రచురించబడింది. పొరపాటును గమనించగలరు.

# పర్స సత్యనారాయణ

(2వ పేజీతరువాయి)

దీంతో కార్మికులను యాజమాన్యం వేధింపులకు గురిచేసేది. అనేకమంది కార్మికులు యాజ మాన్యం చేతిలో దెబ్బలు తిన్నారు. అయినా యూనియన్ కార్యక్రమాలు ఆగలేదు.

ఈ నేపథ్యంలోనే 'పర్స' ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లోనూ పాల్గొన్నారు. 1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభకూ ఆయన వెళ్లారు. ఆ మరుసటి సంవత్సరమే రెండో ప్రపంచ యుద్ధం ముగిసి, కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగడంతో సింగరేణిలో యూనియన్ కార్యక్రమాలు బహిరంగంగానే నిర్వహించడం ప్రారంభిం చారు. 1945 జూన్ 16న కొత్తగూడేనికి రెండు కిలోమీటర్ల దూరంలోని హేమచంద్రపురం వద్ద ఓ పాఠశాలలో యూనియన్ ఏర్పడింది. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా శేషగిరిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.చలపతిరావు (ఆ తరువాత కాలంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడయ్యారు), కమిటీ సభ్యుడుగా 'పర్స' ఎన్నికయ్యారు. సంస్థలో ఇన్నాళ్లూ యూనియన్ నడుపుతున్న కీలక వ్యక్తులు వీరేనని యాజమాన్యం అప్పుడు గుర్తించింది.


సింగరేణిలో యూనియన్ కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ యాజమాన్యం చూపు 'పర్స'పై పడింది. యూనియన్ ఆఫీసులో చేయాల్సిన పనిని కంపెనీలో చేస్తున్నావంటూ అభియోగం మోపి 'పర్స'ను పని నుంచి తొలగించారు. దీంతో కంపెనీలో పెద్ద అలజడి నెలకొంది. ఆయనను తిరిగి పనిలోకి తీసుకోవాలని నాలుగైదు వేల మంది కొత్తగూడెంలోని కంపెనీ హెడ్డాఫీసు ముందు బైఠాయించారు. ఆంధ్ర మహాసభ జిల్లా నాయకులైన సర్వదేవభట్ల రామనాథం, చిర్రావూరి లక్ష్మీనరసయ్య, కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ స్టేట్ సెక్రటరీ పెరవలి వెంకట రమణయ్య, నాయకుడు రావెళ్ల జానకి రామయ్య, 'పర్స' ఆ ఆందోళనలో పాల్గొన్నారు. వేలాది మంది కార్మికులు కంపెనీ ఆఫీసు ముట్టడించడంతో యాజమాన్యం దిగొచ్చింది. పర్స సత్యనారాయణను ఉ ద్యోగంలోకి తీసుకుంటున్నామని ప్రకటించారు. ఇది యూనియన్ సాధించిన మొదటి విజయం. ఆ తర్వాత యాజమాన్యం యూనియన్‌ను గుర్తిం చింది. యూనియన్ కార్యాలయం నిర్మించుకో వడానికి స్థలాన్నీ ఇచ్చింది. ఆ స్థలంలోనే 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్' (ఏఐటియుసి) కార్యాలయం నిర్మాణమైంది. అది నేటికీ ఉంది. ఆఫీసు పని నిమిత్తం 'పర్స'ను ఉ ద్యోగానికి రాజీనామా చేయాలని యూనియన్ ఆదేశించింది. అలా ఆయన యూనియన్ బాధ్యతలు చేపట్టారు. ఆ ఏడే భారతీదేవితో ఆయన వివాహం జరిగింది.

మరో వైపు తెలంగాణాలో రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం ఉధృతమైంది. దీంతో కమ్యూనిస్టు అయిన శేషగిరిరావు దళాల్లో పనిచేయాల్సి వచ్చింది. సింగరేణి యూనియన్ నాయకులతో ఆయనకు సంబంధాలు తెగి పోయాయి. ఆయన ఆచూకీ తెలుసుకునేం దుకు రహస్యంగా విజయవాడ వెళ్లి, జాడ తెలియక తిరిగి వస్తున్న 'పర్స'ను పోలీసులు కొత్తగూడెం ప్రాంతంలో అరెస్టు చేశారు. 1947 డిసెం బరులో అరెస్టయిన 'పర్స' 49 మార్చిలో ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకున్నారు. గుంటూరు జిల్లా కాజ గ్రామానికి చేరుకుని సింహాద్రి శివారెడ్డి ద్వారా మూడు నెలలపాటు అజ్ఞాతంగా గడిపారు. అక్కణ్నుంచి తెలంగాణా అటవీ ప్రాంతానికి వెళ్లి 'పర్స' దళాల్లో పని చేయడానికి వీలుగా శివారెడ్డి పార్టీతో సంబం ధాలు పెట్టుకుని ఆయనను అక్కడికి పంపే ఏర్పాటు చేశారు. ఆ ప్రకారం ఆయన వరంగల్ జిల్లా ప్రాంతంలో దళాల్లోకి వెళ్లారు. ఈ క్రమంలోనే ఆయన కొత్తగూడెం వెళ్తూ పెనగడప అనే గ్రామంలో పోలీసులకు పట్టుబడి, చిత్రహింసలకు గురిచేయబడ్డారు. ఓసారి ఆయనను కాల్చి చంపడానికి అన్ని ఏర్పాట్లూ చేసిన పోలీసులు చివరికి మనసు మార్చుకో వడంతో బయటపడ్డారు. ఎట్టకేలకు 'పర్స'ను 1953 జనవరిలో విడుదల చేశారు. ఆ తరువాత ఆయన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)లో ప్రధాన బాధ్య తలు చేపట్టారు. ఈ కాలంలోనే ఆయన పాల్వంచ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని ఆందోళన జరుగుతున్నపుడు, అందుకు మద్దత్తుగా పార్టీ శాసనసభ్యులందరితో పాటు ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు.

సిఐటియు ఆవిర్భావం తరువాత ఆయన రాష్ట్రంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడుగా, అఖిల భారత ఉపాధ్యక్షుడుగా సుదీర్ఘకాలం పనిచేశారు. బిటి రణదివె, పి రామమూర్తి, నండూరి ప్రసాదరావు, ఆర్ ఉమానాథ్ వంటి కార్మికోద్యమ అగ్రనేతల బృందంలో ఆయన పనిచేశారు. 'పర్స' సిఐటియు, కార్మికోద్యమ జాతీయ వేదికలపై ఎన్నో చర్చల్లో పాల్గొన్నారు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకూ పర్యటించి కార్మికులను కర్తవ్యోన్ముఖులను చేస్తూ, ఉమ్మడి రాష్ట్రంలో కార్మికోద్యమాన్ని విస్తృత పరిచేందుకు విశేష కృషి చేశారు. కార్యకర్తలను అభివృద్ధి చేసుకోవడానికి నిర్వహించిన రాజకీయ పాఠశాలల్లో ఎక్కువగా 'రాజకీయ భూగోళం', అప్పుడప్పుడు, 'అంతర్జాతీయ కార్మికోద్యమం', వంటి పాఠాలను బోధించేవారు. పత్రికల్లో వ్యాసాలూ రాసేవారు. తీవ్ర నిర్బంధ కాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తగినంత అల వెన్సు ఉండేది కాదు. ఆ పరిస్థితుల్లో 'పర్స' కుటుంబానికి ఒక పూట తిండి ఉంటే మరోపూట ఉండేది కాదు. ఇంట్లో పరిస్థితిని భారతీదేవి ఎప్పుడూ భర్తకు చెప్పేది కాదు. ఇది తెలియని పర్స తనతోపాటు ఒకరిద్దరిని ఇంటికి భోజనానికి తీసుకొస్తుండేవారు. వచ్చినవారిని ఇబ్బంది పెట్టకుండా దొరికినదానితోనే ఆమె అల్పాహారం చేసి పెట్టేది.

అనారోగ్యంతో మంచంపై ఉన్న కన్నతండ్రి సోడా ఇప్పించమని అడిగినప్పుడు, ఆ చిన్న కోరికను సైతం తీర్చలేకపోయానే అని బేలగా కన్నీళ్ల పర్యంతమయ్యే పర్స, తన ఉద్యమ జీవితంలో ఏనాడూ ఆదర్శాన్ని వీడలేదు. పార్టీ ఇచ్చే కొద్దిపాటి అలవెన్సులో ఆ నెలలో రూపాయి మిగిలినా పార్టీకి తిరిగి అప్పగించేవారు. పాల్వం చ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనకొచ్చే జీతభత్యాలన్నీ పైసలతోసహా పార్టీకి చెల్లించేవారు. మాజీ ఎమ్మెల్యేగా తనకొచ్చే సదుపాయాలనూ వాడుకోలేదు. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులను కేంద్ర ప్రభుత్వం స్వాతం త్ర్య సమరయోధులుగా గుర్తించింది. పార్టీ నాయకత్వ స్థానాల్లో ఉన్నవాళ్లు తామ్రపత్రం స్వీకరించొద్దనీ, ఉచిత ప్రయాణ పాసు, పింఛను, ఇతర సౌకర్యాలను వాడుకోవద్దనీ పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం చేసింది. దీన్ని తన జీవితకాల మంతా తూ.చ. తప్పకుండా ఆచరించారాయన. 2009లో జారి పడినప్పుడు ఆయనకు తుంటిలో పెద్ద ఫ్రాక్చరయింది. ఇతర పార్టీల్లో ఆ స్థాయి నాయకుణ్ని 'నిమ్స్'లో చేర్చేవారు. పార్టీ ఆయనను సాధారణమైన గాంధీ జనరల్ ఆసుపత్రిలో చేర్పించింది. ఆయనను పరామర్శించి వెళ్తూ బంధువులూ, మిత్రులూ ఆయన చేతిలో పెట్టిన 34 వేల రూపాయలను సైతం అల్లుడు మంతెన సీతారాం ద్వారా సిఐటియు రాష్ట్ర కేంద్రానికే సమర్పించారు. తన ఉద్యమ పథంలో ఆయన వందలాది అదర్శ వివాహాలను చేశారు. పార్టీ హోల్‌టైమర్లకూ, కార్యకర్తలకూ పెళ్లిళ్లు కుదిర్చే వారు. వారి పెళ్లిళ్లకు తానే ఆచార్యత్వం వహించే వారు. వారెలా జీవిస్తున్నారో తెలుసు కునేందుకు ఉత్తరప్రత్యుత్తరాలూ జరిపేవారు (ఇప్పటిలాగా అప్పుడు ఫోన్లు ఉండేవి కాదు). ఎప్పుడైనా భార్యా భర్తల మధ్య స్పర్థలొచ్చాయని తెలిస్తే వారిని కూర్చోబెట్టి సయోధ్య కుదిర్చి పంపేవారు. ఈ విధంగా కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధి కోసం, కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన 'పర్స' కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారు. •

# సామాజిక పోరాటాల వారసత్వాన్ని వామపక్షాలు ముందుకు తీసుకుపోవాలి



– ప్రభాత్ పట్నాయక్

వేరే మాటల్లో చెప్పాలంటే గతంలో అస్థిత్వంలో ఉన్న వ్యక్తికి భిన్నమైన వ్యక్తిని పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి సృష్టిస్తున్నది. నయా ఉదారవాదులు కీర్తించే అభివృద్ధితో మన దేశంలో ఆ పని చేయదలిచారు. అలాంటి అభివృద్ధిని సమర్ధించటానికి పెరిగే ప్రజల ఆకాంక్షల పేరుతో సంపాదనే ధ్యేయంగా ఉండే వ్యక్తిని ముందుకు తెచ్చే పదజాలాన్ని వాడతారు ఇలాంటి క్రమంలో ఆకాంక్షలు అనే పదజాలాన్ని ప్రత్యేకంగా బూర్జువా భావంతో వాడుతున్నారు.

మతకలహాలులేని, మానవతా విలువలు గల సామాజిక క్రమంలో భాగంగా తమ శక్తిసామర్థ్యాలను పెంపొందించుకొనేందుకు అవకాశం గల, మంచి బతుకునిచ్చే మెరుగైన సమాజంలో నివసించాలనే ప్రజల ఆకాంక్షల గురించి అది మాట్లాడదు. అదే జరిగి ఉంటే గుజరాత్ మారణకాండకు నాయకత్వం వహించిన , పేదలను పీడించి అభివృద్ధి చేయబూనే మోడీ మహాపురుషుడుగా కీర్తించబడేవాడు కాదు. ఈ క్రమంలో వాడే "ఆకాంక్షలు" అనే పరిభాష కేవలం వస్తువులను సమూపార్జించటాన్ని సూచించేదిగా మాత్రమే ఉన్నది. కాబట్టి వర్తమాన నయా ఉదారవాదం ముందుకు తెచ్చే అభివృద్ధి ఎజండా ప్రత్యేకంగా సంపాదనాపరులైన వ్యక్తుల సమూహం నివసించే సమాజాభివృద్ధిలో భాగంగానే ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే అది బూర్జువా వ్యక్తి సృష్టికి సంబంధించినదిగానే ఉంటుంది.

అయితే ఇక్కడో అపహాస్య పరిస్థితి ఉన్నది. మన దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి ఈ నయా ఉదారవాద శకంలో కూడా భూస్వామ్య, అర్ధ భూస్వామ్య సామాజిక సంబంధాలను మార్చకుండా, వాటిని బలోపేతం చేస్తూ, వాటిపై నిర్మాణం కొనసాగిస్తున్నది. నయా ఉదారవాద 'అభివృద్ధి' సృష్టించిన 'వ్యక్తి' తనకు నచ్చిన మనిషిని వివాహమాడలేడు. అతను కుల కట్టుబాట్లను ఛేదించలేక, మతపరమైన నమ్మకాలకు దాసుడై కుల, మతపరమైన ఈర్ష్యాద్వేషాల సాధనంగా ఉంటాడు. అలాంటి 'అభివృద్ధి'కి చెందిన మహాపురుషుడు 'వినాయకుడు పురాణ కాల ప్లాస్టిక్ సర్జరీని తెలియజేస్తున్నాడు' అన్నప్పుడు దాన్ని పరిహసించగల శాస్త్రీయ దృష్టి అలాంటి వ్యక్తికి ఉండదు. వేరే మాటల్లో చెప్పాలంటే అతనుగాని లేక ఆమెగాని ఇద్దరూ ఆర్జనా స్వభావం గల బూర్జువా వ్యక్తులే. కానీ వారు బూర్జువా వ్యక్తులు కాలేరు. ఎందుకంటే వారికి బూర్జువా వ్యక్తులకుండాల్సిన 'ఆధునికత' లేదు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో కూడా ఈ 'ఆధునికత' ఉండాల్సినంత లేదు. ఆ దేశాలలో సామ్రాజ్యవాద ప్రభావిత వర్ణ వివక్ష, పితృస్వామిక ధోరణులు విస్తృతంగా ఉన్నాయి. ఇదంతా నిజమే అయినప్పటికీ భారతదేశం వంటి దేశాలలోని బూర్జువా 'వ్యక్తి' ఆధునికతకు, అభివృద్ధి చెందిన దేశాలలోని బూర్జువా వ్యక్తి స్వభావానికి చాలా తేడా ఉంటుంది. భారతదేశం చంద్రగ్రహంపైకి మనుషులను పంపితే ఆ మిషన్ ప్రారంభానికి ముందు దాని విజయం కోసం పూజ తప్పకుండా ఉంటుందని 1970వ దశకంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ అనేవారు. నేటికీ ఆ మాట అక్షర సత్యం.

దీనిలో వామపక్ష కార్యాచరణకు ఒక అంతస్సూచన ఉన్నది. ఖాఫ్ పంచాయతీల వంటి భూస్వామ్య, అర్ధ భూస్వామ్య నిర్మాణాలు 'వ్యక్తి'ని నిర్బంధిస్తున్నాయనే వాస్తవాన్ని బూర్జువా వర్గం తొలగించడానికి బదులు దానితో సర్దుబాటు చేసుకుంటుంది. నయా ఉదారవాద శకంలో కూడా దాన్ని బలోపేతం చేస్తున్నది. 'ఆధునికత' కోసం అనే భావంలో అలాంటి 'వ్యక్తి' అభివృద్ధి కోసం జరిగే పోరాటాలకు వామపక్షం నాయకత్వం వహించాలి. అయితే అదే సమయంలో వ్యక్తి యొక్క సంపాదనాకాంక్ష పెరుగుదలకు వ్యతిరేకంగా వామపక్షం పోరాటం చేయవలసి ఉంటుంది. వేరే మాటల్లో చెప్పాలంటే ఆధునికతను కాకుండా ఆర్జనాకాంక్షను అభివృద్ధి చేసే పెట్టుబడిదారీ వ్యవస్థకు భిన్నంగా వామపక్షం సమిష్టి కార్యాచరణకు ఆవశ్యకమైన ఆధునికతకై పోరాడుతూ, వ్యక్తి సంపాదనాభిలాషను వ్యతిరేకించాలి. ఫూలే, అంబేద్కర్, నారాయణ గురు, పెరియార్‌లు వలస పాలనకు వ్యతిరేకంగా చేసిన సామాజిక పోరాటాల వారసత్వమే అలాంటి అభివృద్ధి. ఏ వారసత్వాన్నైతే నయా ఉదారవాద 'అభివృద్ధి ఎజెండా నాశనం చేయాలని చూస్తున్నదో ఆ వారసత్వాన్ని వామపక్షం ముందుకు తీసుకుపోవాలి.

**( ప్రభాత్ పట్నాయక్ రాసిన 'నయా ఉదారవాద అభివృద్ధి నిజస్వరూపం' వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది. )**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.2. Published on July 1, 2015